epaper.ninadamnews.com
తెలుగు దినపత్రిక
# నినాదం
నిఖార్సైన జర్నలిజం
ఆదివారం, జులై 26, 2026 | సంపుటి - 22 | సంచిక 298 | వెల - 7 | పేజీలు - 12 - 8
Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## పదవులు తాత్కాలికం ప్రజల విశ్వాసమే అంతిమం
• కేంద్ర మంత్రి బండి సంజయ్



వివరాలు 2లో..

'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు.

## అధికారం కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




వివరాలు 2లో..

అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది. అని మాజీ మంత్రి, బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.

# కేంద్రమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్
# రాజీనామా

నీట్ ఆందోళనతో దిగివచ్చిన మంత్రి



వివరాలు 2

నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. శనివారం ఆయన తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్రమోడీకి పంపారు. యువత, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనలకు కేంద్ర మంత్రి దిగొచ్చారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

• దేశ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదనే నిర్ణయం
• యువత ఆకాంక్షలను నెరవేర్చడంతో నైతిక బాధ్యతగా భావించినట్లు ప్రకటన
• రిజిగ్నేషన్ లేఖ ప్రధాని మోడీకి పంపిన మంత్రి

**న్యూఢిల్లీ,జూలై25(నినాదం):** తన రాజీనామా లేఖలో ధర్మేంద్ర ప్రధాన్ పలు విషయాలు వెల్లడించారు. గత నాలు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణలోకి పనిచేస్తున్నామని తెలిపారు. దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చడంతో తన నైతిక బాధ్యతగా భావించినట్లు లేఖలో పేర్కొన్నారు. 2026 మే 3న నిర్వహించిన నీట్ పరీక్షలో అవకతవకలు వెలుగులోకి రావడంతో కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించిందని గుర్తు చేశారు. పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించడంతో పాటు వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. 20 లక్షల మందికి పైగా విద్యార్థుల కోసం తిరిగి పరీక్ష విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జూన్ 21నపరీక్ష విజయవంతంగా పూర్తయిందని తెలిపారు.

• ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం • గాంధీ నుంచే తాముశాంతిని నేర్చుకున్నాం
• ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే • సంబరాల్లో మునిగిపోయిన విద్యార్థులు
• జంతర్‌మంతర్ వద్ద ఉద్రిక్తత • మరోమారు రెచ్చిపోయి పోలీసులపై రాళ్ల దాడి
• పలువురు పోలీసులకు తీవ్ర గాయాలు

## నా దీక్షనే అనుమానిస్తారా...?



వివరాలు 6లో..

• కేంద్రంతో లాలూచీ పడతాననుకున్నారా
• విమర్శలపై సోనమ్ వాంగ్‌చుక్ ఘాటు స్పందన

## నేటితరం యువత ఆలోచనాపరులు




వివరాలు 6లో..

• వారిని అర్థం చేసుకుని ప్రేమగా చర్చించాలి
• ఆదేశాలతో కాదు.. అర్థవంతమైన చర్చలతో సాగాలి
• ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు

## నీట్ రద్దుతో విద్యార్థుల్లో పెరిగిన పట్టుదల



వివరాలు 6లో..

• మరింత మెరుగైన ప్రతిభ కోసం కష్టపడ్డారు
• ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ వ్యాఖ్య

## జంతర్ మంతర్ ఆందోళన ముగింపు



• కేంద్రమంత్రులతో సిజెపి ప్రతిధుల చర్చలు ఫలప్రదం
• విద్యార్థులపై దేశవ్యాప్త కేసుల ఎత్తివేతకు అంగీకారం
• భవిష్యత్‌లో ఎలాంటి కేసులతో విద్యార్థులను వేధించమని హామీ
• ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్

**న్యూఢిల్లీ,జులై 25(నినాదం):** జంతర్ మంతర్ ఆందోళన ముగిసింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సిజెపి చేపట్టిన ఆందోళన ముగించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో తాజా సమావేశం అనంతరం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు తమ ఆందోళనను విరమిస్తున్నామని ప్రకటించారు. జంతర్‌మంతర్ నుంచి విద్యార్థులు, యువత తిరిగి వెళ్లాలని కోరారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తమకు తొలి విజయం దక్కిందని అన్నారు.

▸▸తరువాయి 2లో..


## కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ
ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం



వివరాలు 2లో..

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం విద్యాశాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం మరో మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ప్రస్తుతం కన్జ్యూమర్ ఎఫైర్స్ శాఖ మంత్రిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది.

## ధర్మేంద్రను అభినందించిన షా
ప్రధాని మోదీతో తాజా పరిస్థితులపై చర్చ



**న్యూఢిల్లీ,జూలై25(నినాదం):** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా.. ధర్మేంద్ర ప్రధాన్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్‌ను అమిత్ షా ప్రశంసించారు. దేశ విద్యా వ్యవస్థలో ధర్మేంద్ర ప్రధాన్ ఎన్నో సంస్కరణలు తెచ్చారని కొనియాడారు. విద్యాశాఖలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారని అన్నారు.

▸▸తరువాయి 2లో.

## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

• రెండున్నర ఏళ్లలో దాదాపు 40 శాతం రియల్ వృద్ధి
• త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు
• రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత
• రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,జులై 25 (నినాదం):** రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో

▸▸తరువాయి 2లో..




## చట్టసభల వయోపరిమితి
# 21 ఏళ్లకు తగ్గించాలి

• అప్పుడే యువతకు రాజకీయ అవకాశాలు వస్తాయి • తెలంగాణ అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేస్తాం
• కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సిఎం రేవంత్

చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, అప్పుడే నీతిమంతమైన రాజకీయాలు సాగుతాయని అన్నారు. దేశంలో అధికారంలో వారు భాగస్వాములు కావాల్సి ఉందన్నారు. నీట్ పశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా దిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

▸▸తరువాయి 2లో..

**హైదరాబాద్,జూలై25(నినాదం):** పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్ లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలన్నారు. రాహుల్ ప్రధాని అయితే.. చట్ట సభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు.


## ఎర్రచందనం ముఠాలకు సహకరిస్తే కఠిన చర్యలు
అధికారులకు డిప్యూటీ సిఎం పవన్ హెచ్చరికలు



ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు కఠినమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

వివరాలు 2

## రాయలసీమను రత్నాలసీమగా మారుస్తా



వివరాలు 2లో..

• వేదవతిని త్వరగా పూర్తి చేసి లిఫ్ట్ చేస్తాం
• జొన్నగిరిని స్వర్ణగిరిగా మారుస్తాం
• రాయలసీమ స్కిల్స్‌తో యువతకు ఉపాధి కల్పిస్తా
• కర్నూలు పర్యటనలో సిఎం చంద్రబాబు హామీ

## ఎల్‌నినోతో రైతులకు అండగా నిలవండి

డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సహించండి

మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల సూచన



ఎల్`నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు.

వివరాలు 2

## ఇంద్రకీలాద్రిపై వైభవంగా ఆషాఢ ఉత్సవాలు

27, 28, 29 తేదీల్లో శాకంబరీ ఉత్సవాలకు సన్నాహాలు

7 టన్నుల కూరగాయలను దేవస్థానానికి అందజేసిన వ్యాపారులు

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఆషాడ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న శాకంబరీ ఉత్సవాలకు దేవస్థానం సన్నాహాలను ముమ్మరం చేసింది.



## ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అప్పగింత

**న్యూఢిల్లీ,జూలై25(నినాదం):**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం విద్యాశాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం మరో మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ప్రస్తుతం కన్జ్యూమర్ ఎఫైర్స్ శాఖ మంత్రిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కూడా రాష్ట్రపతి ఆమోదించారు. కర్ణాటకలోని ధార్వాడ్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రహ్లాద్ జోషి.. ఆహార, ప్రజాసరఫరా వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖ వ్యవహారాలను కూడా పర్యవేక్షిస్తున్నారు. భారత్ చొరవతో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌కు ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

# జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు



నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఎత్తేసేందుకు కేంద్రం అంగీకరించిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌కు కేంద్రం సానుకూలంగా స్పందించిందని అన్నారు. తాము ఆశించిన చర్యలను కేంద్రం త్వరిత గతిన తీసుకుంటుందన్న విశ్వాసంతో ఆందోళనను విరమిస్తున్నామని అన్నారు. వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతో పాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు వీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత ఇచ్చింది. నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించినట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. ఢిల్లీ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పెట్టిన కేసులను ఎత్తివేస్తామన్నారు. విద్యావ్యవస్థ, పరీక్షల్లో సమూల మార్పులు చేస్తామని ఇప్పటికే చెప్పాం. భవిష్యత్‌లో ఎవరినీ కేసులతో వేధించబోము. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటాం' అని జేపీ నడ్డా మీడియా ఎదుట హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు ప్రకటించారు. ఆందోళనకారులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని కోరారు. సీజేపీ ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా వారితో సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. నీట్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఎత్తేస్తామని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నిబంధనలకు లోబడి పరిహారం ఇస్తామని చెప్పారు. కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై చేయడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. జంతర్ మంతర్ వేదికగా ఆయన మాట్లాడుతూ బొద్దింకల సత్తా అందరికీ తెలిసొచ్చిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధితులకు న్యాయం దక్కిందని వ్యాఖ్యానించారు. బొద్దింకలు ఒకసారి వస్తే వెళ్లగొట్టడం సాధ్యం కాదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇది విద్యార్థుల విజయమని అన్నారు. తమని తాము బాద్షాలుగా భావిస్తున్న వారిని దారిలోకి తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత ఓట్లతోనే వారు నేడు అధికారంలో ఉన్నారని అన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. పాలకులను అదుపులో ఉంచాల్సిన అవసరం ఉందని కూడా ఉన్నారు. తాము పెట్టిన రెండు డిమాండ్స్ ఇంకా మిగిలే ఉన్నాయని దీప్కే అన్నారు.

## పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం: బండి

**హైదరాబాద్,జులై 25 (నినాదం):**

'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు. ' ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది. ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

## అధికారంలో ఉన్నవారి కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

**హైదరాబాద్,జులై 25 (నినాదం):**

ధర్మేంద్ర ప్రధాన్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది. జెన్ జి ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టీకానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమానికి మహానగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యువతీ యువకులు దండుకట్టి తరలివచ్చారని తెలిసిందే. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై భావోద్వేగంతో ప్రసంగించారు. 'పరీక్ష పే చర్చ పెట్టిన మీరు పేపర్ లీకేజీలపై ఎందుకు పెట్టలేదు? ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?' అని కేంద్రాన్ని నిలదీశారు. ఢిల్లీలో పిల్లలపై దాడులను చూస్తుంటే ఇద్దరు పిల్లల తండ్రినైన తన మనస్సు చలించిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ, రేవంత్ ప్రభుత్వాలపై తనదైన శైలిలో పంచులు విసిరారు. ఢిల్లీలో యువతపై మోదీ సర్కార్ సాగిస్తున్న దమనకాండను కండ్లకుకట్టారు. రేవంత్ దాగుడుమూతలను ఎత్తిచూపారు. ఢిల్లీ వీధుల్లో న్యాయం కోసం పోరాడుతున్న యువకులపై ఉగ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్థాన్ నుంచి నిధులు వస్తున్నాయని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే ఉద్యమిస్తున్న విద్యార్థుల వద్దకెళ్లి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సి ఉండేదన్నారు.

## ధర్మేంద్రను అభినందించిన షా

ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన కొద్దిసేపటికే భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా అత్యవసరంగా భేటీ అయ్యారు.ధర్మేంద్రను అభినందించిన అమిత్ షా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తదనంతర పరిణామాలు, దేశ రాజధానిలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, క్యాబినెట్‌లో మార్పులపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని మోదీ నివాసంలో ఈ భేటీ జరిగింది.

## ఎర్రచందనం ముఠాలకు సహకరిస్తే కఠిన చర్యలు

**అమరావతి,జులై25(నినాదం):**

సీడ్‌బాల్స్ పంపిణీపై అటవీశాఖ అధికారులతో శనివారం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. వెయ్యి ఎకరాల్లో డ్రోన్ల సాయంతో సీడ్ బాల్స్ విసురుతామన్నారు. అటవీ విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణాను ఏ విధంగా అరికడుతున్నదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని తెలిపారు. కడప జిల్లాలో రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై అధికారులతో మాట్లాడారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతోపాటు వారికి సహకరిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు పవన్‌కు తెలియజేశారు.

## రాయలసీమను రత్నాలసీమగా మారుస్తా

**కర్నూలు ,జులై 25 (నినాదం):**

కర్నూలు జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, రాయలసీమ ప్రగతి, తీవ్రమవుతున్న ఆర్థిక, నీటి సంక్షోభాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. రాయలసీమను 'రత్నాల సీమ'గా మారుస్తామని సీఎం ఆకాంక్షించారు. వేదవతి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి, హంద్రీ`నీవా నుంచి నీటిని లిఫ్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. జొన్నగిరి గోల్డ్ మైనింగ్‌తో దానికి 'స్వర్ణగిరి'గా పేరు మార్చామని, 2028 మార్చి నాటికి 'రాయలసీమ స్టీల్స్' అందుబాటులోకి తెస్తామని తెలిపారు. పుట్టపర్తి కేంద్రంగా యుద్ధ విమానాల తయారీ పరిశ్రమను తీసుకొస్తామని, అలాగే రాయలసీమను రూ. లక్ష కోట్లతో 'హార్టికల్చర్ హబ'గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఈ ఏడాది పోలవరం పనులు పూర్తి చేసి, 2027 మార్చి నాటికి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. ఇరాన్ యుద్ధ పరిణామాల వల్ల గ్యాస్, పెట్రోల్ సరఫరా తగ్గి రాష్ట్ర ఆదాయం పడిపోయిందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం 51 శాతం తగ్గడం వల్ల భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయని చెప్పారు. అందుకే ఈ ఏడాది రైతులు వరి పంట వేయవద్దని, ఆరుతడి పంటలు, పండ్లు, కూరగాయలు సాగు చేయాలని సూచించారు. అలూరు నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడిపై సీఎం ఆరా తీశారు. నీటి సరఫరాలో ఆలూరు 18 శాతం వెనుకబడి ఉందని సభలో ప్రజలు చెప్పగా, సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. అలాగే.. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని కోరారు. దంపతులు కూడా ఒకే ఇంట్లో ఉంటూ ఫోన్లకే పరిమితం కావడం సరికాదన్నారు. <Sష్ట్రంలో ఒక దౌర్భాగ్య పార్టీ ఉందంటూ సీఎం మండిపడ్డారు. బాబాయిని గొడ్డలితో చంపి, ఆ నిందను తనపై వేసేందుకు ప్రయత్నించారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో ఎవరు గొడ్డలి ఎత్తినా ఆ చేయి లేకుండా పోతుందని హెచ్చరించారు. తాము అందించే 'సూపర్ సిక్స్' పథకాలతో అభివృద్ధి, సంక్షేమం సమతులంగా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

# కేంద్రమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా



తాను మొదటి రోజు నుంచే బాధ్యత తీసుకున్నాని, ఎగ్జామ్ మాఫియా వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోకుండా కృషి చేశానని పేర్కొన్నారు. జూలై 16న ప్రకటించిన ఫలితాల్లో పేద, వెనకబడిన వర్గాలకు చెందిన అనేక మంది విద్యార్థులు విజయాన్ని సాధించడం సంతోషకరమని అన్నారు. ఇదే సమయంలో బాధ్యతయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థుల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తనను బాధించిందని చెప్పారు. గత 10 రోజులుగా జరిగిన పరిణామాలు కలిచివేశాయని, ఇది నా వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదని స్పష్టం చేసింది. జంతర్ మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, దేశవ్యతిరేక శక్తులు దీనిని ఉపయోగించుకోకుండా ఉండేందుకు, జాతీయ ఐక్యత కాపాడేందుకు, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా ఉండేందుకు, వారు చదువులపై దృష్టి సారించేలా చేయడానే ఉద్దేశంతోనే ప్రధాన మంత్రికి రాజీనామా లేఖ సమర్పించినట్లు వెల్లడించారు. తనపై నమ్మకం ఉంచిన ప్రధాని మోడీకి, కేంద్ర మంత్రివర్గ సహచరులకు, విద్యాశాఖ అధికారులకు థాంక్స్ చెప్పారు. దేశ సేవే తన జీవిత లక్ష్యమని, భవిష్యత్తులోనూ ఒడిశా ప్రజలు, దేశ యువత కోసం సేవ చేస్తూనే ఉంటానని పేర్కొన్నారు.

### ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది. 'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రధాన్ రాజీనామాతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని ఆనందం వ్యక్తం చేశారు. మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

### సంబరాల్లో మునిగిపోయిన విద్యార్థులు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటించిన వెంటనే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. నిరసనకారులు పోలీసులపై రాళ్ల దాడికి దిగారు. నిరసనకారుల రాళ్లదాడిలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. వారి తలలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ పోలీసులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. నిరసనకారులపై లాఠీఛార్జ్ చేశారు. ఈ నేపథ్యంలోనే జంతర్ మంతర్ వద్ద అదనపు బలగాలు మోహరించాయి. ప్రస్తుతం అక్కడి పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు సమాచారం. మరోవైపు విద్యార్థులు సంబరాల్లో మునిగిపోయారు. అభిజిత్‌ను అభినందిస్తూ భుజాలపైకి ఎత్తుకున్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, విద్యార్థులు సాధించిన విజయంగా పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కొన్ని వారాలుగా కొనసాగిన నిరసనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా విద్యార్థులు ఒత్తిడి తెచ్చారని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల సామూహిక సంకల్పానికి లభించిన విజయమని ఆయన అభివర్ణించారు. కాగా, నిరంతర శాంతియుత నిరసనలు మార్పును తీసుకురాగలవని చెప్పడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక నిదర్శనమని అభిజీత్ దిప్కే తెలిపారు. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మీరు భయపడకపోతే, ఈ ప్రభుత్వానికి తలొగ్గకపోతే, మనం ఎవరితోనైనా రాజీనామా చేయించగలమని చెప్పడానికి ఇది నిదర్శనం' అని అన్నారు. అలాగే నీట్ పేపర్ లీక్ వివాదం తర్వాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల పేర్లను దీప్కే గుర్తు చేసుకున్నారు. వారి స్మృతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని నిరసనకారులను కోరారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిరసన ప్రాంగణంలో విద్యార్థుల సంబరాలు హోరెత్తాయి. విద్యావ్యవస్థపై లోపాలను ఎత్తిచూపుతూ పుట్టుకొచ్చిన పార్టీనే సీజేపీ సరిగ్గా రెండు నెలల క్రితం అభిజీత్ దీప్కే దీనిని ఏర్పాటు చేశారు. కొన్ని గంటల్లోనే ఇంటర్నెట్‌లో దాని పేరు మార్మోగిపోయింది. తర్వాత నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో దీప్కే జంతర్ మంతర్ వద్ద ప్రారంభించిన నిరసనలకు భారీ సంఖ్యలో యువత స్పందించింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నిరసన వేదికవద్దకు వచ్చి మద్దతు తెలిపారు. జులై 20న 'చలో పార్లమెంట' మార్చ్, ప్రధాన్ రాజీనామా నుంచి సీజేపీ వెనక్కి తగ్గకపోవడంతో ప్రభుత్వం దిగిరావాల్సి వచ్చింది. ఈ పరిణామాల్లో కీలకంగా వ్యవహరించిన 30 ఏళ్ల దీప్కే.. మహారాష్ట్రలోని పుణెలో జర్నలిజం చదివారు. అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ రిలేషన్స్‌లో మాస్టర్స్ చేశారు.

## చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి



దేశంలో 30శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని ఆకాంక్షించారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే తొలగించాలని, వారి విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోబోమని స్పష్టం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలంతా ఇదే నినాదాన్ని వినిపించాలని సూచించారు. విద్యార్థుల పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని, ఇది యువత సాధించిన విజయమని అన్నారు. విద్యార్థుల మొహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం.. దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం మెడలు వంచినందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. మోదీ చరిష్మా తగ్గిందని, ఆయన చర్యలను ప్రపంచం ఖండించిందని వ్యాఖ్యానించారు. జెన్ జీ యువతకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని మహేష్ గౌడ్ అన్నారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి వచ్చే అవకాశం కల్పించేలా చట్టం తీసుకురావాలని, ఈ మార్పును తెలంగాణ నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, జెన్ జీలు పాల్గొన్నారు.



## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , 40 శాతం వరకు ప్లాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికా బద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ప్లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15`20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2`3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినోతో రైతులకు అండగా నిలవండి

**డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సహించండి**

**మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు**

**మంత్రి తుమ్మల సూచన**

**హైదరాబాద్,జూలై25(నినాదం):**

ఎల్`నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎల్`నినో సవాళ్లకు డ్రిప్, తుంపర సేద్యమే పరిష్కార మార్గమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆ కంపెనీలకు మంత్రి సూచించారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బీఎంఎస్, బీఓక్యూలను పూర్తి చేసి వెంటనే అనుమతుల కోసం పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన, పరిపాలనా అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దని మంత్రి తుమ్మల సూచించారు. డ్రిప్ వ్యవసాయ పద్ధతిలో తక్కువ నీరు, విద్యుత్ ఉపయోగించి అధిక దిగుబడి సాధించవచ్చని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణకు మైక్రో ఇరిగేషన్ కీలకమని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్ సదుపాయాలను వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు హుకుం జారీ చేశారు. అవగాహన కార్యక్రమాల్లో ఆయా కంపెనీలు తప్పనిసరిగా పాల్గొనాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.400 కోట్లు చెల్లించిందని ఈ సందర్భంగా వెల్లడించారు. కంపెనీల పనితీరుపై జిల్లాల వారీగా నిరంతర సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. సూక్ష్మ సాగునీటి విస్తరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు.

## ఇంద్రకీలాద్రిపై వైభవంగా ఆషాఢ ఉత్సవాలు

**విజయవాడ,జులై25(నినాదం):**

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఆషాడ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న శాకంబరీ ఉత్సవాలకు దేవస్థానం సన్నాహాలను ముమ్మరం చేసింది. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీ శాకంబరీదేవి అలంకారంలో ఆకు కూరలు, కూరగాయలు, పండ్లతో అలంకరించబడిన ప్రకృతి మాత స్వరూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల తొలి రోజు అలంకరణ కోసం శ్రీ దుర్గామల్లేశ్వర హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులు, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు బడేటి ధర్మారావు ఆధ్వర్యంలో తొలి విడతగా 7 టన్నుల కూరగాయలను దేవస్థానానికి అందజేశారు. శనివారం సాయంత్రం మహామండపం ఆరో అంతస్తులో దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ అమ్మవారికి కూరగాయలను సమర్పించగా, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాకంబరీ అలంకరణ కోసం కూరగాయల దండల తయారీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాడేపల్లిగూడెం, తణుకు, మడికి, సిద్దాంతం, ఏలూరు ప్రాంతాలతో పాటు గుంటూరు జిల్లా జాగర్లమూడి, తెనాలి, యడ్లపల్లి, నారాకోడూరు, గుంటూరు, కృష్ణా జిల్లా నూజివీడు, చినఓగిరాల, పెదఓగిరాల ప్రాంతాల రైతుల నుంచి వివిధ రకాల కూరగాయలను సేకరించి దేవస్థానం బస్సుల ద్వారా ఇంద్రకీలాద్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది నిర్వహించే శాకంబరీ ఉత్సవాలు ఇంద్రకీలాద్రిలో అత్యంత వైభవంగా జరుగుతాయని, ఈ మూడు రోజుల పాటు వేలాది మంది భక్తులు అమ్మవారిని ప్రకృతి మాత స్వరూపంలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు.

## గుజరాత్‌లో వరదల బీభత్సం

**వల్సాద్‌లో నీట మునిగిన గృహసముదాయాలు**

గాంధీనగర్ : గుజరాత్‌లోని వల్సాద్‌లో భారీ వర్షాలకు నివాస సముదాయాలు నీట మునిగాయి. ఓ వ్యక్తి తన ఇంటి బయట వరద నీటిలో నిలబడి ఉన్న వీడియో వైరల్ అయింది. ఇక్కడ పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ఆ వీడియో చూస్తే తెలుస్తోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా వీధులు, రోడ్లు పూర్తిగా నీట మునిగిపోవడంతో, సదరు యువకుడు తన ఇంటి బయట మెడలోతు వరద నీటిలో నిలబడి పరిస్థితిని వివరించాడు. పార్క్ చేసిన వాహనాలు, ప్రహరీలు, భవనాల పైభాగాలు మాత్రమే బయటకు కనిపిస్తున్న ఈ దృశ్యాలు వరద తీవ్రతను స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ వీడియోలో సదరు వ్యక్తి మునిగిపోయే స్థాయిలో నీరు చేరడం చూసి నెటిజన్లు షాక్ అవుతున్నారు. వీధులు, ఖాళీ స్థలాల మధ్య తేడా తెలియకుండా అంతా జలమయం కావడంతో అక్కడి నివాసితుల దైనందిన జీవితం పూర్తిగా స్తంభించిపోయింది. పట్టణాల్లో అరకొరగా ఉన్న మురుగునీటి పారుదల వ్యవస్థలు, ఈ తరహా ముంపునకు ప్రధాన కారణమని ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ దృశ్యాలు చూసిన పలువురు నెటిజన్లు శివమ్ సింగ్, ఇతర నివాసితులు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని కోరారు. మరోవైపు అధికారులు, రెస్క్యూ టీమ్ ఇప్పటికే పలువురిని సురక్షిత ప్రదేశాలకు తరలించినట్లు సమాచారం.

# యశోద హాస్పిటల్‌లో "లాస్ట్ వార్నింగ్" "ఆఖరి హెచ్చరిక" పుస్తకాల ఆవిష్కరణ




**హైదరాబాద్, జూలై 25 (నినాదం):** ప్రసిద్ధ హెపటాలజిస్ట్ డాక్టర్ కె.ఎస్. సోమశేఖరరావు రచించిన "లాస్ట్ వార్నింగ్" (ఆంగ్లం), "ఆఖరి హెచ్చరిక" (తెలుగు) పుస్తకాలు యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీలో ఆవిష్కరించబడ్డాయి. భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, [illegible] ముఖ్య అతిథులుగా హాజరై, యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. రావుతో కలిసి ఈ పుస్తకాలను విడుదల చేశారు. కాలేయ వ్యాధుల నివారణ, ముందస్తు గుర్తింపు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వీటిని రూపొందించారు. ఈ రెండు పుస్తకాలలో ఆరు అధ్యాయాలు ఉన్నాయి. ప్రతి అధ్యాయం ఒక నిజ జీవిత సంఘటనతో ప్రారంభమై, ఫ్యాటీ లివర్, వైరల్ హెపటైటిస్, సిర్రోసిస్ వంటి వ్యాధుల హెచ్చరిక సంకేతాలు, నివారణ చర్యలు, ఆహారపు అలవాట్లు మరియు టీకాల ప్రాముఖ్యతను సమగ్రంగా వివరిస్తుంది. కాలేయం నిశ్శబ్దంగా పనిచేసే అవయవమని, తీవ్ర దశకు చేరేవరకు లక్షణాలు కనిపించవని, అందుకే వ్యాధి రాకముందే అవగాహన కల్పించడమే అత్యుత్తమ వైద్యమని రచయిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సోమశేఖరరావు వద్ద చికిత్స పొందిన పలువురు 'లివర్ హెల్త్ అంబాసిడర్లకు' పుస్తకాల తొలి ప్రతులను అందజేశారు. ఈ పుస్తకాలను కాలేయ రోగులకు, వారి కుటుంబాలకు అంకితం ఇవ్వడమే కాకుండా రచనకు స్ఫూర్తినిచ్చిన వివేకానంద్ మిశ్రాను ప్రత్యేకంగా సత్కరించారు. సీనియర్ హెపటాలజిస్ట్ అయిన డాక్టర్ కె.ఎస్. సోమశేఖరరావు "సేవ్ ది లివర్ ఫౌండేషన్" ద్వారా ఉచిత ఆరోగ్య శిబిరాలు, ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి విశేష సేవలు అందిస్తున్నారు.



# లులు మాల్‌లో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు

**హైదరాబాద్ బ్యూరో, జూలై 25 (నినాదం):** జూలై 24 నుండి 26 వరకు ప్రత్యేక కార్యక్రమాలు – అమర్ జవాన్ ఫోటో గ్యాలరీని సందర్శించిన మౌంట్ లిటెరా జీ స్కూల్, కూకట్‌పల్లి విద్యార్థులు. భారత సాయుధ దళాల ధైర్యసాహసాలు, శౌర్యం, అత్యున్నత త్యాగాలకు గౌరవంగా లులు మాల్‌లో జూలై 24 నుండి 26 వరకు కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక 'అమర్ జవాన్' ఫోటో గ్యాలరీ రక్షణ రంగానికి సంబంధించిన ప్రదర్శనలు విద్యార్థులు, యువత, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 1999 కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు ఈ కార్యక్రమం ద్వారా ఘన నివాళులు అర్పించారు. భారత సాయుధ దళాల చరిత్ర, వీరత్వం, దేశసేవలో వారి త్యాగాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలను రూపొందించారు. ఈ సందర్భంగా మౌంట్ లిటెరా జీ స్కూల్, కూకట్‌పల్లి విద్యార్థులు, ఉపాధ్యాయులు లులు మాల్‌లోని అమర్ జవాన్ ఫోటో గ్యాలరీని సందర్శించి వీర జవాన్లకు నివాళులర్పించారు. గైడెడ్ వివరణలో కార్గిల్ యుద్ధ విశేషాలు, భారత మిలిటరీ చరిత్ర, సాయుధ దళాల సేవల గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లులు మాల్ రీజినల్ మేనేజర్ షరీఫ్ మాట్లాడుతూ, కార్గిల్ విజయ్ దివస్ ప్రతి భారతీయుడికి గర్వకారణమైన రోజు. మన సాయుధ దళాల ధైర్యసాహసాలు, దేశం కోసం వారు చేసిన త్యాగాలను విద్యార్థులకు తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఒక మంచి వేదికగా నిలుస్తోంది. విద్యార్థులు ఎంతో గౌరవంతో, ఆసక్తిగా అమర్ జవాన్ ప్రదర్శనను సందర్శించడం మాకు ఆనందంగా ఉందన్నారు.


**SMFG Grihashakti**
Nayi Asha. Naya Vishwas.

**SMFG ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**
కార్పొరేట్ కార్యాలయం: 503 & 504, 5వ అంతస్తు, జి-బ్లాక్, ఇన్‌స్పైర్ బికెసి, బికెసి మెయిన్ రోడ్, బాంద్ర కుర్లా కాంప్లెక్స్, బాంద్ర (ఇ), ముంబయి- 400051.
రిజిస్టర్డ్ కార్యాలయం: కమ్మర్‌జోన్ ఐటి పార్క్, టవర్-బి, 1వ అంతస్తు, నం.111, మౌంట్ పూనమల్లీ రోడ్, పోరూర్ చెన్నై-600116. టి.ఎస్.

**స్థిరాస్తి కొరకు స్వాధీనతా ప్రకటన [(అనుబంధం-IV) (రూల్-8(1)]**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ **SMFG ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** ఒక హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఆర్‌బిఐ ద్వారా పూర్తి యాజమాన్య క్రింద) వద్ద తగువిధముగా నమోదైనది (ఇక ముందు **"SMHFC"**గా వ్యవహరించబడును) యొక్క అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీతలకు (పేర్లు క్రింద తెలుపబడ్డాయి) జారీచేసిన డిమాండ్ నోటీసు ప్రకారము సదరు నోటీసులో తెలిపిన బకాయి మొత్తము మరియు దానిపై వడ్డీతో నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది. కానీ సదరు రుణగ్రహీతలు క్రింద తెలిపిన మొత్తమును చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడు సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4) క్రింద నాకు సంక్రమించిన అధికారములు వినియోగించుకొనుచూ దిగువ తెలిపిన ఆస్తిని క్రింది సంతకందారు **స్వాధీనం చేసుకోవడమైనదని** దిగువ తెలిపిన రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది. కావున ప్రత్యేకించి దిగువ తెలిపిన రుణగ్రహీతలను మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదని ఒకవేళ జరిపినట్లయితే **"SMHFC"** వారికి చెందవలసిన బకాయి మొత్తము మరియు దానిపై వడ్డీ క్రింద వర్తించును.

| క్ర. సం. | రుణగ్రహీత(లు)/హామీదారు(లు) పేరు, రుణ ఖాతా నం. | సెక్యూర్డ్ ఆస్తుల (స్థిరాస్తి) వివరణ | డిమాండ్ నోటీసు తేది & మొత్తం | స్వాధీనతా తేది |
|---|---|---|---|---|
| 1. | Lan :- 606139211765312<br>1. అతేటి సుజాత కేరాఫ్ బ్రహ్మం<br>2. అతేటి వెంకట లక్ష్మీ నారాయణ తండ్రి రవిబాబు | తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, ఉప్పల్ మండలం, జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ పరిధిలో నాచారం, బాబా నగర్ దగ్గర రాంరెడ్డి నగర్, బ్లాక్ నెం.6 వద్దగల సర్వే నెం.లు 5, 6, 13 & 14 లో ప్లాట్ నెం.38 పడమర భాగంలో భాగము & ప్లాట్ నెం.38 తూర్పు భాగంపై నిర్మించబడిన, మొత్తం 274 చ.గ.లు లేదా 229.06 చ.మీ.ల విస్తీర్ణంలో 33.5 చ.గ.లు లేదా 28 చ.మీ.ల విస్తీర్ణం గల భూమి అవిభాజ్యవాటాతో పాటు ప్లింత్ ఏరియా (కామన్ ఏరియాలు మరియు కారు పార్కింగ్‌తో కలిపి) 1125 చ.అ.ల విస్తీర్ణం కామాక్షి ఎన్‌క్లేవ్ లోని మున్సిపల్ డోర్ నెం.4-6-21/38/బి/202 (పిటిఐఎన్ నెం.1010422998) గల 2వ అంతస్తులోని నెం.202 గల ఫ్లాట్ ఆస్తి యావత్తు. **మరియు మొత్తం భూమి సరిహద్దులు: ఉత్తరం:** పొరుగువారి భూమి, **దక్షిణం:** 25'-0" వెడల్పు రోడ్డు, **తూర్పు:** ప్లాట్ నెం.37, **పడమర:** ప్లాట్ నెం.38 పడమర భాగంలో భాగము, ఫ్లాట్ నెం.202 **సరిహద్దులు: ఉత్తరం:** కారిడార్, స్టెయిర్‌కేస్ & లిఫ్ట్, **దక్షిణం:** ఖాళీ ప్రదేశం, **తూర్పు:** ఖాళీ ప్రదేశం, **పడమర:** ఖాళీ ప్రదేశం. | 20.04.2026, 10.04.2026 నాటికి రూ. 43,83,442.18/- (రూపాయలు నలభై మూడు లక్షల ఎనభై మూడు వేల నాలుగు వందల నలభై రెండు మరియు పైసలు పద్దెనిమిది మాత్రమే) | 24.07.2026 |
| 2. | Lan :- 622239512066434<br>1. బానోతు ప్రసాద్ తండ్రి బానోతు శంకర్<br>2. బొంత వనిత | ఖమ్మం జిల్లా, కుసుమంచి సబ్ రిజిస్ట్రార్ అధికార పరిధిలో, ఖమ్మం జిల్లా, రఘునాథపాలెం మండలం, మంచుకొండ గ్రామం, ఇంటి నం. 6-10/13 అస్సెస్‌మెంట్ నం. 1520 మంచుకొండ రెవెన్యూ, మంచుకొండ గ్రామపంచాయితి మరియు మంచుకొండ గ్రామఖంతంలో కాళీ భూమికి తగిన మొత్తం విస్తీర్ణం 101.50 చ.గ.లు లేదా 84-46 చ.మీ.లు ఆర్‌సిసి రూఫ్ మరియు ఏసి షీట్ రూఫ్ ఇల్లు ఆర్‌సిసి రూఫ్ ఇంటి నిర్మాణం 166-75 చ.అ.లు. ఏసి షీట్ రూఫ్ ఇల్లి నిర్మాణం 119.71 చ.అ.లు. మరియు దాని ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, ఎలక్ట్రిక్ సర్వీస్ మరియు శానిటరి, అన్ని ఫిక్చర్స్, సర్దుపాటు చేసిన ఆస్తి మరియు ఫిక్స్‌డ్ ఆస్తి పరిమితులు కలిగి ఉంది. **సరిహద్దులు: తూర్పు:** భూక్యా కాంతి ఇల్లు, **పడమర:** గ్రామపంచాయితి రోడ్డు& బానోతు కమల ఇల్లు, **దక్షిణం:** భూక్యా చిన్నరాయుడు ఇల్లు, **ఉత్తరం:** భూక్యా శారదా ఇల్లు&నడక దారి. | 13.04.2026 10.04.2026 నాటికి రూ. 7,17,145.42/- (రూపాయలు ఏడు లక్షల పదిహేడు వేల నూట నలభై ఐదు మరియు పైసలు నలభై రెండు మాత్రమే) | 25.07.2026 |
| 3. | Lan :- 616239211709373 & 616239511735472<br>1. పిన్నోజు శ్రీనివాసులు తండ్రి లక్ష్మీనారాయణ<br>2. కొదురుపాక సౌజన్య | తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో గాజులరామారం గ్రామం వద్దగల సర్వే నెం.లు 314 & 315 లో ఓపెన్ ల్యాండ్‌పై 36.22 చ.గ.ల విస్తీర్ణం గల భూమి అవిభాజ్యవాటాతో పాటు (2318.0 చ.గ.లలో) స్టిల్ట్ ఫ్లోర్‌లో 100.0 చ.అ.ల కారు పార్కింగ్ ఏరియా మరియు 1050.0 చ.అ.ల బిల్టప్ ఏరియాతో (కామన్ ఏరియాతో కలిపి) "వి.ఎస్.ఆర్ టవర్స్"గా పిలువబడే భవనంలో ఫ్లాట్ నెం.203 (2వ అంతస్తులో) యావత్తు. **భూమి కొరకు సరిహద్దులు: ఉత్తరం:** సర్వే నెం.లు 314 & 315లో భూమి, **దక్షిణం:** 30' వెడల్పు రోడ్డు, **తూర్పు:** 30' వెడల్పు రోడ్డు, **పడమర:** సర్వే నెం.లు 314 & 315లో భూమి. **భూమి కొరకు సరిహద్దులు: ఉత్తరం:** ఖాళీ ప్రదేశం & స్టెయిర్‌కేస్, **దక్షిణం:** ఖాళీ ప్రదేశం & లిఫ్ట్, **తూర్పు:** ఖాళీ ప్రదేశం, **పడమర:** కారిడార్. | 22.04.2026, 10.04.2026 నాటికి రూ. 47,65,581.04 (రూపాయలు నలభై ఏడు లక్షల అరవై ఐదు వేల ఐదు వందల ఎనభై ఒకటి మరియు పైసలు నాలుగు మాత్రమే) | 24.07.2026 |

ప్రదేశం: మేడ్చల్-మల్కాజ్‌గిరి, ఖమ్మం, తెలంగాణ,
తేది: 24.07.2026 / 25.07.2026
సం/- అధీకృత అధికారి,
SMFG ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్


# నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యం

**ప్రజలకు అవసరమైన ప్రతి విషయంలో అండగా నిలుస్తూ అందుబాటులో ఉంటా**

**బిఆర్ఎస్ఎల్‌పి విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద**



**కుత్బుల్లాపూర్, జూలై 25 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శనివారం పెట్‌బషీరాబాద్‌లోని తన క్యాంపు కార్యాల యంలో నియోజకవర్గ ప్రజలను కలిసి వారి వినతులు, సమస్యల ను స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల నుంచి వచ్చిన ప్రజలు తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, సంక్షేమ పథకాలు, రెవెన్యూ, విద్యుత్, విద్య, వైద్యం తదితర వ్యక్తిగత, ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఎమ్మెల్యే కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్య ప్రతి వినతిని ఓర్పుతో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిం చడం, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపించడం తన బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు సభ్యులు, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే పదవులా?

**పీసీసీ అధ్యక్షుడికి మాణికొండ కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు**



**రాజేంద్రనగర్, జులై 25 (నినాదం):** మాణికొండ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్ష నియామకంపై స్థానిక నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల బీఆర్ ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన వ్యక్తికి డివిజన్ అధ్యక్ష పదవిని కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నెక్కనంపూర్, మాణికొండ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు శనివారం తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ... మాణి కొండ డివిజన్‌లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారు కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ జెండా మోసి, అంకితభావంతో పనిచేస్తున్న క్షేత్రస్థాయి కార్యకర్తలను, సీనియర్లను పక్కనపెట్టి కొత్తగా వచ్చిన వారికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం ఎంతవరకు సమంజస మని ప్రశ్నించారు. ఈ నిర్ణయం వల్ల పార్టీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ, అసంతృప్తి నెలకొన్నాయని, కష్టపడిన కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. నాయకుల విన్నపంపై పీసీసీ అధ్యక్షు డు సానుకూలంగా స్పందించారు. ఈ అంశంపై జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి తో పూర్తి వివరాలు చర్చిస్తానని తెలిపారు. ప్రస్తుతం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమం ఆగస్టు 3వ తేదీతో ముగియనుం దని, ఆ తర్వాత సంబం ధిత నాయకులను మరోసారి పిలిచి మాట్లాడతానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెక్కనంపూర్ డివిజన్ అధ్యక్షుడు మెరుగు జితేందర్, నాయకులు కిరణ్ కుమార్, లక్ష్మీనారాయణ, ముత్యాలు, మల్లేష్, తాజ్ భాయ్, కె. సతీష్, కె. శ్రవణ్, అఖిల్, శరత్, పురుషోత్తం, పృథ్వీరాజ్, బ్లాక్ అధ్యక్షురాలు ఇందిర, మాణికొండ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సావిత్రి తదితరులు పాల్గొన్నారు.


**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్**
BAJAJ FINANCE
నమోదిత కార్యాలయం: బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, కేరాఫ్ బజాజ్ ఆటో లిమిటెడ్ కాంప్లెక్స్, ముంబయి పూణె రోడ్, అకుర్ది పూణె 411035.
కార్పొరేట్ ఆఫీస్: బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఆఫీస్: పూణే-అహ్మద్‌నగర్ రోడ్, విమన్ నగర్, పూణె 411014
బ్రాంచ్ ఆఫీస్: బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఎస్ఆర్ అనంతుల కాంప్లెక్స్, 1వ అంతస్తు, 1 4 249 153 1 ఎంజి రోడ్, సూర్యాపేట, తెలంగాణ 508216, అధీకృత అధికారి వివరాలు: పేరు: యెండూరి కుమార్,
ఇ-మెయిల్ ఐడి : yenduri.kumar@bajajfinserv.in, మొబైల్ నెం. +91 7799468198/8074464573

అనుబంధం-IV-A (రూల్ 8(6)కు నిబంధనలు చూడుము)
**SARFAESI చట్టం 2002 క్రింద ఇ-వేలం అమ్మకం ప్రకటన**
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("చట్టం") క్రింద యాక్ట్ స్థిరాస్తిల అమ్మకం

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("BFL") లో తనఖా పెట్టిన దిగువ తెలిపిన ఆస్తికి సంబంధించి ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకానికి మరియు రుణగ్రహీతలు / సహ -రుణగ్రహీతలు / తనఖాదారు (ల) కు తెలియజేయునది ఏమనగా, చట్టంలోని నిబంధనల క్రింద BFL అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుచే దిగువ తెలిపిన ఆస్తి స్వాధీనము చేసుకోబడినది, అది దిగువ తెలిపిన మొత్తం మరియు తదుపరి వర్తించు వడ్డీ, ఛార్జీలు మరియు వ్యయాలు మొదలైనవి రాబట్టుకొనుటకు వేలం ద్వార విక్రయించబడును.
దిగువ తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులు దిగువ తెలిపిన మొత్తం బకాయిలను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ (ది రూల్స్) లోని రూల్ 8 & 9 క్రింద **"ఎక్కడ ఏలా ఉన్నదో అక్కడ అలానే, ఉన్నది ఉన్నట్లుగా మరియు అక్కడ ఏమున్నదో అదే ప్రాతిపాదికపై"** విక్రయించబడును:

**ఇ.-వేలం వివరములు**

| | |
|---|---|
| రుణగ్రహీత పేరు & చిరునామా | 1. శ్రీనివాసులు కుసంగి తండ్రి సోమయ్య కుసంగి, నివాసం : 6-6 వలిగొండ వలిగొండ మండలం వలిగొండ నల్గొండ తెలంగాణ 508112, **మరియు: నివాసం:** ఇ.నెం. 6-6, అస్సెస్‌మెంట్ నెం. 1949, సర్వే నెం. 502, వలిగొండ (జి.పి.) వద్ద గల, వలిగొండ (మండలం), యాదాద్రి భువనగిరి (జిల్లా) టి.ఎస్. 5081122. **కూసంగి లావణ్య భర్త శ్రీనివాసులు,** నివాసం: 6-13, వలిగొండ, వలిగొండ నల్గొండ నల్గొండ, తెలంగాణ 508112, సంప్రదించండి: 9948944820, ఇమెయిల్ ఐడి: srinivasulukusangi123@gmail.com |
| రుణ ఖాతా నెం. | PF16 PRO1109 9006 |
| సెక్షన్ 13(2) క్రింద చట్టబద్ధమైన డిమాండ్ నోటీసు తేది & మొత్తం | నోటీసు తేది 14.01.2026<br>డిమాండ్ మొత్తం రూ. 46,49,912/- |
| 25.07.2026 నాటికి రావలసిన బకాయి మొత్తం | రూ. 51,52,835/- (రూపాయలు యాభై ఒక్క లక్షల యాభై రెండు వేల ఎనిమిది వందల ముప్పై ఐదు మాత్రమే) |
| స్థిరాస్తి వివరణ | రిజిస్ట్రేషన్ జిల్లా నల్గొండ మరియు రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా రామన్నపేట, జిపి మరియు ఎంపిపి వలిగొండ, జడ్‌పిపి యాదాద్రి భువనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ గ్రామం మరియు మండలం వద్ద గల సర్వే నెం. 502లో బ్లాక్ నెం. 6 (బస్ స్టాండ్ ఎదురు వైపు) గల నివాస జోన్‌లోపల 373.83 చ.గ.లు లేదా 312.52 చ.మీ.లకు సమానమైన విస్తీర్ణం, 912 చ.అ.ల మొత్తం ఏరియా (బిల్టప్ ఏరియా మరియు ఖాళీ స్థలంతో కలిపి) ఆర్‌సిసి రూఫ్ బిల్టప్ ఏరియా మరియు బ్రిక్ వాల్స్‌తో నిర్మించిన నెం. 6-6 (అస్సెస్‌మెంట్ నెం. 1949) కలిగిన నివాస ఇల్లు యావత్తు. **సరిహద్దులు : తూర్పు:** పల్లెర్ల వీరయ్య ప్లాట్, **పడమర :** కె రమణా రెడ్డి ప్లాట్, **ఉత్తరం :** 12' వెడల్పు రోడ్డు, **దక్షిణం :** 15' వెడల్పు రోడ్డు. |
| రిజర్వు ధర ఐఎన్ఆర్ లో | రూ. 57,27,773/- (రూపాయలు యాభై ఏడు లక్షల ఇరవై ఏడు వేల ఏడు వందల డెబ్బై మూడు మాత్రమే) |
| బయాన | రూ. 5,72,777.3/- |
| ఇ-వేలం తేది & సమయం | 28.08.2026న ఉ. 11.00 నుండి మ. 1.00 గం.ల వరకు |
| ఇ-వేలం పోర్టల్ | https://bankauctions.in |
| బయాన దాఖలుకు ఆఖరి తేది | 27/08/2026 |
| బిడ్ పెంపుదల మొత్తం రూ.లలో | రూ. 25,000/- |
| సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసిన తాకట్టు రుణభారాలు | తెలియదు |
| ఆస్తి తనిఖీ తేది | తేది: 27.07.2026 నుండి 27.08.2026 వరకు పని రోజులలో ముందస్తు అనుమతితో ఉ॥ 9.30 నుండి సా॥ 5 గం.ల వరకు |

సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా రుణగ్రహీతలకు ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా షెడ్యూల్ లో తెలిపిన తేదీన ఏ కారణంగానైనా వేలం విఫలమైతే, సెక్యూర్డ్ క్రెడిటార్ విచక్షన మేరకు ప్రైవేటు ఓప్పందం ద్వారా అమ్మకం ద్వారా సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ను సెక్యూర్డ్ క్రెడిటార్ వారు అమలు చేయుదురు. అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు లింక్ https://bankauctions.in మరియు https://www.bajajfinserv.in/auction-notices రెఫర్ చేయవలెను.
తేది: 25.07.2026
ప్రదేశం: పూణె
అధీకృత అధికారి
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్






## ఎస్సార్ నాయక్ నగర్ సత్యవాణి విద్యా నికేతన్‌లో

# ఘనంగా క్రమశిక్షణ మండలి ఏర్పాటు

**క్రమశిక్షణ మండలి సభ్యులకు స్లాషేస్ బ్యాడ్జీలు అందజేసిన ధను సింగ్**

**కుత్బుల్లాపూర్, జూలై 25 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సుభాష్ నగర్ డివిజన్ ఎస్సార్ నాయక్ నగర్ లోని సత్యవాణి విద్యా నికేతన్ పాఠశాలలో ఘనంగా క్రమశిక్షణ మండలి సభ్యుల ఎంపిక కార్యక్రమం టి వి ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సూరా రవిచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ధర్మాన్ని నువ్వు రక్షిస్తే నిన్ను ధర్మం రక్షిస్తుంది అను నిఘంటువుకు నిలువెత్తు నిదర్శనం గా ధర్మా గ్రూప్, శాంతి గ్రూప్, ప్రేమ గ్రూప్, సత్యా గ్రూప్, 4 నాలుగు విభాగాలకు హౌస్ కెప్టెన్, హౌస్ టీచర్స్ లను నియమించారు. క్రమశిక్షణామం డలి అభ్యర్థుల ఎంపిక కార్యక్రమానికి పూర్వ విద్యార్థి 2002 పదో తరగతి బ్యాచ్ విద్యార్థి డి ధను సింగ్ (హెడ్ కానిస్టేబుల్) విచ్చేసి విద్యార్థిని విద్యార్థులకు స్లాషెస్, బ్యాడ్జీలు అందజేశారు. క్రమశిక్షణ మండలి అభ్యర్థులను సత్యవాణి విద్యా నికేతన్ పాఠశాలలో చదువుతున్న ఏడవ తరగతి ఎనిమిదో తరగతి తొమ్మిదో తరగతి విద్యార్థుల చే ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకోబడ్డారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, సి సి ఏ బాయ్, సి సి ఏ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్ బాయ్, స్పోర్ట్స్ కెప్టెన్ గర్ల్, డిస్టెన్ కెప్టెన్స్, స్కూల్ కల్చరల్ కెప్టెన్స్ లుగా గెలిచిన వారిని స్కూల్ క్యాబినెట్ గా పరిగణించి ముఖ్యఅతిథి ధన్ సింగ్ ప్రమాణస్వీకారం చేయించి, మార్చ్ ఫాస్ట్ ద్వారా గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేను చదువుకున్న పాఠశా లలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావడం నా అదృష్టంగా భావిస్తున్నాన న్నారు. నేను చదువుకున్నప్పుడు స్పోర్ట్స్ కెప్టెన్ గా మీ స్థానంలో ఉండి బ్యాడ్జిని ధరించానని ఆనందో త్సాహంతో మాట్లాడారు. టి వి ఆర్ విద్యాసంస్థల చైర్మన్ టి. కోటి రెడ్డి శిక్షణలో క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉత్తమ విద్యార్థిగా పేరు తెచ్చుకున్నానని తెలిపారు. ఉన్నత విద్యను అవలంబిస్తూ జ్ఞానవంతులుగా క్రమశిక్షణ గల విద్యార్థినీ విద్యార్థులుగా ఎదగాలని, విద్యార్థి దశ నుండి నాయకత్వపు లక్షణాలను అలవర్చుకొని స్నేహపూరితమైన మనస్తత్వాన్ని, పెద్దలు, గురువులు, సమాజం పట్ల గౌరవ మర్యాదలతో మెదిలే విధంగా ఎదగడానికి ఇలాంటి కార్యక్ర మాలు దోహదం చేస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, హౌస్ వైజ్ టీచర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నా రు. స్కూల్ క్యాబినెట్ విద్యార్థినీ విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులను పివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీకృష్ణ రెడ్డి లు అభినందించారు.

## రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలను

# తొలగించిన అధికారులు

**హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు**

**నినాదం కథనానికి స్పందన**


నినాదం
నిఖార్సైన జర్నలిజం
రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలతో..
వాహనదారుల ఇబ్బందులు
పట్టించుకోని అధికారులు




**జవహర్ నగర్, జూలై 25 (నినాదం):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో 100 ఫీట్ల ప్రధాన రహదారి విస్తరణ లెవలింగ్ పనులు శరవేగంగా కొనసాగు తుండగా రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించ కుండానే పనులు చేస్తుండడం తో వాహనదారులు ఇబ్బందులు పడుతు న్నారని ఈనెల 19వ తారీఖున వచ్చిన" నినాదం వార్త కథనానికి" అధికారులు స్పందించారు. వెంటనే అధికారులు శని వారం విద్యుత్ స్తంభాలను ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారు. కథనం వెలబడిన అనంతరం సంబంధిత అధికారులు స్పం దించి రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి సురక్షితంగా పక్కకు మార్చారు. దీంతో ఆ రహదారిపై ప్రయాణిస్తున్న ద్విచక్ర 4 చక్రాల వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాహనాల సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన నినాదం వార్తా కథనానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న విద్యుత్ శాఖ సంబంధిత అధికారులను అభినం దించారు. ఇకపై ఇలాంటి పనులు చేపట్టే ముందు ప్రజల భద్రతకు ప్రాధాన్యతను ఇస్తామని తెలిపారు.


**కెనరా బ్యాంక్** (భారత ప్రభుత్వ రంగ సంస్థ) Syndicate
**అమీర్‌పేట్ 1 బ్రాంచ్,**
రీజినల్ ఆఫీస్ హైదరాబాద్ నార్త్
మొబైల్ : 95056 37024

**బంగారు ఆభరణముల కోసం బహిరంగ వేలం ప్రకటన**

దిగువ తెలిపిన వ్యక్తులకు తెలియజేయునది ఏమనగా అనేక నోటీసులు ఇచ్చినప్పటికీ వారి రుణ ఖాతాలలోని రుణ బకాయిలు తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. వారు రుణ మొత్తాన్ని మరియు ఇతర ఛార్జీలను చెల్లించవలసిందిగా మరియు తనఖాపెట్టిన సెక్యూరిటీలను 30.07.2026 న లేదా ఆలోగా విడిపించుకోవలసిందిగా కోరడమైనది. విఫలమైనచో సదరు సెక్యూరిటీలు బ్యాంక్ సంపూర్ణ విచక్షణాధికారం మేరకు తదరుపరి ఎటువంటి నోటీసు లేకుండా బ్యాంక్ ప్రొసీజర్ ప్రకారం రుణగ్రహీత ఖర్చులపై బహిరంగ వేలంలో బ్యాంకుచే విక్రయించబడతాయి.

| క్ర.సం. | రుణం తేది | రుణం నెం. | రుణగ్రహీత పేరు మరియు చిరునామా | రుణ మొత్తం (రూ) |
|---|---|---|---|---|
| 1 | 09-03-2023 | 180160358280 | నవనీత, ఇం.నెం.13, 6 32 1 కార్వాన్, ఆసిఫ్ నగర్, హైదరాబాద్ - 500 028 | RS.39952/- |

తేది: 25.07.2026
బ్రాంచ్ మేనేజర్


# పిల్లల రక్షణలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం





**జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీ చంద్ర**

**ప్రతి పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ వ్యవస్థను పటిష్టం చేయాలి**

**కలెక్టర్ ప్రతీక్ జైన్**

**నాల్సా స్కీం-2024 కింద చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు సెన్సిటైజేషన్ కార్యక్రమం**

**సంగారెడ్డి బ్యూరో, జూలై 25 (నినాదం):** పిల్లల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీ చంద్ర అన్నారు. జాతీయ న్యాయ సేవా సంస్థ రూపొందించిన చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్స్ స్కీమ్-2024" తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశా ఖతో కుదిరిన అవగాహన ఒప్పందం అమలులో భాగంగా, సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నియమితులైన చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు ఒక రోజు సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని శనివారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో, జిల్లా విద్యాశాఖ సమన్వయంతో కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాని కి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్ జి. భవానీ చంద్ర మరియు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని 239 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 239 మంది ఉపాధ్యాయులను చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా నియమించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. వీరికి పిల్లల రక్షణ, హక్కుల పరిరక్షణ, పాఠశాల స్థాయిలో బాలల సమస్యలను గుర్తించడం, చట్టపరమైన రక్షణ కల్పించడం, సంబంధిత శాఖలతో సమన్వయం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీ చంద్ర మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి సురక్షితమైన, భయ,హింస రహితమైన విద్యా వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తూ, వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను నిశితంగా గమనించాలని సూచించారు. బాలలపై జరిగే వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మాదకద్రవ్యాల ప్రభావం, పోక్సో చట్టం, సైబర్ నేరాలు వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండి, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. పిల్లల రక్షణను అదనపు బాధ్యతగా కాకుండా సమాజానికి చేసే గొప్ప సేవగా భావించాలని ఆమె సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు సమర్థవంతంగా పనిచేస్తే బాలల రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుం దని అన్నారు. పిల్లలతో స్నేహపూర్వక వాతావరణాన్ని ఏర్పరచి వారి నమ్మకాన్ని పొందాలని, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాలు, మానసిక ఆరోగ్యం, బాలల హక్కులు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు వంటి అంశాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, ప్రవర్తనా మార్పులను ప్రారంభ దశలోనే గుర్తించి తల్లిదండ్రులు, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అదనపు పోలీసు సూపరింటెం డెంట్ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, బాలల భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని ఉపాధ్యాయులు అత్యంత బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. పిల్లలపై జరిగే నేరాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగం వంటి అంశాలపై విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పించాలని, పిల్లలు లేదా తల్లిదండ్రులు భయంతో సమస్యలను బయటపెట్టలేని సందర్భాల్లో ఉపాధ్యాయులే ముందుకు వచ్చి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ, చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్ స్కీం 2024 లక్ష్యాలను వివరించారు. పాఠశాల స్థాయిలో పిల్లల సమస్యలను గుర్తించి, అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవా సంస్థతో సమన్వయం చేసుకుని బాధిత బాలలకు ఉచిత న్యాయ సహాయం, కౌన్సెలింగ్, రక్షణ చర్యలు అందేలా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి శ్రీలేఖ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.వి.ఆర్. తేజో కార్తీక్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. ధనలక్ష్మి పాల్గొని పోక్సోచట్టాలు, బాలల హక్కులు, పాఠశాలల్లో చైల్డ్ ప్రొటెక్షన్ మెకానిజం, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారుల బాధ్యతలు, బాలలపై వేధింపులను గుర్తించడం, బాలలకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమగ్ర అవగాహన కల్పించారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. సంజీవ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రాజారెడ్డి, వివిధ శాఖల అధికారులు, జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి నియమితులైన చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు (ఉపాధ్యాయులు), తదితరులు పాల్గొన్నారు.

# యువశక్తి గర్జనకు కేంద్రం తలవంచింది

**కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా స్వాగతార్హం**

**దేశ యువత పోరాట విజయమే**

**బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్**



**సుల్తానాబాద్, జూలై 25 (నినాదం):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనా మా దేశ యువత సాధించిన గొప్ప విజయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ పేర్కొన్నారు. యువత ఐక్యంగా సాగించిన పోరాటం ఫలితంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని, ఇది దేశవ్యాప్తంగా యువత శక్తిని చాటిచెప్పే చారిత్రక ఘట్టమని అన్నారు. యువత గొంతుకకు ప్రజాస్వామ్యంలో విలువ దక్కడం శుభపరిణామమని పేర్కొన్న ఆయన, ఈ పరిణా మం దేశ యు వతకు కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్నారు. యువత ఇదే చైతన్యంతో సామాజి క, జాతీయ అభివృద్ధిలో ముందుండాలని పిలుపు నిచ్చారు.

# నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలి

### తెలకపల్లి పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ ..అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి.
### నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్





**నాగర్ కర్నూల్ జులై 25 (నినాదం):** ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ వైద్యులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రభుత్వ వైద్యులను ఆదేశించారు. శనివారం ఉదయం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ (పీహెచ్‌సీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల తీరును, వైద్యులు, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య అధికారులకు కలెక్టర్ సూచించారు. తనిఖీలో భాగంగా ముందుగా పీహెచ్‌సీలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించిన కలెక్టర్, విధుల్లో అందరూ సమయ పాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల వివరాలు, నమూనాల సేకరణ, పరీక్షల నమోదు, ఫలితాల విడుదల ప్రక్రియపై ఆరా తీశారు. పరీక్షల నివేదికలు సకాలంలో రోగులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందుల నిల్వలను కూడా కలెక్టర్ పరిశీలించారు. సాధారణ రోగాలకు అవసరమైన మందులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే కుక్క కాటు, పాము కాటు చికిత్సకు సంబంధించిన మందులు తగినంత నిల్వలో ఉన్నాయా లేదా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అత్యంతవసర పరిస్థితుల్లో అవసరమయ్యే ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, మందుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీకి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్యుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. చికిత్సతో పాటు రోగుల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా పరిశీలించి అవసరమైన వైద్య సేవలను అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి సకాలంలో వైద్య పరీక్షలు, చికిత్స, మందులు అందేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఆయుష్ విభాగం వైద్యుడికి ప్రత్యేక సూచనలు చేసిన కలెక్టర్, ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలిపై మరింత అవగాహన కల్పించాలని ఆదేశించారు. రోజు వారీ ఆహారపు అలవాట్లు, పోషకాహారం, వ్యాయామం, యోగా, మానసిక ఆరోగ్య పరిరక్షణ, జీవనశైలి సంబంధిత జాగ్రత్తలపై ప్రతి రోగికి అవగాహన కల్పించాలని సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ జర్నల్ ఆసుపత్రికి మైరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వైద్యులు కలెక్టర్ చెప్పారు. రిఫరల్ ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, రోగులు అనవసరంగా ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులు, సిబ్బందిపై ఉందని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగి సంతృప్తిగా తిరిగి వెళ్లేలా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని, ప్రజలకు అందుబాటులో ఉండి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని వైద్యులు, సిబ్బందికి ఆదేశించారు. కలెక్టర్ వెంట తెలకపల్లి మండలస్థాయి అధికారులు వైద్య సిబ్బంది ఉన్నారు.

## బిఎల్ఎలు సమన్వయంతో పనిచేయాలి

### సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి జులై 25 (నినాదం) :** కల్వకుర్తి క్యాంపు కార్యాలయంలో బీఎల్ఏలు, బూత్ సభ్యులతో విస్తృత సమావేశం – ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, పార్టీ బలోపేతంపై కీలక దిశానిర్దేశం కల్వకుర్తి లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గంలోని 6 మండలాల బీఎల్ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు), బూత్ కమిటీ సభ్యులు, టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్, పీబీసీ సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్ లతో కలిసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమావేశంలో పార్టీ బలోపేతం, ఓటరు జాబితా ప్రత్యేక సవ రణ, బూత్ నిర్వహణ, కార్యకర్తల బాధ్యతలు, ప్రజలతో సమన్వయం వంటి అంశాలపై ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించి కీలక దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే కసి నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో పార్టీ బలపడితేనే నియోజకవర్గంలో విజయానికి బలమైన పునాది పడుతుందని అన్నారు. బీఎల్ఏలు, బూత్ సభ్యులు తమ బాధ్యతలను సమర్థవం తంగా నిర్వర్తిస్తూ ప్రతి ఇంటికి చేరుకోవాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమో దయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పేర్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామాలు, తండాలు, వార్డుల్లో పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రతి కార్యకర్త పార్టీకి బలమైన ప్రతినిధిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నాయకులు, బీఎల్ఏలు, బూత్ సభ్యులు సమష్టిగా పనిచేస్తే కల్వకుర్తి నియోజక వర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుం దన్నారు. సమావేశంలో కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, కల్వకుర్తి మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి, తలకొండపల్లి మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, భట్టు కిషన్ రెడ్డి, పోతుగంటి శంకర్, హరి కిషన్ నాయక్, మున్సిపల్ అధ్యక్షులు అవ్వారి శివలింగం, పుస్తకాల రాహుల్ మరియు పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, బీఎల్ఏలు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పనులను నాణ్యతతో చేపట్టాలి

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 25 (నినాదం):** నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రతి పనిపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ శ్రద్ధ వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ సూచించారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం పబ్లిక్ హెల్త్ ఆర్ అండ్ బి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ. 60 కోట్లతో ప్రారంభమైన పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ప్రతి డివిజన్ కు కోటి రూపాయలు కేటాయించారని త్వరలోనే అన్ని డివిజన్లో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తూ పనుల పురోగతిపై సూచనలు ఇవ్వాలన్నారు. అలాగే నూతన పనులపై ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించాలని సూచించారు. ప్రధానగా నగరంలోని రేడియో స్టేషన్ నుంచి ముద క్ పల్లి వరకు రూ. 30 కోట్లతో రోడ్డు ప్రతిపాదించామన్నారు అలాగే ఆర్ యూబీ ల నిర్మాణానికి రూ. 60 కోట్లు, నాందేవ్ వాడ వంతెన పొడిగింపునకు రూ. 100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా అమృత్ 2 కింద మంజూరైన యూజీడీ పనుల్లో వేగం పెరిగిందని తెలిపారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి, డీఈ యోగేందర్, ఏఈ శంకర్, యూ జీ డీ ప్రాజెక్ట్ మేనేజర్ జయశంకర్, ఆర్ అండ్ బి అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## విఠలేశ్వర ఆలయాలను దర్శించుకున్న అర్బన్ ఎమ్మెల్యే




**నిజామాబాద్ ప్రతినిధి, జులై 25 (నినాదం) :** ఆషాడ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి) పురస్కరించుకుని నగరంలోని నాందేవ్ వాడ, బ్రహ్మపురి లో గల విఠలేశ్వర ఆలయాలను శనివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహావిష్ణువు రూపం విఠలేశ్వరుడు అన్నారు. ఏకాదశి నుంచి మహావిష్ణువు యోగ నిద్రలోకి ప్రవేశిస్తాడని పురాణాలు చెబుతున్నాయ న్నారు. హిందూ సాంప్రదాయంలో తొలి ఏకాదశికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఉపవాసం చేసి మహావిష్ణువును ఆరాధిస్తే పాపాలు తొలిగి, ఆయురారోగ్యం, అష్టైశ్వర్యాలు కలుగుతాయని విశ్వాసం అన్నారు. మహారాష్ట్రలో విఠలేశ్వరుడు, రుక్మిణి దేవి ను అత్యధికంగా కొలుస్తారని, ఇందూరులోనూ మహారాష్ట్ర సాంప్రదాయం పాటిస్తారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు మల్కాయి మహేందర్, సుధీర్, జగదీష్ కులకర్ణి, నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం



**ఖమ్మం, జులై 25(నినాదం ):** అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్బంగా స్థానిక జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది మానవ అక్రమ రవాణాకి వ్యతిరేకంగా పని చేస్తున్న ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ మరియు డిఆర్డిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఆర్డిఏ రావుల జయశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి ఈ మానవ అక్రమ రవాణా గురించి అవగాహనా కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసికెళ్తే వాళ్ళు జాగ్రత్త పడి వారి కుటుంబాలు కూడా ఇలాంటి వాటికీ దూరంగా వుంటారు అని తెలిపారు అంతే కాకుండా గత సంవత్సరం ప్రజ్వల సంస్థ ద్వారా మానవ అక్రమ రవాణా పైన శిక్షణ తీసుకున్న హైస్కూల్ టీచర్స్, అంగన్వాడీ టీచర్స్ మరియు గ్రామ దీపికలు మళ్ళీ వారి ప్రాంతాల్లో ఘనంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టినందుకు వారిని ఘనంగా సన్మానించడం జరిగింది. డిపిఎం ఆంజనేయులు మాట్లాడుతూ మెరుగైన సమాజం కోసం సన్మానించబడిన వారిని స్ఫూర్తిగా తీస్కొని మన వంతు పాత్రగా మానవ అక్రమ రవాణా నిర్మూలనకై కృషి చేయాలనీ తెలిపారు తదుపరి ప్రజ్వల సంస్థ రిసోర్స్ పర్సన్స్ సురేష్ కుమార్, భూపాల్ ఈ సమావేశానికి హాజరైన MS Ob లకు, VOA లకు ఈ మానవ అక్రమ రవాణా పైన వీడియోస్ , PPT ద్వారా అవగాహనా కల్పించడం జరిగింది . ఈ కార్యక్రమంలో సురేష్ భూపాల్, హరీష్, ఖమ్మం జిల్లా వివిధ మండలాల నుండి MS-OB', SA's, AWT's, VOA's సిబ్బంది పాల్గొన్నారు.

## బోధన్ నియోజకవర్గ బిఆర్ఎస్ సమన్వయ సమావేశం



**బోధన్ ప్రతినిధి, జులై 25: (నినాదం ):** బోధన్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే షకీల్ అమేర్ నివాసంలో మాజీ ఎమ్మెల్యే షకిల్ సతీమణి అయేషా ఫాతిమా ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ఈ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పార్టీ శ్రేణులు గ్రామాలలో ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావ్, సర్ జిల్లా కోఆర్డినేటర్ సుమిత్ర, బి ఆర్ఎస్ పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షులు రవీంద్ర యాదవ్, మండల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీరారెడ్డి జయంతి సందర్భంగా.. ప్రశాంత్‌రెడ్డి సేవా కార్యక్రమాలు



**నారాయణ పేట ప్రతినిధి, జులై 25, (నినాదం):** మరికల్ మండల కేంద్రంలో మాజీ శాసనసభ్యులు, మాజీ (స్వాజాదీ) ఛైర్మన్, మాజీ డీసీసీబీ బ్యాంక్ ఛైర్మన్, ప్రజానాయకులు కీర్తిశేషులు వీరారెడ్డి జయంతి సందర్భంగా ఆయన తనయుడు, నారాయణ పేట జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మరికల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటగా, అనంతరం ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద శ్రీ వీరారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, వీరారెడ్డి ప్రజల కోసం జీవించిన మహోన్నత నాయకుడని, ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన ఆయన, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఆప్యా యంగా ఆలకించి, వెంటనే పరిష్కరించే నాయకుడిగా ఆయన చిరస్థాయిగా గుర్తుండిపోతారని అన్నారు. అదే సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ, కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి తండ్రి ఆశయాలను ఆచరణలో పెడుతూ ప్రజాసేవనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని నాయకులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ ఛైర్మన్ గొల్ల కృష్ణయ్య, మరికల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు వీరన్న, మాజీ ఎంపీటీసీ గోపాల్, జిల్లా డీసీసీ కార్యదర్శి వెంకట రాములు చారి, గున్ముకుల ఉప సర్పంచ్ నరసింహ, మరికల్ ఉపసర్పంచ్ అన్వర్, బొంత మౌళి, సలీం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరికలు



**ఆర్మూర్ , జులై 25 (నినాదం) :** బాల్కొండ నియోజకవర్గం ఏరుగట్ల మండలానికి చెందిన పలువురు నాయకులు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో శనివారం రోజున బి. ఆర్. ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాదులోని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నివాసంలో ఏరుగట్లమండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. టిఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి వారికి కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని వారు ఆరోపించారు. రాష్ట్ర పాలన సైతం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో నమ్మకం కోల్పోవడంతో టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామని వారు తెలిపారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి కేసీఆర్ హయాం లోనే జరిగిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై పూర్తిస్థాయిలో అసంతృప్తి నెలకొందన్నారు. తిరిగి కెసిఆర్ ఆధ్వర్యం లోనే రైతులకు, మహిళలకు, అన్ని వర్గాల ప్రజలకు పూర్తి విశ్వాసం ఏర్పడడం వల్ల, తిరిగి టీఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్నా రని ఆయన అన్నారు. టిఆర్ఎస్ లో చేరిన సమిష్టిగా కృషిచేసి రాబోయే ఎన్నికల్లో, కేసీఆర్ నాయకత్వంలో టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నుండి టిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో జుంగాల గంగాధర్ (వార్డ్ మెంబర్ ) జోగు చిన్నయ్య, జుంగాల లక్ష్మణ్, జింగాల పెద్ద గంగారం, ఎం. డి. అన్వర్, బర్మా చిన్న గంగారం, పడిగెల ముత్తన్న, పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గుల్లె రాజేశ్వర్, మాజీ ఎంపీపీ, ప్రస్తుత సర్పంచ్ కోల్పాక ఉపేంద్ర, మాజీ ఎంపీటీసీ జక్కాని మధు, సొసైటీ చైర్మన్ బర్మా నరసయ్య, ఈర పట్నం నరసయ్య, ఈర పట్నం నరేష్, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, తదితరులు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ అర్థిక సహాయంతో సొంతింటి కల సాకారం చేసుకోవాలి..

### లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలి
### ప్రతి సోమవారం నిర్మాణ దశకు అనుగుణంగా బిల్లులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ
### ఈర్లపూడిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, జులై 25(నినాదం):** ఈర్లపూడిలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల కు ప్రభుత్వ అర్థిక సహాయాన్ని వినియోగించుకొని త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవా లని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. శనివారం ఖమ్మం నియో జకవర్గం రఘునాథపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈర్లపూడి గ్రామంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా సందర్శించి, పనుల పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, అవసరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యేలా పనులను వేగవంతం చేసేలా అధికారులు సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈర్లపూడి గ్రామంలో మొదటి విడుతలో 160 ఇండ్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఇప్పటివరకు 98 ఇండ్లు పూర్తి అయిన్నాయని, 62 ఇండ్లు వివిధ దశలలో నిర్మాణాలు ఉన్నాయని, ఎక్కవ వరకు గోడల నిర్మాణం పూర్తయి, స్లాబ్ దశలో, నిర్మాణం ఉన్నాయని, లబ్దిదారులకు నిర్మాణంలో ఏలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా పూర్తయిన దశల ప్రకారం ప్రతి సోమవారం బిల్లులను ప్రభుత్వం నేరుగా బ్యాంక్ ఖాతాకు జమచేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఇండ్లు పూర్తి అయిన తర్వాత మొత్తంగా ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వ అర్థిక సాయం లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. ఇప్పటికే అర్హులై పునాది స్థాయి వరకు కట్టుకోలేని వారికి మహిళా సంఘాల ద్వారా రుణం ఇప్పించామని కలెక్టర్ గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి జాప్యం లేకుండా రెవెన్యూ, గ్రామపంచాయతీ, హౌసింగ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అవసరమైన నిర్మాణ సామగ్రి, సాంకేతిక సహాయం, బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులు తమ సొంతింటిలో గృహప్రవేశం చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం పేదల గృహ కలను సాకారం చేయడంలో అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని, లబ్ధిదారులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యతతో కూడిన శాశ్వత గృహాలను నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఈఈ జగ్గారావు, రఘునాథపాలెం తహసీల్దారు శ్వేత, ఎంపీడీవో అశోక్, ఈర్లపూడి సర్పంచ్ గీతా దేవ్ సింగ్, హౌసింగ్ ఏఈ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన్ రాజనీమా ప్రజాస్వామ్యవాదుల విజయం



**ఖమ్మం, జులై 25(నినాదం ):** నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావడానికి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదుల విజయమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు. కాక్రోచ్ సైన్యాన్ని చూసి దేశం గర్వపడుతున్నదని, విద్యార్థులు, యువత ఆగ్రహించి పోరుబాట పడితే, అది ఏ స్థాయిలో ఉంటుందో యావత్ ప్రపంచం మరోసారి చూసిందని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా, బెదిరించినా, భయపెట్టినా, నిర్బంధాలు ప్రయోగించినా, లాఠీలెత్తినా, దేశద్రోహులు, సంఘ విద్రోహులు అని ముద్రవేసినా కూడా యువత వెనుకంజ వేయకుండా ఉద్యమించడంతో కేంద్రం దిగి రాక తప్పలేదన్నారు. విద్యార్థుల పోరాటంలో న్యాయం ఉందని, ధర్మమైనదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. టీ. రామారావు ధర్నాలో పాల్గొని సంఘీభావం ప్రకటించడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. విద్యార్థుల ధర్మమైన ఆగ్రహావేశా లకు పార్లమెంట్ గేట్లు కూడా మూసేయా ల్సిన పరిస్థితి తలెత్తిందంటే వారి బలమెంతో పాలకులు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేస్తూ, దేశంలో ఇక ముందు ఎలాంటి పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా లీక్ కాకుండా, అక్రమాలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవలసిందిగా పాలకులకు హితవు పలికారు.

### రాష్ట్రంలో 4వ స్థానం సాధించిన

## అలంపూర్ ఎస్ ఐ ఆర్

### ఇటిక్యాలలో బిఎల్ఏలతో ప్రత్యేక సమావేశం



**గద్వాల ప్రతినిధి జులై 25 (నినాదం)** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని ఇటిక్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ ) కార్యక్రమంపై మండల బి ఎల్ ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అలంపూర్ మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్. ఏ. సంపత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సర్ ఇన్‌చార్జి సిద్దేశ్వర్ కూడా పాల్గొన్నారు. సమావేశానికి ముందు మండల నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, సిద్దేశ్వర్‌లకు శాలువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న నియోజక వర్గాల జాబితాలో అలంపూర్ నియోజకవర్గం 4వ స్థానంలో, ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి కార్యాచరణ, సర్ కార్యక్రమం అమలు, ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లే విధానం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ప్రతి బూత్‌లో పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు కార్యకర్తల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ అప్పగిం చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలతో నిరంతరం అనుసం ధానంగా ఉండాలని బిఎల్ ఏలకు దిశానిర్దేశం చేశారు. అలాగే, కాంగ్రెస్ అనుకూల ఓటర్లను తొలగించి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపిస్తూ, ప్రతి బీ ఎల్ ఏలు అప్రమత్తంగా ఉండి కాంగ్రెస్ అనుకూల ఓటర్లను కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సర్ ఇన్‌చార్జి సిద్దేశ్వర్, అలంపూర్ నియోజకవర్గ బి ఎల్ ఏల ఇన్‌చార్జి షేక్షావలి ఆచారి, ఇటిక్యాల మండల అధ్యక్షుడు రుక్మానంద రెడ్డి, మండల ఇన్‌చార్జి నాగేష్, జిల్లా నాయకులు, వివిధ గ్రామాల బి ఎల్ ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు.

### మహావిష్ణు మూర్తి దర్శనానికి పోటెత్తిన భక్తులు



**కల్వకుర్తి జులై 25 (నినాదం) :** కల్వకుర్తి ప్రాంతంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి లోని శ్రీ మహావిష్ణు ఆలయాలతో పాటు వివిధ విష్ణు ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయాల్లో విష్ణు సహస్రనామ పారాయణం, భజనలు, హారతులు, ప్రత్యేక ఆరాధనలు వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్షలు పాటిస్తూ శ్రీ మహావిష్ణువుకు మొక్కులు చెల్లించి కుటుంబ సభ్యుల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ప్రార్థించారు. తొలి ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువును దర్శించుకోవడం అత్యంత పుణ్యప్రదమనే విశ్వాసంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్ద సంఖ్యలో ఆలయాలను సందర్శించారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తజన సందోహంతో నిండిపోయి, గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్ల ద్వారా భక్తులకు సౌకర్యవంతంగా దర్శనం కల్పించడంతో పాటు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది, వాలంటీర్లు భక్తులకు సహకా రం అందించారు. మొత్తంగా తొలి ఏకాదశి సందర్భంగా కల్వకుర్తి ఆలయాలు భక్తిశ్రద్ధలతో కళకళలాడగా, భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## గుండియా వాలియా నాయక్ తండాలో ఎస్ఐఆర్ పూర్తి

**కోదేరు, జులై 25 (నినాదం ):** కోదేరు మండల పరిధిలోని గుండియా వాల్యా నాయక్ తండాలో శనివారం నాటికి ఎస్ ఐ ఆర్ పూర్తి అయ్యిందని గ్రామ సర్పంచ్ శివనాయక్ అన్నారు గుండియా నాయక్ వాలియా తండాలో పోలింగ్ స్టేషన్ 60లో 1032 ఓటర్లకు గాను 921 ఓటర్లను ఆన్లైన్ చేయడం జరిగిందని 30 మంది మరణించిన వారు ఉన్నారని 64 మంది డబుల్ పేర్లు ఉన్నాయని 17 మంది మైగ్రేషన్ వలస పోయారని బి ఎల్ ఓ సద్గుణ అన్నారు ఓటర్ నమోదు ప్రక్రియ సజావుగాజరగడానికి సహకరించిన తండావాసులకు కృతజ్ఞతలు తెలిపారు

# నల్గొండ పట్టణాన్ని సూపర్ సిటీగా తీర్చి దిద్దుతా

## హైదరాబాద్ మాదిరిగా నల్గొండలో రోడ్ల అభివృద్ధి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నల్లగొండ ప్రతినిధి జులై 25( నినాదం ): నల్లగొండ పట్టణాన్ని సూపర్ సిటీగా తీర్చిదిద్ది హైదరాబాద్ మాదిరిగా నల్లగొండ రోడ్డును అభివృద్ధి చేస్తానని రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు శనివారం నల్గొండ జిల్లా కేంద్రం, మర్రిగూడ జంక్షన్ వద్ద నామ్ రోడ్డుపై 65 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఫ్లైఓవర్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మర్రిగూడ ఫ్లైఓవర్ జంక్షన్ ను హైదరాబాద్ ఫ్లై ఓవర్ ల మాది రిగా పెయింటింగ్స్, ఆర్ట్స్,ప్రముఖుల చిత్రాలతో మనసుకు ఆహ్లాదాన్ని కలిగించేలా తీర్చిదిద్దడం జరిగిందని చెప్పారు. ఫ్లైఓవర్ వద్ద అందరికీ తెలిసే విధంగా పేర్లు తెలిపే బోర్డ్ ల్ తో పాటు, ఇండికేటర్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.ఫ్లై ఓవర్ నిర్మాణం వల్ల ఆక్సిడెంట్లు తగ్గే అవకాశం ఉందని, నల్గొండ పట్టణ వాసులు కాలుష్యం బారిన పడకుండా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఇదివరకే 750 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డు మంజూరు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.చర్లపల్లి



మర్రిగూడెం తో పాటు, మరికొన్ని చుట్టుపక్కల గ్రామాలలో రోడ్లు,డ్రైన్ల అభివృద్ధికి గాను మట్టి రోడ్డు లేకుండా అన్ని సిసి రోడ్లే వేసేందుకు 300 కోట్ల రూపాయలతో రాష్ట్ర ముఖ్యమంత్రి ముందు కు ప్రతిపాదనలు సమర్పించినట్లు మంత్రి వెల్లడించారు. రైల్వే ట్రాక్ వద్ద ఫ్లైఓవర్ రానుందని వాటి తెలిపారు.రోడ్ల నిర్మాణం సందర్భంగా భూములు కోల్పోయిన రైతులు నష్టపోకుండా గతంలో ఎవరూ చెల్లించని విధంగా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందని మంత్రి వెల్లడించారు. పట్టణంలో ఇటీవలే తాగునీటి పథకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయించడం జరిగిందని, మరో 290 కోట్ల రూపాయల మంజూరుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని ,నెల రోజుల్లో మంజూరు వస్తుందని ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు.నల్గొండ నియోజకవర్గంలో డబుల్ రోడ్ల నిర్మాణంతో పాటు, అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. బ్రాహ్మణ వెల్లెముల వద్ద మినీ ట్యాంక్బండ్ అభివృద్ధి, బక్కతాయికుంట పై భాగంలో 7 కోట్లతో చెరువు పనులకు, పట్టణానికి అవసరమైన అదనపు సబ్ స్టేషన్ ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. తెలంగాణలో ఆర్ అండ్ బి శాఖను రోల్ మోడల్ గా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,స్థానిక కార్పొరేటర్ పెరిక స్వాతి మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పిటిసి గుమ్మలమోహన్ రెడ్డి, కార్పొరేటర్లు బొడ్డుపల్లి లక్ష్మి,గుమ్మల జానకి,నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ జుకురి రమేష్ ,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ పున్నమోహన్,ఈ ఈ శ్రీధర్ రెడ్డి ,డిఈ గణేష్,ఏ ఈ లు ,తహసీల్దార్ పరుశురాం, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రోగి బాధతో ఆసుపత్రిలో చేరి.. సంతోషంగా తిరిగి వెళ్ళాలన్నది ప్రభుత్వ లక్ష్యం






## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జూలై 25(నినాదం): ప్రభుత్వ ఆసుపత్రి కి బాధతో వచ్చే వారు సంతోషంగా తిరిగి వెళ్ళే వెళ్ళాల్లన్నది ప్రభుత్వం లక్ష్యమని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వికారాబాద్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ( జీ జీ హెచ్ ) అభివృద్ధి సొసైటీ సమావేశాన్ని నిర్వహించారు. హాజరైన సొసైటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు గడ్డ ప్రసాద్ కుమార్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డి ఎం డి హెచ్ వో సుధాకర్ లాల్ , జీ జీ హెచ్ సూపరింటెండెంట్ సుభోద్ కుమార్, మున్సిపల్ కమీషనర్ విక్రంసింహా రెడ్డి, సభ్యులు హాజరు కాగా, స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఒక్కో మెడికల్ విద్యార్థి విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం డెబ్బై లక్షలు ఖర్చు చేస్తుందన్నారు. అదేవిధంగా రిక్రూట్మెంట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగం కల్పించిందని తెలిపారు. ప్రభుత్వం చేసిన ఇంతటి సహాయాన్ని పరిగణలోకి తీసుకుని ప్రజలకు సేవ చేయాలని సూచించారు.

అప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఆయన అన్నారు. హోదా హెచ్ వో డి లు హైదరాబాద్ నుండి రోజు వచ్చి పోవడం కాకుండా స్థానికంగా ఉంటే ఎక్కువ సమయం వైద్య సేవలు అందించవచ్చని అందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మెడికల్ కాలేజీ అందుబాటులో ఉన్నదని కాలేజీ అధ్యాపకులతో పాటుగా హాస్పిటల్ హెచ్ వో డి లు కూడా తమ అనుభవాలను విద్యార్థులకు నేర్పాలని అన్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వలన నిధులను పెద్ద ఎత్తున మంజూరు చేయలేకపోతున్నామని అయినప్పటికీ ఉన్నంతలో అవసరమైన మేరకు నిధులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధికంగా ప్రాముఖ్యత ఇస్తున్నదని చెప్పారు. గవర్నమెంట్ హాస్పిటల్ కు అధికంగా పేదలు వైద్యం కోసం వస్తారని అన్నారు. వికారాబాద్ పరిసర గ్రామాలు ఎక్కువ, ఇక్కడ వైద్యం అందక పోతే హైదరాబాద్ పోవాల్సిన పరిస్థితి ఉందని ఈ నేపథ్యంలో పెద్ద జబ్బులకు పేదలు ప్రవేటు హాస్పిటల్ కు వెళ్తే ఖర్చులు తట్టుకోలేరని అందుకు ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఉంటాయని



ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం పేదల కోసం ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల పరీక్షలు, చికిత్సలు, ఆపరేషన్లు చేయడానికి అవసరమైన పరికరాలు, వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి బిల్డింగ్ లు, పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు, ఇతర వసతులు కల్పిస్తుందని అన్నారు. ఎంత ఖర్చు చేసినా డాక్టర్లు, సిబ్బంది నాణ్యమైన వైద్యం చేసి రోగులకు న్యాయం జరిగితేనే ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని అన్నారు. మౌళిక వసతులు కల్పించడం మా బాధ్యత, మంచి చికిత్స అందించడం మీ బాధ్యతని వైద్యులకు సూచించారు. వికారాబాద్ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న వంద బెడ్ల వికారాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ను ముప్పై కోట్ల రూపాయలతో 330 బెడ్లుగా అభివృద్ధి చేయడం జరిగిందని చెప్పారు. యాభై బెడ్ల క్రిటికల్ కేర్ యూనిట్ కూడా త్వరలోనే అందుబాటులోకి రాబోతుందని అన్నారు. వైద్య విద్యార్థులు అందుబాటులో ఉంటారని ఈ తరుణంలో మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లకుండా స్థానిక ఆసుపత్రిలోనే వైద్య సేవలు అందే విదంగా చూడాలని అన్నారు. ముఖ్యంగా యాక్సిడెంట్లు అయినప్పుడు, మొదటి గంట చాలా ముఖ్యమని గోల్డెన్ అవర్ గా భావించి గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తే బతికించవచ్చని వైద్యులు, సిబ్బంది అలర్ట్ గా ఉండాలని అన్నారు. అందుకు 24 గంటలు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని చెప్పారు. అదేవిధంగా అంబులెన్స్ ఎప్పుడు కూడా వర్కింగ్ కండీషన్ లో ఉంచాలని సమాచారం రాగానే నిమిషంలో బయల్దేరే విధంగా చూసుకోవాలని ఆయన చెప్పారు. హాస్పిటల్ కు అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని కోరేది ఒక్కటే రోగులు హాస్పిటల్ కు బాధతో రావాలని, తిరిగి వెళ్ళేటప్పుడు నవ్వుతూ వెళ్ళాలన్నది లక్ష్యమని అన్నారు

# తప్పు ఎవరిది?


## అగ్గువతో అమ్మేశారు... ఆశతో కొనేశారు!

### జీవితం ధారా పోసి మేడలు నిర్మించారు.

### హైడ్రా కూల దోచింది..గూడు కోల్పోయిన వెతలు

### ఎన్ఓసి ఇచ్చిన లంచగొండిలపై చర్యలేవి..?

జగిత్యాల ప్రతినిధి జులై 25 నినాదం : నువ్వు మోస పోతానంటే.. మోసం చేయడం కోసం వందమంది సిద్ధంగా ఉంటారు.. ప్రస్తుతం నడుస్తున్న ట్రెండిదే.. ఈ సామెతకు చక్కని ఉదాహరణ హైడ్రా బాధితులే హైదరాబాద్ మహానగరం.. చాప వెలుపు జాగ దొరికితే బాగుండనే దిగువ తరగతి కుటుంబాలు.. ఆశపడతాయి. నెల నెల జీతం పోగేసి జీవితం ధార పోసి సొంత ఇల్లు కట్టుకోవాలని మధ్యతరగతి కుటుంబీకుల కోరిక. వీళ్ళ అవసరాలను సొమ్ము చేసుకోవడం కోసం అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పొలిటికల్ బ్రోకర్లు కలిసి ఆడిన డ్రామాలో మధ్యతరగతి కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. ప్రభుత్వాన్ని నిందిస్తూ పాలకుల మీద దుమ్మెత్తి పోస్తూన్నారు. కన్నీటి పర్యంతం అవగానే రంగురంగుల మీడియా వండి వార్చింది.. బ్రేకింగ్ న్యూస్ లంటూ ఒక్కటి పది సార్లు తిప్పి తిప్పి చూపించింది. తిరిగి ఇంటి నిర్మాణం చేసుకొని లేని స్థితిలో వేలాది కుటుంబాలు నిచ్చేస్తులై నిస్సహాయ స్థితిలో జీవచ్ఛవాలలాగా బతుకులనీడుస్తున్నారు. బంగారు తెలంగాణలో మహానగరం హైదరాబాద్ మధ్యతరగతి




కుటుంబయులకి ఇచ్చిన బహుమతి.ఇది రంగురంగుల బ్రోచర్లు.. మిరమిడ్లు గొల్పే లేఅవుట్లు.. అడ్డగోలు లంచాలు మేసి అనుమతులు ఇచ్చిన అధికారులు చల్లగా జారుకున్నారు. చెరువుల పక్కన నాలాల కానుకొని ఖాళీ జాగాలను కబ్జా చేసి చెరువులను రూపుమాపి తక్కువ ధరకు అంటగట్టి చేతులు దులుపుకున్న పాపం పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపించిన గులాబీ దళానికి తప్పక తగులుతుందనే శాపనార్ధాలు ఉన్నాయి. ఉద్యోగాన్ని నిచ్చెన మెచ్చుగా చేసుకొని రోజు కూడబెట్టడమే పని కట్టుకొని చెరువులో వేసిన లేఔట్లకు అక్రమ జాగాలకు అడ్డగోలు పర్మిషన్లు ఇచ్చిన అధికారులను వదిలేశా



రనే విమర్శలు ఉన్నాయి.. అగ్గువ ధరనే అని కొనుక్కొని ఇల్లు నిర్మించుకున్న మధ్యతరగతి నిరుపేదల కుటుంబాల ఇల్ల ను హైడ్రా నీలమట్టం చేసింది. తప్పుడు స్థలంలో లేఔట్లు వేసి అమ్మిన రియల్ ఎస్టేట్ వ్యాపారులను ఎందుకు వదిలేస్తున్నారనేది బాధితుల ప్రశ్న.. ఇలాంటి నిషేధిత భూములకు అన్ని అనుమతులు సమకూర్చిన అధికారులపై చర్యలు ఏవి అంటూ సగటు పౌరుడు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం హైడ్రా పేరుతో కూల దోస్తు చెరువులను కుంటలను కాపాడుతున్నామని చెప్పుకుంటుంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఇల్లు కట్టుకున్న నిరుపేదలే అసలు దోషులైతే అంటగ



ట్టిన వ్యాపారస్తులపై చర్యలు లేకపోవడం అడ్డగోలు అవినీతి మేత మేసి అన్ని అనుమతి పత్రాలపై గ్రీనింకు సంతకాలు చేసిన అవినీతి దొంగలను ఎందుకు పట్టుకోవడం లేదంటూ మహానగర ప్రజానీకం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంది. హైడ్ర బాధితులకు కోల్పోయిన సర్వస్వాన్ని.. స్థలాలను అంటగట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారం నుంచి ప్రభుత్వంలో పని చేస్తూ తప్పుడు పత్రాలు జారీ చేసిన అధికారుల నుంచి రికవరీ చేసి నష్టాన్ని పూడిస్తే ప్రభుత్వానికి హైడ్రాకు రాష్ట్రంలో రాష్ట్ర ప్రజల మన్ననలు ఉంటాయని మేధావి వర్గం అభిప్రాయపడుతుంది.



## ఆగస్టు 15 వరకు రోళ్లవాగు ప్రాజెక్టు షెట్టర్ల ఏర్పాటు

### ఆరు నెలల్లో అక్కపల్లి లిఫ్ట్ పనులు పూర్తి..


### నక్కల పేట వద్ద మరో కొత్త లిఫ్ట్ ఇరిగేషన్..మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**జగిత్యాల ప్రతినిధి జులై 25 నినాదం**

ఆగస్టు 15వ తేదీ లోపు రోళ్ల వాగు ప్రాజెక్టు షెట్టర్లు ఏర్పాటుచేసి రోళ్ళవాగు ప్రాజెక్టు లో నీటి నిలువ చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల పై శనివారం హైదరాబాదులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ధర్మపురి నియోజకవర్గంలోని నీటిపారుదల శాఖ ప్రాజెక్టులపై సుదీర్ఘంగా ఇరువురు మంత్రులు అధికారులతో చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలో నిర్మిస్తున్న రోళ్ళవాగు ప్రాజెక్టు కు షెట్టర్లు బిగించి ఆగస్టు 15వ తేదీ వరకు 0.25 టీఎంసీల నీటిని నిలువ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రోళ్ళవాగు ప్రాజెక్టు కాలువల పూడికతీత పనులకు అంచనాల తయారు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ధర్మపురి మండలంలోని అక్కపల్లి లిఫ్ట్ పనులు ఆరు నెలల లోపు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 2027 జనవరి చివరి కల్లా అక్కపల్లి ఎత్తిపోతల పథకం నుండి రైతులకు నీటిని అందించే విధంగా పనులు వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.వెల్గటూర్ మండలంలోని జంగల్నాల ప్రాజెక్టు అభివృద్ధి పనులు, గొల్లపల్లి మండలంలో యశ్వంత్ రావు పేట, రంగధాముని పల్లి చెరువు ఊడిక తీత పనులకు అంచనాలు తయారు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

**నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదించిన మంత్రి అడ్లూరి..**

ధర్మపురి మండలంలోని నక్కల పేట గ్రామంలో నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి సాగునీటిని అందించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ధర్మపురి మండలంలో నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదించడంతో ధర్మపురి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వంలో ధర్మపురి నియోజకవర్గంలో ని రైతులకు కావాల్సిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంతో కమిషన్ల కొరకు మాత్రమే ప్రాజెక్టుల పనులు చేశారని తాము మాత్రం రైతులకు సాగునీరు అందించాలని లక్ష్యంతో ముందుకు సాగుతూ పనులు పూర్తి చేయడానికి ముందుకు సాగుతుందని మంత్రి అడ్లూరి తెలిపారు.



## నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యం

### ప్రజలకు అవసరమైన ప్రతి విషయంలో అండగా నిలుస్తూ అందుబాటులో ఉంటా

### బి.ఆర్.ఎస్.ఎల్.పి, విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద

కుత్బుల్లాపూర్, జూలై 25 (నినాదం): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శనివారం పెట్బషీరాబాద్లోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలను కలిసి వారి వినతులు, సమస్యలను స్వీకరించారు.నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల నుంచి వచ్చిన ప్రజలు తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, సంక్షేమ పథకాలు, రెవెన్యూ, విద్యుత్, విద్య, వైద్యం తదితర వ్యక్తిగత, ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఎమ్మెల్యే కు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్య ప్రతి వినతిని ఓర్పుతో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపించడం తన బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు సభ్యులు, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వేదికపై ఫెర్టీ9 బంజారాహిల్స్కు గుర్తింపు



హైదరాబాద్ బ్యూరో,జూలై 25, (నినాదం) : ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్లోని ఫెర్టీ9 బంజారాహిల్స్ ఫెర్టిలిటీ సెంటర్ అంతర్జాతీయ గుర్తింపు పొందింది. ఈశ్రే –2026, టోక్యో అంతర్జాతీయ సదస్సు, ఆస్పిర్ కాన్ఫరెన్స్లలో ఫెర్టీ9 వైద్య బృందం మొత్తం 19 పరిశోధనా పత్రాలు సమర్పించి సంస్థ ప్రతిష్ఠను చాటింది. ఈ సందర్భంగా ఫెర్టీ9 తన 11 కేంద్రాల్లో నీడిల్–ఫ్రీ ఐ వి ఎఫ్ సేవలను ప్రారంభించింది. అలాగే ఏ ఐ ఆధారిత ఫెర్టిలిటీ పరిశోధనలు, ఇంప్లాంటేషన్ వైఫల్యాల నివారణకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ వెల్లడించింది.

## ధర్మేంద్ర సింగ్ ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం



కల్వకుర్తి జులై 24 (నినాదం): ఢిల్లీలో జరిగిన నీట్ ప్రశ్నా పత్రాల లీకేజి విషయంలో విద్యాశాఖ వైఫల్యం స్పష్టంగా ఉంది.అని దారమోని గణేష్ అన్నారు.ఈ విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, యువకులు, విద్యావేత్తలు ఎంతగా కోరినా కేంద్రం పెడచెవిన పెట్టడం వల్ల పరిస్థితి చేయి దాటింది అన్నారు వాంగ్ చుక్ దీక్ష విషయంలో, కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళన విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఏమాత్రం సమంజసంగా లేదు. అని విద్యార్థుల మీద అమానుషంగా ప్రవర్తించడం ప్రతీ భారతీయుడ్ని కదిలించింది. అందుకే యావత్ దేశం మోడీ ప్రభుత్వం మీద తిరగబడే పరిస్థితి వచ్చింది. ప్రజాగ్రహాన్ని గ్రహించే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇదే రాజీనామా ఓ నెల రోజుల ముందు చేసి ఉంటే, ప్రధాని మోడీ ప్రతిష్ట మరింత పెరిగేది. అనేక మంది రైతులు మరణించిన తర్వాత సాగు చట్టాలను రద్దు చేసినట్లే, అనేక మంది విద్యార్థులు నష్టపోయిన తర్వాత ధర్మేంద్రతో రాజీనామా చేయించడం మోడీ చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లయింది. నీట్ లాంటి జాతీయ పరీక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మరింత బాధ్యతగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నాను. డిజిటల్ విధానంలో పరీక్షలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాను. విద్యార్థులు చేస్తున్న ఉద్యమాన్ని రాజకీయ పార్టీలు హైజాక్ చేయడం వల్ల సమస్య పక్కదారి పడుతుందని, విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వంలో ఉన్న వారు తామే అధికులమని గ్రహించే వైఖరిని ఇప్పటికైనా విడనాడాలి. హామీల అమలు విషయంతో పాటు, అనేక విషయాల్లో వైఫల్యం చెందిన రాష్ట్ర ప్రభుత్వం కూడా తాజా రాజకీయ పరిణామాలతో అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది అని గణేష్ దారమోని ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ... అమీన్పూర్లో రూ.80 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన...

### ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రథమ ప్రాధాన్యత

పటాన్చెరు, జూలై 25 (నినాదం): అమీన్పూర్ పరిధిలోని ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం అమీన్పూర్ డివిజన్లోని ఆర్ఆర్ హోమ్స్, ఎస్ఎస్ అపార్ట్మెంట్, దుర్గా హోమ్స్ కాలనీలలో రూ.80 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నూతన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అమీన్పూర్లో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పైప్లైన్ విస్తరణ పనులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతులను కల్పించి, అమీన్పూర్ను ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు పాల్గొని.. తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.







స్థానికంగా నమోదు చేసుకునే ప్రతి ఓటు అభివృద్ధికి పునాది లాంటిదని తెలిపారు. పటాన్చెరు అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు చంద్రకళ గోపాల్, కృష్ణ, ప్రమోద్ రెడ్డి, జగదీష్, రాజు, చంద్రశేఖర్, రుశ్వంత్ రెడ్డి, దాసు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు ?

సంపాదకీయం

విద్యార్థుల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కాంగ్రెస్, ఆప్ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. తమ కంట్రోల్‌లో తీసుకునేందుకు రాహుల్ నానా యాతన పడుతున్నారు. తానే ముందుండి ఇదంతా నడిపిస్తున్న ట్లుగా వ్యవహరించారు. ప్రధాని మోడీ నివాసం ముందు ఆకస్మిక ధర్నాకు దిగడం, రాష్టా ల్లో మద్దతుగా కాంగ్రెస్ ఆందోళనలకు దిగడం చూస్తుంటే కాంగ్రెస్ రాజకీయ లబ్ది పొందేందుకు ఎత్తులు వేస్తోందని అర్థం అవుతోంది. అభిజిత్ దీప్కే వెనకాల కాంగ్రెస్ ఉందా లేదా అన్నది తెలియదు. ఒకవేళ ఉంటే విద్యార్థులు వెంటనే కాంగ్రెస్‌ను పక్కన పెట్టాలి. ఎందుకంటే విద్యార్థుల ఉద్యమం పక్కదారి పట్టే అవకాశం ఉంది. విద్యార్థులు ఉద్యమించడం ద్వారా ఒక్క నీట్ సమస్య కాకుండా అనేక సమస్యలు, ముఖ్యంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే ఛాన్స్ ఉంటుంది. కాంగ్రెస్‌ను దగ్గరకు రానీయనంతవరకు అభిజిత్ దీప్కే ఉద్యమానికి ఢోకా ఉండదు. ఎందుకంటే నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. యువత కూడా జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనకు రావడంలో నిజాయితీ ఉంది. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో రెండు వర్గాలు గాయపడ్డాయి. ఈ ఉద్యమంలో ప్రధాన ఎజెండా పేపర్ లీకుల నుంచి విషయం తప్పుదారి పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉద్యమంలో యువత పాల్గొంటున్నప్పటికీ, వారితో పాటు కొన్ని మత శక్తులు కూడా ప్రవేశించాయని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా జంతర్ మంతర్ వద్ద అసలైన ఎజెండా పక్కకు పోయి రామమందిరం, హిందూ దేవతల్ని తిట్టడం, జర్నలిస్టులపై దాడులు, భారత సైన్యంపై విద్వేష వ్యాఖ్యలు, జిహాద్ నినాదాలు వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని శక్తులు ఈ ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థి ఉద్యమం మత ఉద్యమంగా మారుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు, నిహాంగ్ సిక్కులు కత్తులు, కిర్పాన్లు, ఈటెలతో కనిపించడం మరింత వివాదాస్పదమైంది. వీటిని ఊపుతూ ప్రదర్శనలు చేయడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. పలువురు మేధావులు కూడా ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమన్వయం లేకపోతే ప్రశాంతమైన ఉద్యమం బయటి శక్తుల ప్రయోజనాలకు ఉపయోగించే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. బుధవారం రాత్రి య ట్యూబర్లపై దాడి, నిరసనకారులు `నిహాంగ్ సిక్కులకు మధ్య ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుతుండటం మహిళల భద్రతకు ప్రమాదంగా మారింది. ఒక యువతిపై లైంగిక వేధింపులకు ప్రయత్నిస్తున్న వీడియో బయటకు రావడం మరింత ఆందోళనకు గురిచేసింది. పేపర్ లీక్ అంశాలతో పాటు మతం, ప్రాంతీయ ఉద్యమాలు, రాజకీయ అంశాలు ప్రస్తావనకు వస్తుండటం చూస్తే ఉద్యమం అసలు లక్ష్యం బలహీనపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై గత కొద్ది రోజులుగా జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. చలో పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీఛార్జ్ నిర్వహించారు. దీంతో చాలా మంది బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా కూడా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. దీంతో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థులకు మద్దతు లభించింది. సినీ, క్రికెటర్లు, విపక్ష రాజకీయ నాయకుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ఈ క్రమంలో తాజాగా జంతర్‌మంతర్ దగ్గర కిలో మీటర్ దూరంలో ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంతాపంగా గాంధీ స్మృతి వనం దగ్గర నివాళులర్పించారు. విద్యార్థులకు ఇండియా కూటమి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇదంతా కూడా కాంగ్రెస్ ఉద్యమాన్ని తన గుప్పిట్లోకి తీసుకుని పోయే యత్నంగా గోచరిస్తున్నది. గత రెండు నెలలుగా పెద్దగా పట్టించుకోని కాంగ్రెస్ అకస్మాత్తుగా ఇప్పుడు ముందువరసలోకి రావడానికి యత్నిస్తోంది. బిజెపి కూడా ఇంతకాలం తాత్సారం చేస్తూ వచ్చింది. పరీక్షల్లో అక్రమాల ఆరోపణలు, పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక పరిపాలనా మార్పులు చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న వినీత్ జోషిని ఆ పదవి నుంచి తప్పిస్తూ, ఆయన స్థానంలో నరేశ్ పాల్ గంగ్వార్ ను నియమించింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన గంగ్వార్, కేంద్రంతో పాటు రాజస్థాన్ ప్రభుత్వంలో కూడా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా సేవలందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సజిపి ప్రధాన డిమాండ్‌గా పెట్టుకుంది. కానీ కేంద్రం ఈ డిమాండ్‌ను పక్కన పెట్టింది. ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఈ నిరసనలో పాల్గొని నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. దీంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. జూలై 20న 'చలో పార్లమెంట' కార్యక్రమానికి పిలుపునివ్వగా, నిరసనకారులు, ఢిల్లీ పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల అనంతరం కేంద్ర ప్రభుత్వం పలుమార్లు సిజిపి ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. అయితే, కేంద్ర మంత్రులే జంతర్ మంతర్ లేదా నిరసన ప్రాంతానికి సవి పంలోని వేదికకు రావాలని కాక్రోచ్ పార్టీ స్పష్టం చేసింది. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరుస చర్యలు తీసుకుంటుండగా, రానున్న రోజుల్లో ఈ అంశంపై మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉద్యమం పక్కదాని పట్టకుండా, రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చూసుకోవాల్సన బాధ్యత అభిజిత్ దీప్కేతో పాటు, ఆయన అనుచరులపై ఉంది.

# నా దీక్షనే అనుమానిస్తారా...?

## కేంద్రంతో లాలూచీ పడతానని అనుకున్నారా


## విమర్శలపై సోనమ్ వాంగ్‌చుక్ ఘాటు స్పందన

**న్యూఢిల్లీ,జూలై25(నినాదం):**

దాదాపు 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఇటీవల కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో దీక్షను విరమించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ నెరవేరకపోయినా తాను ఎందుకు నిరాహార దీక్ష విరమించాల్సి వచ్చిందో తాజాగా సోనమ్ వివరించారు. ప్రభుత్వంతో ఎలాంటి రహస్య ఒప్పందమ చేసుకోలేదని, నిరసనకారుల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై హింసాత్మక చర్యలు జరిగే అవకాశం ఉందన్న ఆందోళన తనకు కలిగిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. గతంలో లడఖ్‌లో జరిగిన పోలీసు చర్యల మాదిరిగా పరిస్థితి మారకూడదనే ఉద్దేశంతో ఉపవాసాన్ని ముగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని అంశాలపై లిఖితపూర్వక హామీ లభించిందని ఆయన తెలిపారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన వారిపై ప్రతీకార చర్యలు ఉండవని, వారి సమస్యలపై చర్చ కొనసాగుతుందని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు అయితే, దీక్ష విరమించడం అంటే ఉద్యమం ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. కాగా, జంతర్ మంతర్‌లో నిరసన చేపడుతున్న సీజేపీ నేతలు మాత్రం తమ ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని వారు వెల్లడించారు. పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజులు చేసిన నిరాహార దీక్షను కేంద్రమంత్రుల సమక్షంలో విరమించిన నేపథ్యంలో.. డీల్ కుదిరిందంటూ ఆయనపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిని ఆయన తీవ్రంగా ఖండించారు. 'నేను చేసిన దీక్ష ఎంత స్వచ్ఛమైందో నిరూపించుకునేందుకు సర్టిఫికెట్ కావాలా.. అని ప్రశ్నించారు. ఈ మేరకు సోషల్ వి డియాలో వీడియో విడుదల చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే దీక్ష విరమించడంపైనా స్పందించారు. దీక్ష విరమించినప్పటి నుంచి చాలా మంది నాకు ఫోన్ చేస్తున్నారు. సోషల్ వి డియాలో పోస్టులు చూపిస్తూ.. వి పై పలు సందేహాలు వస్తున్నాయని చెప్తున్నారు. కేంద్ర



మంత్రుల సమక్షంలోనే ఎందుకు దీక్ష విరమించారు..? ఏం ఒప్పందం జరిగింది..? అని అడుగుతున్నారు. నేను నిరాహార దీక్ష ఎంత పవిత్రంగా చేశానో ఎవరి నుంచైనా సర్టిఫికెట్ తీసుకోవాలా..? ఇలా బేరాలు కుదుర్చుకోవాల్సి వస్తే.. ఎవరైనా 26 రోజులు ఆకలితో ఉంటారా..? ఢిల్లీ ఎండలో రోడ్డు పక్కన కూర్చునే బదులు.. ఏసీ గదిలో కూర్చొని డీల్ చేసుకోలేనా' అని తనపై వస్తోన్న విమర్శలకు వాంగ్‌చుక్ కౌంటర్ ఇచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనేది కచ్చితంగా ముఖ్యమైన విషయం. అయితే నిరసనకారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిరోధించడమే నాకు ప్రాధాన్య అంశంగా అనిపించింది. అందుకే కేంద్రంతో చర్చల సమయంలో రాజీనామా గురించి నేను డిమాండ్ చేయలేదు. రాజీనామాను వ్యక్తిగతంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అనుకోవడం లేదు. దీన్ని కేంద్రం పెద్ద విషయంగా భావించడం లేదు. రాజీనామా అంశాన్ని నిరాకరించడం వల్ల అపారనష్టాన్ని చవిచూస్తోంది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజారుతోంది. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రాజీనామా విషయంలో ఎటూ తేల్చకుండా కేంద్రం ఎక్కువ కాలం నాన్చలేదు. కొన్నిరోజుల్లో మంత్రి రాజీనామా సమర్పిస్తారని నాకు తెలుసు. అందుకే ఆ విషయంలో నేను మరీ ఎక్కువ ఒత్తిడి చేయలేదు' అని వాంగ్‌చుక్ వివరించారు. దీక్ష కొనసాగిస్తున్న సమయంలో.. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్‌మంతర్ నుంచి సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి పరిస్థితులపై తాజాగా వాంగ్‌చుక్ స్పందించారు. ఆ ఆసుపత్రి జైలులా అనిపించింది. ఒక ఖైదీ కంటే తీవ్రంగా పరిగణించారు. చుట్టూ ఆంక్షలే. నేను నా గది నుంచి కూడా రాలేకపోయా. ఎవరిని కలవడానికి అనుమతించలేదు. ముగ్గురు బంధువులను మాత్రం నావద్దకు రానిచ్చారు అంటూ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆయన భార్య గీతాంజలి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయడంతో.. అక్కడి నుంచి మేదాంత ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే.




# నేటితరం యువత ఆలోచనాపరులు

**వారిని అర్థం చేసుకుని ప్రేమగా చర్చించాలి**

**ఆదేశాలతో కాదు..అర్థవంతమైన చర్చలతో సాగాలి**

**ఆరఎసఎస్ చీఫ్ మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, నినాదం:

నేటితరం యువత ఆలోచనాపరులని, వారిని అర్థం చేసుకుని ముందుకు సాగాల్సి ఉందని ఆరఎసఎస్ అధినేత మోహన్ భగవత్ నేటి యువతపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి తరం మార్గదర్శకత్వం లేనిదో లేదా దారి తప్పినదో కాదని స్పష్టం చేశారు. వారిని అర్థం చేసుకోవడానికి ఆదేశాలు ఇవ్వడం కాకుండా అర్థవంతమైన చర్చలు జరపాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఢిల్లీ వీధుల్లో విద్యార్థుల నిరసనలతో వాతావరణం అత్యంత వేడెక్కిన తరుణంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 'విశ్వ మాంగల్య సభ' కార్యక్రమంలో మాట్లాడిన మోహన్ భగవత్ తరాల మధ్య పెరుగుతున్న వ్యత్యాసాన్ని ప్రస్తావించారు. 'మేము యువకులుగా ఉన్నప్పుడు విధేయత చూపించే వాళ్లం. కానీ ఇప్పుడు పరిస్థితులు అలా లేవు. నేటి తరం ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉంది. కాబట్టి మనం వారికి ప్రతి విషయాన్ని కారణాలతో సహా వివరించాల్సి ఉంటుంది. వారిపై ఎనలేని ప్రేమను చూపిస్తూ, వారితో సమయం గడపాలి. కుటుంబాల్లో సంభాషణలు తగ్గిపోతుండటం ఆందోళనకరం. యువత నమ్మకాన్ని గెలవాలంటే హుకుం జారీ చేయడం కాదు, వారితో మాట్లాడాలి. వారికి ఓ ఆత్మీయ భావన కలిగించాలి. ఆదేశాలు జారీ చేయడం కాకుండా చర్చలు జరిపి, ఒక ఏకాభిప్రాయానికి రావడం ముఖ్యం అని భగవత్ పిలుపునిచ్చారు. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనల గురించి భగవత్ ప్రత్యక్షంగా ఎలాంటి ప్రస్తావన చేయకపోయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇతర రాష్టా లకు కూడా పాకిన ఈ సీజేపీ నిరసనలపై ఆయన ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ముఖ్యంగా జూలై 20న పార్లమెంట్ సవిపంలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య జరిగిన తీవ్ర ఘర్షణలు ప్రజా ఆగ్రహాన్ని మరింత పెంచాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. మోహన్ భగవత్ గారు, జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న పరిణామాలపై గత నెల రోజులుగా వి రు పాటిస్తున్న మౌనం వి ఉపన్యాసాల కంటే చాలా శక్తివంతంగా ఉందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ నిరసనల మధ్య ఆరఎసఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్తతరం ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తోందని, యువతకు సమాధానం ఇవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. కొత్తతరంతో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడిపి వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు.ప్రస్తుత సమాజంలో వస్తున్న మార్పులను, యువత ఆలోచనా విధానాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. నేటి కాలంలో ప్రతీది మొబైల్‌లోనే నిక్షిప్తమై ఉందన్నారు. నేటి కుటుంబాల్లోనూ పరస్పర సంభాషణలు తగ్గిపోతున్నాయిని మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలతో మరింత ఆప్యాయంగా మెలగాలని, వారి కోసం సమయం కేటాయించి మాట్లాడాలని ఆయన హితవుపలికారు. ప్రస్తుతం కొత్తతరం ప్రతి అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతోందని, వారికి కేవలం ఆదేశాలు ఇవ్వడం కాకుండా తగిన కారణాలను వివరించాల్సిన బాధ్యత పెద్దలపై ఉందని అభిప్రాయపడ్డారు. విదేశీ దండయాత్రలు, బ్రిటీష్ పాలన వల్ల భారత ప్రజల ఆలోచనా ధోరణి పూర్తిగా మారిపోయిందని ఆరఎసఎస్ చీఫ్ అన్నారు. బ్రిటీష్ పాలన వల్ల మన సాంప్రదాయాలు తప్పని, విదేశీ పద్ధతులే సరైనవనే భావన భారతీయుల్లో పెరిగిందని వ్యాఖ్యానించారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. టెక్నాలజీని మానవాళి శ్రేయస్సు కోసం వాడుకోవాలని సూచించారు. అపరిమితమైన కోరికలు, భౌతికవాదం సమాజంలో పోటీని, సంఘర్షణలను పెంచుతాయని ఆరఎసఎస్ చీఫ్ మోహన్ భగవత్ హెచ్చరించారు.

## హెచ్`1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం అక్కసు

మూడేళ్ల పాటలు వీసాలు నిలిపివేసే బిల్లుకు ప్రతిపాదన

సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు పెట్టిన రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ

న్యూఢిల్లీ,జూలై25(నినాదం):

హెచ్`1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం విధిస్తోన్న ఆంక్షలతో సతమతమవుతున్న భారతీయులను.. ఇప్పుడు మరో బిల్లు ఆందోళనకు గురిచేస్తోంది. రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులో.. కొత్త హెచ్`1బీ వీసాల జారీని మూడు సంవత్సరాల పాటు నిలిపివేయాలని ప్రతిపాదించారు. అలాగే ట్రంప్ యంత్రాంగం విధించిన లక్ష డాలర్ల ఫీజును చట్టబద్ధం చేయాలని పేర్కొన్నారు. అమెరికన్ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉన్న వీసాలను జారీ చేయకూడదని కోరారు. 'ఎండ్ హెచ్`1బీ వీసా యాక్ట' పేరిట ప్రవేశపెట్టిన బిల్లులో ఈ ప్రతిపాదనలు చేశారు. కొన్ని ప్రత్యేక పోస్టులను నిపుణులైన విదేశీయులతో భర్తీ చేసేందుకు ఈ హెచ్`1బీ ప్రోగ్రామ్‌ను తీసుకువచ్చారు. అంతే గానీ అర్హత ఉండి కష్టపడి పనిచేసే అమెరికన్ల స్థానంలో తక్కువ వేతనాలకు లభ్యమయ్యే విదేశీ శ్రామికులతో భర్తీ చేయడానికి కాదు. నేను తీసుకువచ్చిన బిల్లు హెచ్`1బీ ప్రోగ్రామ్ అసలు ఉద్దేశాన్ని నెరవేర్చేందుకు ఉపయోగపడుతుంది. అందులోని లొసుగుల్ని ఉపయోగించుకోకుండా నివారిస్తుందని పేర్కొన్నారు. అందుకోసం మూడేళ్ల పాటు వీసా జారీని నిలిపివేసి, కఠిన నిబంధనలతో మళ్లీ కొత్తగా ఈ ప్రోగ్రామ్‌ను తీసుకురావాలని కోరారు. కొన్ని నెలల క్రితం రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు ఎలీ క్రేన్ ప్రతినిధుల సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏటా ఇస్తున్న 85,000 వీసాలను తగ్గించాలని.. లాటరీ విధానం కాకుండా అత్యధిక జీతం ఇచ్చే వారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని.. హెచ్`1బీ వీసాదారులు భార్యాపిల్లలను అమెరికాకు తీసుకురావడంపై నిషేధం విధించాలనే ప్రతిపాదనలు ఈ బిల్లులో ఉన్నాయి. అయితే ఇది ఉభయసభల్లో ఆమోదం పొందిన తరవాతనే బిల్లుగా మారనుంది.

## ఎఐతో ఉన్న భయాలు తొలగించాలి

ఎఐప ఉన్న అపోహలు తొలగిస్తేనే భవిష్యత్

మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు

న్యూయార్క్ : ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐటీ రంగంలో మానవ ఉద్యోగాలను భర్తీ చేస్తుందనే నిరంతర భయాల కారణంగా ప్రజలు ఏఐ రంగంపై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు. ఉదాహరణకు ఒక సంస్థ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే.. స్థానిక ప్రజలకు అది ఎంత ఉపయోగకరమో వివరించాలన్నారు. అప్పుడే వారు దాని అవసరాన్ని గుర్తిస్తారన్నారు. ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధను వినియోగిస్తున్నారని సత్యనాదెళ్ల అన్నారు. దీంతో రాబోయే ఏఐ యుగం.. మునుపటిలా కాకుండా భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకత కు ఏఐ సాంకేతికత కలిస్తేనే భవిష్యత్ సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని.. మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనకు దోహదపడే టూల్‌గా చూడాలన్నారు. ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించి వారి స్థానంలో ఏఐని తీసుకురాకుండా.. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించాలని కంపెనీలకు ఆయన సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి ప్రస్తుత వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి.. మంచి వేతనాలు నిర్ణయించడానికి కూడా ఏఐని వినియోగించాలని సూచించారు.

## నీట్ రద్దుతో విద్యార్థుల్లో పెరిగిన పట్టుదల

**మరింత మెరుగైన ప్రతిభ కోసం కష్టపడ్డారు**

**ఆర్థికమంత్రి నిర్మలా సీతా రామన్ వ్యాఖ్య**

**న్యూఢిల్లీ,జూలై25(నినాదం):**

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్షల పేపర్ లీకేజీల వివాదంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భిన్నంగా స్పందించారు. పేపర్ లీక్‌లు జరిగినప్పుడు మొదట్లో విద్యార్థులు తీవ్రంగా బాధపడినప్పటికీ, ఆ తర్వాత ఆ సవాలును స్వీకరించి మరింత బాగా చదివి ప్రతిభను మెరుగుపరుచుకున్నారని ఆమె తెలిపారు. ముందు బాధనిపించింది.. తర్వాత దాన్నే అవకాశంగా మలచుకుని మెరుగ్గా రాశామని పలువురు విద్యార్థులు చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలపై ఓ వార్తా సంస్థకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. పరీక్షల పవిత్రతను దెబ్బతీసిన వారిపై సత్వర చర్యలు తీసుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా స్పందించారని మంత్రి చెప్పారు. నిందితుల అరెస్టులు, సకాలంలో మళ్లీ పరీక్షలు నిర్వహించడం, ఫలితాలను విడుదల చేయడం ద్వారా విద్యార్థులు తమ ఉన్నత విద్య వైపు అడుగులు వేయగలుగుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ చర్యల వల్ల ప్రతిపక్షాల విమర్శలకు విలువే లేకుండా పోయింది. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, పేపర్లను అమ్మిన, కొనుగోలు చేసిన నేరస్తుల అరెస్టులు శరవేగంగా జరుగుతున్నాయి' అని ఆమె స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్టీఏకు చెందిన 47 మంది ఉద్యోగులను ప్రభుత్వం తొలగించిందని ఆమె పేర్కొన్నారు.

# రీల్స్ తరం.. నిరసనల చరిత్రను తిరగరాస్తుందా?

ఒకప్పుడు నిరసనలు గ్రామ సభల చర్చల్లో, కళాశాల ప్రాంగణాల్లో, కార్మిక సంఘాల సమావేశాల్లో పుట్టి, వీధులపై అడుగులు వేస్తూ సమాజాన్ని కదిలించేవి. నేడు అదే ఉద్యమాలు ఒక మొబైల్ స్క్రీన్‌పై మొదలై, కేవలం కొన్ని గంటల్లోనే గ్రామం నుంచి దేశ రాజధాని వరకు, అక్కడి నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఒక రీల్, ఒక పోస్టు, ఒక హ్యాష్‌ట్యాగ్ లక్షలాది మందిని ఒకే సమస్య చుట్టూ ఏకం చేసే శక్తిగా మారింది. డిజిటల్ వేదికలు ఇప్పుడు కేవలం సమాచార సాధనాలు కాదు, ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే, నిరసనల దిశను మలిచే కొత్త ప్రజా వేదికలుగా రూపాంతరం చెందుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ ఇప్పటికీ ప్రజాస్వామ్య నిరసనలకు ప్రతీకగా నిలుస్తుండగా, దానికి సమాంతరంగా సోషల్ మీడియా ప్రజా చర్చలు, ప్రజా సమీకరణాలకు వేదికగా మారుతోందని పలువురు పరిశీలకులు భావిస్తున్నారు. ఇక్కడే ఒక కీలకమైన ప్రశ్న ఎదురవుతోంది. నేటి సాంకేతిక పరిణామాలు నిరసనల స్వరూపాన్ని కొత్త దిశగా మలుస్తున్నాయా? లేక వేగవంతమైన స్పందనలను ఉద్యమాలుగా మార్చేస్తున్నాయా? సమాచార వేగం పెరిగిన ఆన్‌లైన్ కాలంలో బాధ్యతాయుతమైన సమాచార వినియోగమే నిజమైన పౌర చైతన్యానికి పునాది.

డిజిటల్ ప్రభావం... మారుతున్న నిరసనల స్వరూపం సోషల్ మీడియా యువతను సామాజిక, రాజకీయ చర్చల్లో మరింత చురుకుగా భాగస్వామ్యం చేస్తోందని అంతర్జాతీయ సంస్థల పరిశోధనలు సూచిస్తున్నాయి. డిజిటల్ వేదికల పరిపాలనకు సంబంధించిన అంశాలపై యునెస్కో 2023లో ప్రచురించిన పలు విధాన సిఫార్సులు భావ ప్రకటనా స్వేచ్ఛ, పారదర్శకత, జవాబుదారీతనం, మానవ హక్కుల పరిరక్షణ మధ్య సమతుల్యత అవసరాన్ని ప్రస్తావించాయి. అయితే అదే సమయంలో తప్పుడు సమాచారం, సందర్భం లేని వైరల్ కంటెంట్ వల్ల ఏర్పడే ప్రమాదాలను కూడా యునెస్కో తన విధాన సిఫార్సుల్లో ప్రస్తావించింది. ప్రపంచవ్యాప్తంగా అనేక సామాజిక ఉద్యమాల్లో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించినప్పటికీ, ప్రతి వైరల్ సందేశాన్ని వాస్తవాలతో ధృవీకరించడం ప్రజాస్వామ్య చైతన్యంలో అత్యంత అవసరమైన అంశంగా మారింది. సమాచారం వేగంగా వ్యాపించే ఈ కాలంలో ప్రజాస్వామ్యానికి అసలు బలం కేవలం వైరల్ ప్రభావంలో కాదు, రాజ్యాంగబద్ధమైన స్వేచ్ఛ, బాధ్యత, వాస్తవాల పట్ల నిబద్ధతలోనే దాగి ఉంది.

నిరసన హక్కు.. ప్రజా ప్రయోజనం

ప్రపంచ ప్రజాస్వామ్యాల అనుభవం కూడా ఒకే విషయాన్ని చెబుతోంది. శాంతియుత నిరసన ప్రజాస్వామ్యానికి అంతర్భాగం, కానీ అది ప్రజా ప్రయోజనం, చట్టబద్ధతతో కలిసి నడవాలి. 1963లో అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో జరిగిన చారిత్రాత్మక పౌరహక్కుల మహా శాంతియుత ర్యాలీ పౌరహక్కుల ఉద్యమ చరిత్రలో మైలురాయిగా నిలిచి, శాంతియుత ప్రజా భాగస్వామ్యం సామాజిక మార్పుకు ఎంత శక్తివంతమైన సాధనమో చూపించింది. 1989లో తూర్పు జర్మనీలో జరిగిన శాంతియుత ప్రజా ఉద్యమాలు బెర్లిన్ గోడ పతనానికి దారితీసిన విస్తృత రాజకీయ, సామాజిక పరిణామాల్లో ముఖ్యమైన అంశంగా చరిత్రకారులు గుర్తిస్తారు. మరోవైపు 2019లో హాంకాంగ్‌లో జరిగిన భారీ ప్రజా నిరసనలు పౌర స్వేచ్ఛలు, ప్రజా శాంతి, చట్ట అమలు మధ్య సమతుల్యతపై ప్రపంచవ్యాప్తంగా విస్తృత న్యాయ, విధాన చర్చలకు దారితీశాయి. ఇదే నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిటీ విడుదల చేసిన 'జనరల్ కామెంట్ నం. 37' శాంతియుత సమావేశ హక్కు ప్రజాస్వామ్య సమాజానికి అత్యంత కీలకమని పేర్కొంటూనే, ప్రజా శాంతి, భద్రత, ఇతరుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైన, చట్టబద్ధమైన, అనుపాతమైన పరిమితులు విధించవచ్చని స్పష్టం చేసింది. అంతర్జాతీయ అనుభవాలు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో నిరసన హక్కు, ప్రజా ప్రయోజనం రెండూ పరస్పర విరుద్ధాలు కావు, అవి సమతుల్యంగా పరిరక్షించాల్సిన విలువలు.

ట్రెండ్ కంటే బాధ్యత గొప్పది

రీల్స్ తరం తమ ఆలోచనలను వేగంగా ప్రపంచానికి చేరవేయగలుగుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి ఒక గొప్ప అవకాశం కూడా, ఒక పెద్ద బాధ్యత కూడా. నిరసనల లక్ష్యం కేవలం వైరల్ కావడం కాదు, సమాజంలో సానుకూల మార్పును తీసుకురావడం. భావోద్వేగం అవసరమే, కానీ వాస్తవాల ఆధారంగా ఆలోచించడం మరింత అవసరం. చర్చలు ఉండాలి, విభేదాలు ఉండవచ్చు, విమర్శలు కూడా సహజమే. అయితే అవన్నీ రాజ్యాంగబద్ధమైన, శాంతియుతమైన, బాధ్యతాయుతమైన మార్గంలో సాగినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. రీల్స్ తరం ప్రజాస్వామ్య చరిత్రలో తన ముద్ర వేయాలంటే ప్రతి వైరల్ వీడియోతో పాటు ప్రతి పౌరుడు వాస్తవాలను గౌరవించే సంస్కృతిని కూడా వైరల్ చేయాలి. అదే రియల్ నిరసన.. అదే రియల్ ప్రజాస్వామ్యం.

**ఫిరోజ్ ఖాన్ సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9640466464**

## ఇది కప్పు తింటే చిటికెలో
# ఒంటి నొప్పులు మాయం..



మినుములతో ఇలా చేసి తింటే ఎన్నో నొప్పులు తగ్గుతాయి. ఇంకా వీటిలో క్యాల్షియం, ఐరన్ ఉంటాయి. ఇవి ఎముకల బలాన్ని పెంచి కండరాలకు కూడా బలాన్ని ఇస్తాయి. ఇంకా పూర్వకాలంలో ప్రసవం తర్వాత వచ్చే నడుము నొప్పులకు ఈ మినుములతో చేసిన వంటకాలు వారికి వండి పెట్టేవాళ్లు.

ఇంకా దీన్ని తినడం వలన వెన్నెముక గట్టిగా అవుతుంది. దీనితో స్వీట్ చేసుకుని తింటే కమ్మగా ఉంటుంది. మినపప్పు, బెల్లం, పాలు వేసి ఈజీగా చేసుకుని తినొచ్చు. కండరాల సమస్యను కూడా తగ్గిస్తుంది. మరి, ఇంకెందుకు లేట్ దీనికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం గురించి ఇక్కడ చదివి తెలుసుకుందాం..

**కావలసిన పదార్థాలు:**
రెండు కప్పుల కప్పు మినుములు, రెండు కప్పుల పాలు, బెల్లం తురుము, పంచదార, రుచికి తగినంత ఉప్పు, మూడు టేబుల్ స్పూన్స్ నెయ్యి, 10 బాదం పప్పు, 5 కిస్‌మిస్, అర టేబుల్ స్పూన్ యాలకుల పొడిని టేస్టీగా ఉంటుంది. అయితే, మీరు వీటిని చేసేటప్పుడు బాగా వేయించి వీటిని తీసుకోవాలి. ముందుగా నల్ల మినుములను తీసుకుని ఒక పాన్ లోవేసి వాసన వచ్చే వరకు వేయించుకోవాలి. ఆ తరవాత వీటిని కొద్ది సేపు చల్లార్చి మిక్సీలో వేసి బరకగా చేసుకోవాలి. ఇప్పుడు ఒక పాత్ర తీసుకుని దానిలో ఈ మినుముల రవ్వ వేసి ఉడికించాలి. అయితే, అడుగంటకుండా దీనిని గరిటెతో కలుపుతూ ఉండాలి.

ఈ రవ్వ ఉడికిన తర్వాత దానిలో బెల్లం వేయాలి. పంచదార కంటే బెల్లం వేస్తే మంచిది శరీరానికి ఐరన్ కూడా దొరుకుతుంది. ఇంకా టేస్ట్ కోసం అర టేబుల్ స్పూన్ యాలకుల పొడి, నెయ్యిలో వేయించిన జీడిపప్పు , పచ్చి కొబ్బరి తురుము కూడా కలిపితే బలమైన మినుముల స్వీట్ రెడీ. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు దీనిని తినొచ్చు.

# వంద రోగాలకు ఒక్కటే మందు..
## ఒంట్లో వండర్స్ సృష్టించాలంటే ఈ కాయల వల్లే సాధ్యం..



ఇది జీర్ణవ్యవస్థ పనితీరును కూడా మెరుగుపరుస్తుంది అలాగే ఆకలిని కూడా పెంచుతుంది. ఈ వాక్కాయలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. అంతేకాదు పాత కాలంలో జ్వరం వస్తే ఇదే తీసుకునేవాళ్ళు ఇంకా దీనిలో యాంటీఆక్సిడెంట్స్ కూడా ఉంటాయి. ఇవి అంటు వ్యాధులతో పోరాడతాయి. జ్వరాన్ని తగ్గించడంలో ఇవి హెల్ప్ చేస్తాయి.

ఇవి ఎక్కువగా వానాకాలంలోనే దొరుకుతాయి ఇంకా ఈ సీజన్ లో దొరికే వాక్కాయను ఆహారంలో తీసుకోవడం వలన ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఇంకా దీనిలో విటమిన్లతో పాటు మెగ్నీషియం కూడా ఉంటుంది. ఇది సిరోటోనిన్ ను ఉత్పత్తి చేయడంలో హెల్ప్ చేస్తుంది.

**వాక్కాయ జ్యూస్...**
మీరు ఈ వాక్కాయ జ్యూస్ తాగడం వలన గుండె ఆరోగ్యంగా ఉంటుంది ఇది ఎంతో మేలు చేస్తుంది కూడా. ఇంకా ఇవి గుండె కండరాలను కూడా బలపడేలా చేస్తుంది. ఇంకా మీరు రోజూ 15 మి.లీ వాక్కాయ రసం తీసుకుంటే తక్షణ శక్తిని ఇస్తుంది. మీ బాడిలోని మంటను కూడా ఇది పూర్తిగా తగ్గిస్తుంది. ఇంకొందరు దీనిని పప్పులాగా చేసుకుని తింటారు.

# ఫ్రోజెన్ ఫుడ్‌తో జర జాగ్రత్త.!
## మీ వంటగదిలో అస్సలు ఉండకూడని ఆహార పదార్థాలు.. యమ డేంజర్..!

ఎక్కువ కాలం నిల్వ ఉండేలా ప్రాసెస్ చేయబడిన ఆహారాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు నిపుణులు. వీటిలో సోడియం, ప్రిజర్వేటివ్‌లు, ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా ఉండవచ్చు. వీటిని తరచుగా తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు, గుండె ఆరోగ్యం, జీర్ణవ్యవస్థ ప్రభావితం కావచ్చు. ఈ 7 రకాల నిల్వ ఉండేలా ప్రాసెస్ చేసిన ఆహారాలు ప్రమాదకరమైనవి. ఇవి మాత్రమే కాకుండా, ఏ ప్రాసెస్ చేసిన ఆహారమైనా అధిక ప్రమాదకరమే. మార్చి 19, 2026న అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను తినడం గుండె ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తుందని తేలింది. చిప్స్, ఫ్రోజెన్ మీల్స్, చక్కెర పానీయాలు, ప్యాక్ చేసిన స్నాక్స్ వంటి ఆహార పదార్థాలను ఎక్కువగా తినే వ్యక్తులకు గుండెపోటు, పక్షవాతం లేదా గుండె జబ్బులతో మరణించే ప్రమాదం గణనీయంగా ఎక్కువగా ఉంటుంది.




అమెరికాలో నిర్వహించిన ఒక పెద్ద అధ్యయనంలో రోజుకు సుమారు 9 సేర్విన్స్ అతిగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తినే వ్యక్తులకు, కేవలం ఒక సేర్విన్గ్ తినేవారితో పోలిస్తే గుండెపోటు లేదా పక్షవాతం వచ్చే ప్రమాదం 67 శాతం ఎక్కువగా ఉందని తేలింది. అలాగే ప్రతి అదనపు సేర్విన్గ్‌కు ఈ ప్రమాదం 5 శాతానికి పైగా పెరిగింది. మొత్తం కేలరీలు, ఆహార నాణ్యత, సాధారణ ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా ఈ ఫలితాలు మారలేదు. అలాగే, నిల్వ ఉంచి ప్రాసెస్ చేసిన ఆహారం ఎంత ప్రమాదకరం అనేవి నివేదికలు చెబుతున్నాయి.

**ఫ్రోజెన్ పరాటాలు:**



తీరిక లేని రోజుల్లో దుకాణాల్లో అమ్మే ఫ్రోజెన్ పరాటాలు చాలా సౌకర్యవంతంగా అనిపించవచ్చు. అయితే, వాటిని పిండితో తయారు చేస్తారు. వాటిలో పీచుపదార్థం చాలా తక్కువగా ఉంటుంది. వాటిలో అధిక మొత్తంలో ఉప్పు, నిల్వచేసే పదార్థాలు కూడా ఉండవచ్చు. వాటిని తరచుగా తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం, బరువు పెరగడం, రక్తపోటు సమస్యలు వంటివి తలెత్తవచ్చు. ఇంట్లో తయారుచేసుకున్న పరాటాల కంటే ఇవి తక్కువ ఆరోగ్యకరమైనవి.

**ఫ్రోజెన్ ఫ్రెంచ్ ఫ్రైస్:**

ఫ్రోజెన్ ఫ్రెంచ్ ఫ్రైస్ చాలా మందికి, ముఖ్యంగా పిల్లలకు చాలా ఇష్టమైనవి. వీటిని త్వరగా వండుకోవచ్చు కాబట్టి ఇంట్లో తరచుగా



వాడుతుంటారు. అయితే, ఇవి నూనెలో ముందుగా వేయించి ఆ తర్వాత గడ్డకట్టించిన ప్రాసెస్ చేసిన బంగాళాదుంపలు. వీటిలో సోడియం, ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా ఉంటాయి. వీటిని తినడం తాత్కాలికంగా రుచిగా అనిపించవచ్చు. కానీ అవి శరీరానికి పోషకాలను అందించవు. వీటిని ఎక్కువగా తినడం వల్ల బరువు పెరగడం, గుండె సమస్యలు పెరిగే అవకాశం ఉంది. ఇది పిల్లలకు అలవాటుగా మారితే అది వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది

**ప్రాసెస్ చేసిన మాంసం:**

ఎక్కువ కాలం పాడవకుండా నిల్వ చేసే మాంసంలో ప్రోటీన్ ఉంటుంది కాబట్టి అది ఆరోగ్యకరమైనదని చాలా మంది భావిస్తారు. అయితే, దీనిని తరచుగా సోడియం, నిల్వచేసే పదార్థాలు కలిపి ఎక్కువ కాలం నిల్వ ఉంచుతారు. కొన్నిసార్లు, ఇందులో సంతృప్త కొవ్వులు కూడా అధికంగా ఉంటాయి. వీటిని తరచుగా తినడం వల్ల అధిక రక్తపోటు, గుండె సమస్యల ప్రమాదం పెరగవచ్చు. దీర్ఘకాలంలో ఇది దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. తాజా మాంసంతో పోలిస్తే నిల్వ చేసిన మాంసం పోషక విలువ కొంత తక్కువగా ఉంటుంది.

**ఫ్రోజెన్ పాస్తా:**

ఫ్రోజెన్ పాస్తాలో కూరగాయలు ఉండటం వల్ల అది ఆరోగ్యకరంగా అనిపించవచ్చు. కానీ దానిలో క్రీమ్, నూనె మరియు సోడియం అధికంగా ఉంటాయి. అంతేకాకుండా, ఇందులో నిల్వచేసే పదార్థాలు కూడా ఉంటాయి. ఈ ఆహారాలు తాత్కాలికంగా రుచిగా అనిపించినప్పటికీ, అవి శరీరం నుండి పోషకాలను క్షీణింపజేస్తాయి. వీటిని తరచుగా తినడం వల్ల బరువు పెరగడం, రక్తంలో చక్కెర స్థాయిలు అస్థిరంగా ఉండటం, జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు.

**ఫ్రోజెన్ శాండ్‌విచ్‌లు:**
ఫ్రోజెన్ శాండ్‌విచ్‌లను త్వరిత అల్పాహారంగా లేదా స్నాక్‌గా ఉపయోగిస్తారు. వీటిలో ప్రాసెస్ చేసిన మాంసం, చీజ్, సాస్‌లు, పిండితో చేసిన బ్రెడ్ అధికంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల కడుపు నిండినట్లు అనిపించినప్పటికీ, ఇవి జీర్ణం కావడానికి కష్టంగా ఉంటాయి. వీటిని తరచుగా తినడం వల్ల గ్యాస్, అజీర్ణం, రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగడం వంటి సమస్యలు వస్తాయి. వీటిలో ప్రిజర్వేటివ్‌లు అధికంగా ఉంటాయి. ఇవి దీర్ఘకాలంలో శరీరానికి హానికరంగా మారవచ్చు.



**వేపుడు కూరగాయలు:**

నిల్వ ఉంచిన వేపుడు కూరగాయలను వండటం సులభం. అయితే, వాటిలో తరచుగా సాస్‌లు, ఉప్పు అధికంగా ఉంటాయి. కొన్నిసార్లు వాటిలో చక్కెర కూడా ఉంటుంది. వీటిని తినడం వల్ల కూరగాయలలోని పోషకాలు తగ్గిపోతాయి. వీటిని తరచుగా తినడం వల్ల జీర్ణ సంబంధిత రుగ్మతలు, గుండె ఆరోగ్య సమస్యలు, రక్తంలో చక్కెర సమస్యలకు దారితీయవచ్చు.



**వాఫిల్స్:**

చాలా మంది అల్పాహారంగా లేదా డెజర్ట్‌గా వాఫిల్స్ తినడానికి ఇష్టపడతారు. వీటిని తరచుగా పిండితో తయారు చేస్తారు. వీటిలో చక్కెర ఎక్కువగా ఉంటుంది. వీటిపై చాక్లెట్ సిరప్, తేనె వంటివి కలపడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగవచ్చు. వీటిలో కృత్రిమ రుచులు, నిల్వచేసే పదార్థాలు కూడా ఉండవచ్చు. వీటిని తరచుగా తినడం వల్ల అకస్మాత్తుగా శక్తి పెరిగి, ఆ తర్వాత అలసట రావచ్చు.

**మొత్తమ్మీద ప్రాసెస్ చేసిన ఆహారాలు**

సౌకర్యవంతంగా ఉండవచ్చు. కానీ వాటిలో దాగి ఉన్న ఉప్పు, కొవ్వు, నిల్వచేసే పదార్థాలు శరీరానికి హానికరంగా ఉంటాయి. వీలైనంత వరకు తాజా ఆహారాలు తినడం ఆరోగ్యానికి మంచిది. ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు కూడా దీర్ఘకాలంలో ఆరోగ్యంపై పెద్ద ప్రభావాలను చూపుతాయి. అందుకే వీలైనంత వరకు అటువంటి ఆహారాలకు దూరంగా ఉండటం మంచిది.

# ఏఐ రంగంపై ప్రజలకు నమ్మకం పోతోంది: సత్యనాదెళ్ల

ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐటీ రంగంలో మానవ ఉద్యోగాలను భర్తీ చేస్తుందనే నిరంతర భయాల కారణంగా ప్రజలు ఏఐ రంగం పై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు. ఉదాహరణకు ఒక సంస్థ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే.. స్థానిక ప్రజలకు అది ఎంత ఉపయోగకరమో వివరించాలన్నారు. అప్పుడే వారు దాని అవసరాన్ని గుర్తిస్తారన్నారు.



ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధను వినియోగిస్తున్నారని సత్యనాదెళ్ల అన్నారు. దీంతో రాబోయే ఏఐ యుగం.. మునుపటిలా కాకుండా భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకతకు ఏఐ సాంకేతికత కలిస్తేనే భవిష్యత్ సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని.. మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనకు దోహదపడే టూల్‌గా చూడాలన్నారు.

2030 కల్లా 2 లక్షల కోట్ల డాలర్లకు కంప్యూట్ మార్కెట్‌పై ఏఎమ్‌డీ అంచనా
ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించి వారి స్థానంలో ఏఐని తీసుకురాకుండా.. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించాలని కంపెనీలకు ఆయన సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి ప్రస్తుత వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి.. మంచి వేతనాలు నిర్ణయించడానికి కూడా ఏఐని వినియోగించాలని సూచించారు.

# గగనతలం నుంచే నిఘా




దేశీయ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ కీలక అడుగు వేసింది. శత్రువుల కదలికలను గగనతలం నుంచే పసిగట్టే అత్యాధునిక 'ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్' మార్క్-2 వ్యవస్థల సంయుక్త అభివృద్ధి కోసం అదానీ డిఫెన్స్, రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా 6 ఎయిర్‌బస్ ఏ321 విమానాలను అత్యాధునిక మిషన్ వ్యవస్థలతో తీర్చిదిద్దుతారు. వీటికి దాదాపు 30 ఏళ్లపాటు సమగ్ర లాజిస్టిక్స్, మరమ్మతులు, సాంకేతిక తోడ్పాటును ఈ భాగస్వామ్య సంస్థలే అందిస్తాయి. వీటిని 2032-33 నాటికి వాయుసేనలో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. గగనతల నిఘా పరిధి పెంచడానికి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఈ వ్యవస్థ దోహదం చేయనుంది.

'నేత్ర' విజయంతో...:
బెంగళూరులోని సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్ (సీఏబీఎస్) అభివృద్ధి చేసిన 'నేత్ర' నిఘా వ్యవస్థ విజయవంతం కావడంతో, తయారీకి గత నెలలో తుది అనుమతులు లభించాయి. ఈ స్ఫూర్తితోనే తదుపరి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. గగనతలంలో వేల మీటర్ల ఎత్తు నుంచి పర్యవేక్షించే ఈ వ్యవస్థల వల్ల 'సరిహద్దుల్లో తక్కువ ఎత్తులో వచ్చే ముప్పులనూ ముందే పసిగట్టడం' వీలవుతుంది. ఈ సాంకేతికతతో అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, చైనా, స్వీడన్ సరసన భారత్ చేరనుంది.

స్వదేశీ టర్బోజెట్ ఇంజిన్: రక్షణ రంగంలోని హైదరాబాద్ సంస్థ ఆజాద్ ఇంజినీరింగ్, డీఆర్‌డీఓ భాగస్వామ్యంతో కలిసి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఎక్స్‌పెండబుల్ టర్బోజెట్ ఇంజిన్ తయారు చేసింది. 350 కేజీల థ్రస్ట్ క్లాస్ సామర్థ్యం ఉన్న ఈ ఇంజిన్ డీఆర్‌డీఓ విభాగానికి చెందిన గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (జీటీఆర్‌ఈ) రూపకల్పన చేసింది. ఆజాద్ ఇంజినీరింగ్ 24 నెలల వ్యవధిలో దీనిని తయారు చేసి, అప్పగించింది. ఈ టర్బోజెట్ ఇంజిన్లను యాంటీ-షిప్ క్షిపణులు, యాంటీ-డ్రోన్ వ్యవస్థలు, మానవరహిత వైమానిక వాహనాల తయారీలో వినియోగించనున్నారు.

# స్మార్ట్‌ఫోన్లు మరింత భారం.. ప్రాసెసర్ ధరలు పెంచనున్న క్వాల్‌కామ్!

ప్రముఖ కంపెనీలు ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతుండటంతో సెమికండక్టర్ విభాగానికి డిమాండ్ పెరుగుతోంది. అదే స్థాయిలో మెమొరీ చిప్‌ల కొరత, విడిభాగాల తయారీ ఖర్చు తడిసి మోపెడవుతోంది. దీంతో ప్రపంచ టెక్ కంపెనీలు తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. యాపిల్, శాంసంగ్ వంటి పలు కంపెనీలు ఇప్పటికే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలను పెంచేశాయి. ప్రపంచంలోనే నంబర్‌వన్ చిప్ తయారీ సంస్థ తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ (టీఎస్‌ఎంసీ) కూడా చిప్ ధరలను పెంచేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కస్టమర్‌గా ఉన్న శాన్‌డియాగో కంపెనీ క్వాల్‌కామ్ కూడా తన ప్రాసెసర్ ధరలను




రెండంకెల శాతానికి పెంచుతుండటం గమనార్హం దీంతో స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ల ధరలు మరింత ప్రియమయ్యే అవకాశం ఉంది.

వ్యయ ధరల పెరుగుదల కారణంగా క్వాల్‌కామ్ తన ప్రాసెసర్ ధరలను పెంచనున్నట్లు కొన్ని అంతర్జాతీయ నివేదికలు పేర్కొన్నాయి. సెప్టెంబర్ 1 నుంచి ఈ పెంపు అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఖర్చుల భారాన్ని ఇకపై మోయలేమని కంపెనీ పేర్కొన్నట్లు సమాచారం. ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై క్వాల్‌కామ్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్ ధరలు మండిపోతున్నాయి. క్రమంగా టీఎస్‌ఎంసీ, క్వాల్‌కామ్ కూడా తమ ఉత్పత్తుల ధరలను పెంచితే ఫోన్లు, ల్యాప్‌టాప్ ధరలు మరింత భారంగా మారనున్నాయి. కాగా, శాంసంగ్, షావోమి, వన్‌ప్లస్, మోటోరోలా వంటి పలు కంపెనీలకు క్వాల్‌కామ్ తన ఉత్పత్తులను సరఫరా చేస్తోంది.

# ఇండియా పోస్ట్ - ఫ్లిప్‌కార్ట్ క్రేజీ డీల్.. గ్రామాల్లో ఇక తపాలా సిబ్బందే పార్శిల్ డెలివరీ!

దేశంలోని మారుమూల ప్రాంతాలకు డెలివరీ సామర్థ్యాలను పెంచే దిశగా ఒక ముఖ్యమైన అడుగు వేస్తూ, తపాలా శాఖ -- ఫ్లిప్‌కార్ట్ ఇండియా ఒక చారిత్రాత్మక ఒప్పందంపై సంతకాలు చేశాయి.

తపాలా శాఖ, ఫ్లిప్‌కార్ట్ ఇండియా శుక్రవారం ఢిల్లీలో ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. తపాలా సాటిలేని విస్తృతి, విశ్వసనీయమైన డెలివరీ నెట్‌వర్క్, అలాగే భారతదేశ ఈ-కామర్స్ రంగంలో ఫ్లిప్‌కార్ట్‌కు ఉన్న బలమైన ఉనికిని ఉపయోగించుకోవడం ద్వారా దేశవ్యాప్తంగా సమర్థవంతమైన, నమ్మకమైన, వినియోగదారుల-కేంద్రీకృత పార్శిల్ డెలివరీ పరిష్కారాలను అందించడమే ఈ భాగస్వామ్యం లక్ష్యం. ఈ ఒప్పందం ప్రకారం, తపాలా శాఖ భారతదేశవ్యాప్తంగా ఫ్లిప్‌కార్ట్ సరుకుల కోసం లాస్ట్-మైల్ డెలివరీ సేవలను అందిస్తుంది.

**ఒప్పందంలోని కీలక అంశాలు:**

ఫ్లిప్‌కార్ట్, మారుమూల, తక్కువ సేవలు అందుతున్న ప్రాంతాలతో పాటు పట్టణ, పాక్షిక పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పార్శిల్ డెలివరీ సేవల కోసం ఇండియా పోస్ట్ విస్తృతమైన నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటుంది.

ఈ సేవల్లో ప్రీపెయిడ్, క్యాష్ ఆన్ డెలివరీ (జూణ) పార్శిళ్ల డెలివరీ, ఓటీపీ ఆధారిత డెలివరీ ధృవీకరణ, రియల్-టైమ్ షిప్‌మెంట్ ట్రాకింగ్ వంటివి ఉన్నాయి.




ఈ ఒప్పందం సమర్థవంతమైన పార్శిల్ రవాణా, పంపిణీ కోసం వేగవంతమైన డెలివరీ, మెరుగైన కార్యాచరణ సమన్వయం, అంతరాయలు లేని సాంకేతిక ఏకీకరణపై దృష్టి సారిస్తుంది.

ఈ సహకారం భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇ-కామర్స్ రంగానికి మద్దతు ఇచ్చే లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

ఆ కంపెనీకి తపాలా శాఖకు చెందిన 1.6 లక్షలకు పైగా పోస్ట్ ఆఫీసుల నెట్‌వర్క్‌ను వినియోగించుకునే అవకాశం లభిస్తుంది.

ఈ భాగస్వామ్యం ద్వారా ఫ్లిప్‌కార్ట్ భారతదేశవ్యాప్తంగా తపాలా శాఖకు చెందిన 1.6 లక్షలకు పైగా పోస్ట్ ఆఫీసుల విస్తారమైన నెట్‌వర్క్‌ను, సాటిలేని డెలివరీ నెట్‌వర్క్‌ను పొందగలుగుతుంది. ఇది మార్కెట్ పరిధిని విస్తరించడానికి, పంపిణీ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన సేవను అందించడానికి సహాయపడుతుంది.

**అమెజాన్ ఇప్పటికే ఇండియా పోస్ట్‌తో భాగస్వామ్యం:**

మారుమూల ప్రాంతాలకు సరుకులను చేరవేయడానికి అమెజాన్ ఇండియా గతంలో భారత తపాలా సేవతో భాగస్వామ్యం కుదుర్చుకుందని గమనించాలి. లాజిస్టిక్స్, ఇ-కామర్స్‌ను బలోపేతం చేయడానికి అక్టోబర్ 2024లో అమెజాన్, తపాలా శాఖ ఒక అవగాహన ఒప్పందం (మీఖ)పై సంతకాలు చేశాయి.







# గ్లోబల్ మార్కెట్‌ల్లో నథింగ్ మూతపడుతోందా?.. కంపెనీ క్లారిటీ




కొన్ని రోజుల్లో ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ నథింగ్.. ప్రపంచవ్యాప్తంగా డజన్‌కు పైగా మార్కెట్లలో మూతపడుతున్నట్లు కొన్ని టెక్ నివేదికలు చేస్తున్న ప్రచారాన్ని కంపెనీ ఖండించింది . మరోవైపు, 40 శాతం ఉద్యోగాల కోత చేపట్టనున్నట్లు వస్తున్న వార్తలను తోసిపుచ్చింది. దీనిపై నథింగ్ సహ వ్యవస్థాపకుడు అకిస్ ఎవాంజెలిడిస్ స్పందించారు. అవన్నీ తప్పుడు కథనాలని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.

"జపాన్, యూరప్ వంటి పలు గ్లోబల్ మార్కెట్ల నుంచి నథింగ్ వైదొలుగుతున్నట్లు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. అవన్నీ వదంతులే. ఏ మార్కెట్ నుంచి కంపెనీ తప్పుకోవడం లేదు. తదుపరి వృద్ధికి కంపెనీ బృందాలను పునర్నిర్మిస్తున్నాం. ప్రత్యేకంగా ఒక ఏఐ నేటివ్ వ్యాపార యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నాం. ప్రాంతీయ హబ్‌లు మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ మార్పుల్లో భాగంగా కొన్ని ఉద్యోగ స్థాయిలపై ఆ ప్రభావం పడుతుందన్న మాట వాస్తవమే. నిబంధనల ప్రకారం వాటి వివరాలను ప్రస్తుతానికి వెల్లడించలేం" అని ఆయన అన్నారు.

కంపనీ తదుపరి యుగాన్ని తీర్చిదిద్దేందుకు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని అకిస్ ఎవాంజెలిడిస్ తెలిపారు. టెక్ నివేదికలు పేర్కొన్న స్థాయిలో ఉద్యోగాల తొలగింపులు ఉండబోవని స్పష్టం చేశారు. పరిమిత స్థాయిలోనే ఉద్యోగ కోతలు ఉంటాయని, ప్రభావితమైన సిబ్బందికి అన్ని విధాల అండగా ఉంటామని వెల్లడించారు. మరోవైపు నథింగ్ ఫోన్4(బీ) విక్రయాలు తగ్గినట్టు వస్తున్న వార్తలపై స్పందించారు. విడుదలైన మొదటి రోజే 29,537 యూనిట్లు విక్రయాలు జరిపి, ఆ ధరల సెగ్మెంట్‌లో నథింగ్ ఫోన్4(బీ) రికార్డు సృష్టించిందన్నారు

# ప్రజా సమస్యల పరిష్కారంలో సంక్షేమ సంఘాలు కీలక పాత్ర పోషించాలి

**ప్రజలకు అందుబాటులో ఉండి సమిష్టిగా పనిచేయాలి**

**బిఆర్ఎస్ఎల్‌పి విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద**



**కుత్బుల్లాపూర్ జూలై 25 నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 278వ వార్డు, గాజులరామారం పరిధిలోని వీనస్ రాక్ హైట్స్ కాలనీ నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం (వెల్ఫేర్ అసోసియేషన్) కమిటీ సభ్యులు శనివారం పెట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా కప్పి, పుష్పగుచ్చంతో సన్మానించి తమ కాలనీలోని మౌలిక వసతులు, అభివృద్ధి పనులు, నివాసితుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతర ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, కాలనీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీనస్ రాక్ హైట్స్ కాలనీ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమా రెడ్డి, ఉపాధ్యక్షుడు అరవింద్, రాజేష్, ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్, కార్యవర్గ సభ్యులు, ఇతర కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.





# అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్‌లో వివరాలను నమోదు చేసుకోండి

**తెల్లాపూర్‌లో ఎస్ఐఆర్ అవగాహన ర్యాలీకి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్చెరు, జూలై 25 (నినాదం) :** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే బలమైన పునాది అని, అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు తప్పనిసరిగా ఎస్ఐఆర్ (ా×=) ప్రక్రియలో పాల్గొని పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఏలియన్స్ స్పేస్ స్టేషన్ అపార్ట్మెంట్ సమీపంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సోమిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన ర్యాలీతో పాటు ప్రచార రథాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో తన పేరు సక్రమంగా ఉండేలా చూసుకోవడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల్లో ఎలాంటి అపోహలు లేకుండా. .ప్రతి ఒక్కరికీ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించేందుకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు, ప్రచార రథాలు, ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదు... ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తి అన్నారు. పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల భవిష్యత్తు, సంక్షేమానికి ప్రతి ఓటు ఎంతో విలువైనది. అందుకే ప్రతి అర్హుడైన ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామి కావాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ ప్రచార రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్..బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# చీఫ్ ఇంజనీర్ జగదీశ్వర్‌కు ఘన సన్మానం

**అంచలంచలుగా ఎదిగి ఉన్నత శిఖరాలను చేరుకున్న లింగ బలిజ ముద్దుబిడ్డ జగదీశ్వర్**

**వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు శివ కుమార్**



**సంగారెడ్డి బ్యూరో, జులై 25 (నినాదం):** సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాత్ లింగ బలిజ సంఘ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల చీఫ్ ఇంజనీర్ గా ప్రమోషన్ తీసుకున్న తుమ్మలపల్లి జగదీశ్వర్ కు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ లింగ బలిజ ముద్దుబిడ్డ తుమ్మలపల్లి జగదీశ్వర్ కు చీఫ్ ఇంజనీర్ గా ప్రమోషన్ వచ్చినందుకు గర్వపడుతున్నామన్నారు. జగదీశ్వర్ అసిస్టెంట్ ఇంజనీయరగా ఉద్యోగంలో చేరి తన స్వయం కృషితో అంచలంచలుగా ఎదిగి చీఫ్ ఇంజనీర్ గా నేడు ప్రమోషన్ పొందడం సమాజానికి గర్వకారణం అని కొనియాడారు. అనంతరం సంఘం గౌరవ సలహాదారు పట్లోళ్ల మల్లికార్జున్ పాటిల్ మాట్లాడుతూ జగదీశ్వర్ చిన్నతనం నుండి కూడా అతి చురుకైన విద్యార్థిగా అందరి మనలను పొందాడ ని, నేడు కూడా చీఫ్ ఇంజనీర్ గా అందరి మనలను పొందుతున్నారన్నారు. నీటి యువతరానికి ఆయన స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన కృషి పట్టుదలతో నిర్విరారముగా పనిచేస్తూ ఈరోజు చీఫ్ ఇంజనీర్ గా ప్రమోషన్ పొందడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ సంద ర్భంగా సన్మాన గ్రహీత చీఫ్ ఇంజనీర్ జగదీశ్వర్ మాట్లాడుతూ నాకు ఈరోజు సంఘం తరపున ఈ సన్మానం చేయడం ఎంతో సంతోషం మరి ఆనందదాయకంగా ఉందని, అలాగే మన సంఘం కోసం మరియు ఎవరికి ఏ పనులున్నా నేను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సంగమేశ్వర కోశాధికారి జే రాజేశ్వర స్వామి కార్యనిర్వక అధ్యక్షుడుపట్లోళ్ల శివకుమార్ ముఖ్య సలహాదారులు ధనంజయ పృథ్వీరాజ్ పట్లోళ్ల మల్లికార్జున్ పాటిల్ గోవురాజు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుంది

**పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్**



**సిద్ధిపేట బ్యూరో, జూలై 25 ( నినాదం) :** శాంతి భద్రతల పరిరక్షణలో , నేరాల నియంత్రణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను, సిబ్బందిని ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన సీపీ కనెక్ట్' కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన మార్కూక్ ఎస్సై యోనస్ అహ్మద్ అలీ, కానిస్టేబుళ్లు కిషోర్ కుమార్, ఉపేందర్ రెడ్డి, కృష్ణ , రమేష్, క్రైం పార్టీ కానిస్టేబుల్ నరేందర్, హోంగార్డ్ వేణు లను శనివారం రోజున సీపీ ప్రత్యేకంగా అభినందించా రు. కమిషనరేట్ కార్యాలయంలో వారికి ప్రశంసా పత్రాలు , ప్రత్యేక కిట్లను ఆమె అందజేశారు. అనంతరం సీపీ వారితో ముచ్చటించారు. గత వారం రోజులుగా విధినిర్వహణలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని సీపీ కొనియాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాత్రి సమయాల్లో అప్రమ త్తంగా ఉంటూ, సాంకేతికతను ఉపయోగించి పాత నేరస్థులను పట్టుకోవడం, దొంగతనాలకు అడ్డుకట్ట వేయడం అభినందనీయన్నారు. నిబద్ధత తో సిబ్బంది అంతా పనిచేసి కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషి చేయాలనీ సిబ్బందికి సూచించారు. ప్రజలకు సమర్థవంతంగా సేవ చేయడానికి 'సీపీ కనెక్ట్' చొరవ ద్వారా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని సిపి తెలిపారు.

## యువత న్యాయం కోసం ఏకమైతే.. ప్రజాస్వామ్యం తప్పక్పందిస్తుంది

**కేంద్ర మంత్రి రాజీనామా.. యువత విజయం: కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, జులై 25(నినాదం):** కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా భారత యువత సాధించిన గొప్ప విజయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అభివర్ణించారు. నిజం, న్యాయం, జవాబుదారీతనం కోసం అలుపెరుగని పోరాటం చేసిన లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, యువత సంకల్పానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అండగా నిలిచి, వారి గొంతుకను పార్లమెంట్ లోపల, బయట బలంగా వినిపించిన ప్రతిపక్షాల పోరాటాన్ని ఆయన అభినందించారు. ఈ రాజీనామాతో సమస్య ముగిసిపోకూడదని, పారదర్శకమైన, విశ్వసనీయమైన, ప్రతిభకు న్యాయం చేసే పరీక్షా వ్యవస్థ నిర్మాణానికి ఇది ఆరంభం కావాలని ఆకాంక్షించారు. "యువత న్యాయం కోసం ఏకమైతే... ప్రజాస్వామ్యం తప్పక స్పందిస్తుంది" అని ఎమ్మెల్యే నారాయణరెడ్డి స్పష్టం చేశారు.

## జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని నిరసన



**వికారాబాద్, జూలై 25(నినాదం):** జూనియర్ అసిస్టెంటకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ శనివారం జిల్లా కేంద్రం వికారాబాద్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో శాంతియుతంగా జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ సంస్థల్లో అన్ని విభాగాల సిబ్బందికి ఇన్చార్జి పదోన్నతులు కల్పిస్తూ, జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల పట్ల మాత్రం యాజమాన్యం తీవ్ర అన్యాయం చేస్తోందని విద్యుత్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్, అకౌంట్స్, నిర్వహణ విభాగాల ఉద్యోగుల ప్రమోషన్లకు లేని కోర్టు కేసుల అడ్డంకులు, కేవలం జూనియర్ అసిస్టెంట్ల నుండి సీనియర్ అసిస్టెంట్ల పదోన్నతులకే ఎలా వర్తిస్తాయని వారు ప్రశ్నించారు. కొన్ని జిల్లాల పరిధిలో తగినంత మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ, ఖాళీలు ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రమోషన్లు ఇవ్వకపోవడం సరికాదని మండిపడ్డారు. యాజమాన్యం అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ వికారాబాద్ జిల్లా కార్యాలయం వద్ద జూనియర్ అసిస్టెంట్లందరూ భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వెంటనే స్పందించి న్యాయబద్ధంగా రావాల్సిన పదోన్నతులను విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా పరిధిలోని జూనియర్ అసిస్టెంట్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# పారదర్శకమైన పోలీసు సేవలను అందించాలి

**ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌ను మహేశ్వరం ఏసీపీ జానకి రెడ్డి ఆకస్మికంగా తనిఖీ**



**ఆమనగల్లు, జూలై 25(నినాదం):** ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌ను మహేశ్వరం ఏసీపీ జానకి రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది వివరాలతో పాటు, పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలకు సంబంధించి కేసులు నమోదు, గొడవలపై ఆరా తీశారు. రౌడీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఉంచాలని, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని, గ్రేవ్ (యుఐ) కేసుల ఛేదనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విజిబుల్ పోలిసింగ్‌ను మరింత బలోపేతం చేసి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించాలన్నారు. -రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలి. సీసీటీవీఎస్, ఈ -సాక్షి వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్ లో విస్తృతంగా ఉపయోగించాలని సైబర్ భద్రత, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నివారణ వంటి అంశాలపై నిరంతరం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వ హించాలి. పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అమలు చేస్తూ, ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలను అందించేందుకు కట్టుబడి పనిచేయాలని పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని స్టేషన్ ఎస్ఎచ్ఓ వెంకటేశ్వర్లు కు సూచించారు.

# డంపింగ్ చెత్తకు బిఆర్ఎస్ క్యాపింగ్ చేస్తే.. కాంగ్రెస్ చేసింది గుండు సున్నా

**ప్రజల ప్రాణాలకు. ప్రాణ సంకటమైన డంపింగ్ ను ఎత్తివేసే వరకు పోరాడుదాం**

**మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి**





**జవహర్ నగర్, జులై 25 (నినాదం):** డంపింగ్ యార్డ్ దుర్వాసన వెదజల్లకుండా శాస్త్రీయంగా బిఆర్ఎస్ క్యాపింగ్ చేసి కాపాడితే... కాంగ్రెస్ మూడేళ్లలో చేసింది గుండు సున్నానేనని రాంకీ యాజమాన్యంపై ఉద్యమంలా పోరాటం చేసి జీవించే హక్కును కాపాడుకుందాం అని మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పై జరిగిన అవగాహన సదస్సును పురస్కరించుకొని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ మాజీ మేయర్ మేకల కావ్య పార్టీ అధ్యక్షుడు కొండలు ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం మాజీమంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ డంపింగ్ రసాయన నీటిని లిచట్ ట్రీట్మెంట్‌తో మంచినీటిగా మార్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ దేనిని పచ్చని తెలంగాణగా మారిన రాష్ట్రాన్ని ఎడారిగా చూస్తుంటే దుఃఖం వస్తుందని అన్నారు. డంపింగ్ ప్రాంతంలో సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకున్న పాపా న పోలేదని దుయ్యబట్టారు. డంపింగ్ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జవహర్ నగర్ ను గతంలో జూబ్లీహిల్స్ తరహాలో అభివృద్ధి చేస్తూ ప్రజా ప్రభుత్వం ప్రగతినే మర్చిపోయిందన్నారు. అనంతరం డంపింగ్ యార్డ్ ను ఎత్తివేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి, సుధాకర్ చారి, రాజశేఖర్, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, డంపింగ్ యార్డ్ పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# హైదరాబాదులో పచ్చదనాన్ని పెంచడం.. భూగర్భ జలాలను సంరక్షించడం వన మహోత్సవ లక్ష్యం

**హెచ్ఎండిఏ, రోజా రాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మొక్కలు పంపిణీ**

**అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహిత గోపిడి**






**మేడ్చల్ కలెక్టరేట్, జులై 25 (నినాదం):** హైదరాబాదులో పచ్చదనాన్ని పెంచడం భూగర్భ జలాలను సంరక్షించడం వన మహోత్సవ లక్ష్యమని అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహిత గోపిడి పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) అర్బన్ ఫారెస్ట్ రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి ఐదు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ రోహిత గోపిడి హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం 2026లో భాగంగా హెచ్ఎండిఏ అర్బన్ ఫారెస్ట్ హైదరాబాదులో పచ్చదనాన్ని పెంపొం దించడం వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం భూగర్భ జలాలను సంరక్షించడం జీవ వైవిధ్యాన్ని కాపాడాలని లక్ష్యంతో ప్రజలను ముఖ్యంగా మహిళలను భాగస్వామ్యం చేస్తూ ఇంటికి ఐదు మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బండి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వన మహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా ఈ సంవత్సరం 16 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకొని పచ్చదనాన్ని రాష్ట్రంలో పెంపొందించడం కోసం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాయిబాబు చౌదరి, హెచ్ఎండిఏ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ చక్రపాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణీత్ కౌర్, రమేష్, రాణి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న యువ ఇంజనీర్

**రూ. 40 లక్షల సాయం కోసం దాతల వైపు కళ్లు!**



**రాజేంద్రనగర్, జులై 25( నినాదం):** సొంతంగా ఒక వ్యాపారం ప్రారంభించి, పదిమందికి ఉపాధి కల్పించే ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలని ఆ యువకుడు కలలు కన్నాడు. కానీ, విధి ఆడిన విపరీత క్రీడలో తీవ్రమైన అనారోగ్యం బారినపడి ప్రస్తుతం ప్రాణాలతో పోరాడుతున్నాడు. నర్సింగ్ సర్కిల్ పరిధిలోని మణికొండ డివిజన్ చిత్రపురి కాలనీ (LI+ 19 టవర్స్)లో నివసిస్తున్న ముజీబ్ రహమాన్, షబానా బేగం దంపతుల కుమారుడు అఫ్తాబ్ రెహమాన్ (2023లో గండిపేట లార్డ్స్ కాలేజీ నుంచి దీ.ఎవష్ట్ర సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు) బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వీరిది నారాయణపేట జిల్లా మరికల్ మండలం కన్మనూర్ గ్రామం. తండ్రి డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండగా, తల్లి గృహిణి. ఈ దంపతులకు ఒక బాబు, ఒక పాప ఉన్నారు.

**హఠాత్తుగా మారిన ఆరోగ్యం – రోగ నిర్ధారణ**

నాలుగు నెలల క్రితం అఫ్తాబ్ సరిగ్గా ఆహారం తీసుకోకపోవడం, రాత్రివేళల్లో విపరీతంగా చెమటలు పట్టడం వంటి లక్షణాలతో ఇబ్బంది పడ్డాడు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే 13 కిలోల బరువు తగ్గాడు. ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించడంతో తల్లిదండ్రులు పుప్పాలగూడలోని వైద్యులను, ఆపై KIMS, M&J బసవతారకం ఆసుపత్రులను సంప్రదించారు. ఖ×మీా హాస్పిటల్లో బోన్ మ్యారో/బయాప్సీ పరీక్షలు నిర్వహించగా, 2026 ఏప్రిల్ 10న అఫ్తాబ్‌కు బ్లడ్ క్యాన్సర్ (దీశ్రీశీసీ ఝుఅఎవతీ) ఉన్నట్లు నిర్ధారణ అయింది.

**ఇప్పటివరకు 20 లక్షల వ్యయం..**

**ఆగస్టు 10న శస్త్రచికిత్స!**

ప్రస్తుతం ఆపోలో హాస్పిటల్ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ పద్మజ లోకిరెడ్డి ఆధ్వర్యంలో మణికొండలోని ఆవాసా హాస్పిటల్లో అఫ్తాబ్‌కు కీమోథెరపీ చికిత్స అందిస్తున్నారు. ఇప్పటివరకు చికిత్స, కీమోథెరపీ కోసం బంధువులు, తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి సుమారు రూ. 20 లక్షల వరకు ఖర్చు చేశారు. వచ్చే నెల ఆగస్టు 10వ తేదీన ఆపరేషన్ చేయడానికి వైద్యులు సమయం నిర్ణయించారు. ఈ శస్త్రచికిత్స తదుపరి వైద్యం కోసం మరో రూ. 40 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు.

**దాతలకు తల్లిదండ్రుల కన్నీటి విజ్ఞప్తి:**

"మాకున్న ఆస్తిపాస్తులన్నీ ఖర్చు చేసి, అప్పులు తెచ్చి ఇప్పటివరకు వైద్యం చేయించాం. ఆపరేషన్‌కు కావలసిన రూ. 40 లక్షలు సమకూర్చే శక్తి మాకు లేదు. దాతలు, దాతృత్వ సంస్థలు, ప్రభుత్వం స్పందించి, గూగుల్ పే ఫోన్ పే 8555060892, అకౌంట్ నెంబర్ :553902010006129 ఆర్థికంగా సహాయం అందించి మా కుమారుడి ప్రాణాలను కాపాడాలని వేడుకుంటున్నాం."

# సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను సహించం

**కీసర సర్కిల్ పరిధిలోని ఆక్రమణల తొలగింపు**

**కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం**






మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 25 (నినాదం): కీసర సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను నిర్మిస్తే సహించబోమని కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం హెచ్చరించారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ పరిధిలో అక్రమంగా వెలిసిన కట్టడాలను టీపీఎస్ మేఘన ఆధ్వర్యంలో శనివారం కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ రామలింగం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కీసర సర్కిల్ పరిధిలోని యాప్రాల్ వార్డ్ నందు రోడ్డు ఎంక్రోచ్‌మెంట్ ని జెసిబి ద్వారా తొలగించారు. అదేవిధంగా షామీర్పేట వార్డ్ నందు దేవరయంజా ల్ కీసర వార్డ్ నందు పలు అక్రమ నిర్మాణాలు తొలగించారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ మేఘన టౌన్ ప్లానింగ్ జూనియర్ అసిస్టెంట్ విక్రమ్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రూ,45 లక్షల సిసి రోడ్డుకు శ్రీకారం చుట్టిన మాజీ కార్పొరేటర్

**కాలనీలలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ కృషి చేస్తాము**

**మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్**



**అల్వాల్, జూలై 25 (నినాదం):** కాలనీలలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. శనివారం గ్రీన్ ల్యాండ్ ఎంక్లేవ్ లో 45 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ కాలనీ వాసులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సిసి రోడ్డు నిర్మాణంతో స్థానికులకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలుగుతాయని పేర్కొన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా. నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కాంట్రాక్టర్లు కోరారు. అభివృద్ధిలో పనులు మైనంపల్లి హనుమంతరావు అండదండలతో ముందుకు సాగుతున్న అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాలనీవాసులు కాలనీ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కుమార్, నేపాల్ రెడ్డి, సంతోష్, అంజయ్య, సంప్రీత్, రవీందర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, అబ్దుల్ నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, వెంకటేష్ గౌడ్, సర్వేష్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, దిలీప్, సురేందర్ రెడ్డి, సందీప్ రెడ్డి, దేవేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి అడ్లూరికి కీలక బాధ్యత...

ఎస్సీ వర్గీకరణ, బిల్లు కీలక కమిటీల్లో స్థానం..



**జగిత్యాల ప్రతినిధి, జూలై 25(నినాదం ):** తెలంగాణలో సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి సంకల్పానికి అనుగుణంగా, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను రెండు అత్యంత కీలక కమిటీలలో సభ్యునిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖ జీ.ఓ.ఆర్. టి. నెం. 1077ను ప్రభుత్వం జారీ చేసింది. సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్న ఉన్నతస్థాయి కమిటీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారిని సభ్యునిగా చేర్చారు. ఎస్సీ వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అవగాహన కలిగిన మంత్రిగా ఆయన అనుభవం కమిటీ నిర్ణయాలకు మరింత బలం చేకూర్చనుంది. అదేవిధంగా ఉన్నత విద్యా సంస్థల్లో కుల, సామాజిక గుర్తింపు ఆధారంగా వివక్షను నిరోధించే లక్ష్యంతో రూపొందిస్తున్న రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నిరోధక) బిల్లు–2026కు సంబంధించిన శాసన రూపకల్పనపై అధ్యయనం చేసి సూచనలు చేయనున్న కేబినెట్ సబ్ కమిటీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారికి సభ్యత్వం కల్పించింది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పరిపాలనకు కేంద్రబిందువుగా నిలిపిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, సమాన అవకాశాల కల్పన, రాజ్యాంగ స్ఫూర్తి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, రాజ్యాంగబద్ధమైన, న్యాయసమ్మతమైన సిఫారసులు అందించేందుకు కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. అలాగే, ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థులు ఎలాంటి వివక్షకు గురికాకుండా చట్టపరమైన రక్షణ కల్పించే విధంగా రోహిత్ వేముల బిల్లును ఆదర్శవంతమైన శాసనంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువల అమలుకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆ దిశలో తీసుకుంటున్న ప్రతి నిర్ణయం తెలంగాణను దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలబెడుతుందని ఆయన పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ఈ రెండు కీలక కమిటీలలో సభ్యత్వం కల్పించడం ద్వారా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ విధానాల రూపకల్పనలో ఆయన పాత్ర మరింత బలోపేతం కానుంది. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం సామాజిక న్యాయం సాధనలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

# దోపిడీ నిందితులను వారంరోజుల్లో పట్టుకోవాలి

**లేకపోతే పోలీసు కమిషనర్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరిక**
**మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

**కరీంనగర్, జూలై25(నినాదం):** కరీంనగర్ నగరంలో శాంతిభద్రతలు క్షీణించాయని, వరుస దోపిడీలు జరుగుతున్నా పోలీసులు సమర్థంగా స్పందించడం లేదని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. భగత్‌నగర్ వారాస్లో ఇటీవల దోపిడీకి గురైన మున్నూరుకాపు కుటుంబాన్ని శనివారం పరామర్శించిన ఆయన, వారం రోజుల్లోగా నిందితులను అరెస్టు చేయాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోలీసు కమిషనర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. జూన్‌లో కారు చోరీపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు సకాలంలో స్పందించలేదని బాధితులు ఎమ్మెల్యేకు వివరించారు. అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే అనంతరం జరిగిన భారీ దోపిడీ నివారించవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. కారు చోరీకి పాల్పడిన వారే పథకం ప్రకారం ఇంటిపై దాడి చేసి సుమారు 62



తులాల బంగారం, రూ. 25 లక్షల నగదు దోచుకెళ్లారని తెలిపారు. అనుమానితుల సీసీటీవీ చిత్రాలను అందించినప్పటికీ ఇప్పటివరకు నిందితులను గుర్తించలేదని గంగుల ఆరోపించారు. కరీంనగర్ ఒకప్పుడు సురక్షిత నగరంగా ఉండేదని, ప్రస్తుతం దొంగలకు అడ్డాగా మారిందని ఆయన అన్నారు. గతంలో జరిగిన ప్రముఖ దోపిడీ ఘటనల్లోనూ నిందితులను పూర్తిస్థాయిలో పట్టుకోవడం, దోచుకున్న సొత్తును స్వాధీనం చేసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీలపై చూపుతున్న శ్రద్ధను ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణపై కూడా చూపాలని సూచించారు. దొంగలను వెంటనే అరెస్టు చేసి, భయాందోళనలో ఉన్న బాధిత కుటుంబానికి తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కరీంనగర్ టౌన్ సహాయ పోలీసు కమిషనర్‌కు ఫోన్ చేసి కేసు పురోగతిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, నాయకులు సుంకిశాల సంపత్‌రావు, నేతి రవివర్మ, మిడిదొడ్డి నవీన్, జి.పి. స్వామితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పారంభమైన ఎంఆర్ఎఫ్ 'బాలాజీ టైర్ వరల్డ్'

## ఆధునిక టైర్స్ , సర్వీస్ కేంద్రం

**అత్యాధునిక పరికరాలతో వీల్ అలైన్‌మెంట్, బాలెన్సింగ్, టైర్ సేవలు ఒకేచోట**




**కరీంనగర్, జులై25(నినాదం):** కరీంనగర్‌లోని మంచిర్యాల సర్కిల్‌లో ఎంఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలాజీ టైర్ వరల్డ్ టైర్స్ డ సర్వీస్ ఫ్రాంచైజీని శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఎఫ్ దక్షిణ భారత విభాగీయ మేనేజర్ ఈశ్వర్ పి. ఇట్నాల్, షోరూం యజమాని కుమారస్వామి, జిల్లా మేనేజర్ జగదీశ్వర్ రావు, కరీంనగర్ ఇన్‌చార్జి మహేందర్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ పి. ఇత్మల్ మాట్లాడుతూ, జగిత్యాలలో 2018లో మొదట కుమారస్వామి ప్రారంభించిన, బాలాజీ టైర్ వరల్డ్ విజయవంతంగా కొనసాగుతోందని, అదే విధంగా కరీంనగర్ కేంద్రం కూడా ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా ఎంఆర్ఎఫ్‌కు సుమారు 1,400 షోరూములు ఉన్నవి, ప్రతి ఆరు వేల కిలోమీటర్లకు ఒకసారి వీల్ అలైన్‌మెంట్ చేయించుకోవడం వల్ల టైర్ల జీవితకాలం సుమారు 25 శాతం పెరుగుతుందని సూచించారు. ఈ కేంద్రంలో దిగుమతి చేసిన అత్యాధునిక యంత్రాలతో వీల్ అలైన్‌మెంట్, వీల్ బాలెన్సింగ్, స్వయంచాలక టైర్ అమరిక, ట్యూబ్‌లెస్ టైర్ మరమ్మతులు, నైట్రోజన్ గాలి నింపే సేవలు అందుబాటులో ఉన్నాయి. వాహనాల సేవల సమయంలో వినియోగదారులు వాతానుకూలిత విశ్రాంతి మందిరంలో సౌకర్యవంతంగా వేచి ఉండే ఏర్పాట్లు చేశారు. చెన్నైలోని ఎంఆర్ఎఫ్ శిక్షణ కేంద్రంలో ప్రత్యేక శిక్షణ పొందిన నిపుణుల సేవలు అందుబాటులో ఉండటం ఈ కేంద్రం ప్రత్యేకతగా నిలుస్తోంది. అలాగే జెడ్‌ఎల్ఎక్స్, పెర్ఫింజా వంటి ఎంఆర్ఎఫ్ నాణ్యమైన కారు రేడియల్ టైర్లతో పాటు ఆధునిక టైర్ సేవలను కరీంనగర్ వాహనదారులకు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం ..


## ఫెర్టీ9కు అంతర్జాతీయ గుర్తింపు

**నీడిల్‌రహిత ఐవీఎఫ్ సేవలు, కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశోధనలతో దంపతులకు ఆధునిక ఫెర్టిలిటీ చికిత్సలు**
**ఫెర్టీ9 కరీంనగర్ కేంద్రం వైద్య నిపుణుడు డా. బి.జి.బి. పిళ్లై**



**కరీంనగర్, జులై25(నినాదం):** ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెర్టీ9 కరీంనగర్ కేంద్రం వైద్య నిపుణుడు డాక్టర్ బి.జి.బి. పిళ్లై మాట్లాడుతూ, ఫెర్టీ9 క్లినికల్ బృందం ప్రపంచ ప్రఖ్యాత సదస్సుల్లో పరిశోధనా పత్రాలను సమర్పించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు పొందిందని తెలిపారు. భారతదేశంలో సంతానోత్పత్తి రేటు క్రమంగా తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో తెలంగాణలో అది 1.8, ఆంధ్రప్రదేశ్‌లో 1.7గా నమోదైందన్నారు. జీవనశైలి మార్పులు, మానసిక ఒత్తిడి, ఆలస్య వివాహాలు, ఉద్యోగ పరిస్థితులు, పురుషులు, మహిళల్లో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. అయితే ప్రారంభ దశలోనే నిపుణులను సంప్రదించి అవసరమైన పరీక్షలు, ఆధునిక చికిత్సలు తీసుకుంటే విజయావకాశాలు గణనీయంగా పెరుగుతాయని సూచించారు. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా ఫెర్టీ9 తన 11 కేంద్రాల్లో నీడిల్–రహిత ఐవీఎఫ్ సేవలను ప్రారంభించిందని తెలిపారు. దీని వల్ల రోజువారీ ఇంజెక్షన్లతో కలిగే నొప్పి, ఆందోళన తగ్గుతాయని వివరించారు. అలాగే కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రజనన ఆరోగ్య పరిశోధనల ద్వారా ఐవీఎఫ్ విజయశాతాన్ని పెంచడంతో పాటు ఇంప్లాంటేషన్ వైఫల్యాలను తగ్గించే దిశగా సంస్థ కృషి చేస్తోందన్నారు. భవిష్యత్తులో ఇంప్లాంటేషన్ వైఫల్యాలు, గర్భస్రావాల నివారణకు ప్రత్యేక అత్యుత్తమ కేంద్రాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల దంపతులకు మరింత ఆధునిక ఫెర్టిలిటీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లోని 11 ఫెర్టిలిటీ కేంద్రాల ద్వారా ఫెర్టీ9 సేవలు అందిస్తోందని, కరీంనగర్ కేంద్రం అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్యుల సేవలతో వేలాది మంది దంపతులకు తల్లిదండ్రులయ్యే ఆనందాన్ని అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



**కాటారం, జూలై 25( నినాదం ):** మండలంలో తొలి ఏకాదశి వేడుకలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు మండలంలోని దామరకుంట గోదావరి తీరానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం సమీప దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీమహావిష్ణువును దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు అందించాలి

**ఆస్పత్రి అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ బిఆర్ఎస్ విఫలం**
**బిజెపి పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు.. ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన బిజెపి నాయకులు**

**జమ్మికుంట, జూలై 25 (నినాదం):** జమ్మి కుంట ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ బి రమేష్ ను అడిగి తెలుసుకున్న బిజెపి నాయకులు. శనివారం జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని స్థానిక బిజెపి నేతలతో కలిసి వారు సందర్శించారు. ఈ సందర్భంగా రాజు వైద్య సేవల గురించి రోగులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జమ్మికుంట ఆసుపత్రికి డయాలసిస్ సెంటర్ మంజూరు చేసినట్లు ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇంతవరకు దానికి సంబంధించిన వైద్య పరికరాలు రాలేదని, పట్టణంలో 70 మంది వరకు డయాలసిస్ బాధితులు ఉన్నారని, వారు డయాలసిస్ కొరకు హుజురాబాద్, కరీంనగర్



ప్రాంతాలకు వెళ్లి రావడం ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ప్రణవ్ బాబు చొరవ తీసుకొవాలని, స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, కనీసం నిరుపేదల, ప్రజా సమస్యలపై స్పందించడం లేదని ఎద్దేవా చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి సుమారు కోటిన్నర రూపాయల విలువైన వైద్య పరికరాలు అందించి, పేద రోగులకు ఉపశమనం కలిగిస్తున్నారని ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు, టెక్నిషియన్స్ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించి ఇరువై నాలుగు గంటలు వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఓబిసి అధ్యక్షులు ఆకుల రాజేందర్, కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, కనుమల్ల గణపతి, కైలాసకోటి గణేష్, అడువాల శ్రీధర్, కొమ్ము అశోక్, ఆకుల తిరుపతి, పోచయ్య, నసీరుద్దీన్, పూల్లూరి ప్రశాంత్, తుర్పాటి శంకర్, కొండాపర్తి ప్రవీణ్, ముకుందా సుధాకర్, అప్పాల రవిందర్, బద్రి యాదవ్ , ఎదులాపురం శ్రీనివాస్, చందా సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి

**జమ్మికుంట, జూలై 25 (నినాదం)** ఏడుకొండల వాడా.. వెంకటేశానమో నారాయణ అంటూ వేలాది మంది భక్తులు తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంవత్సరంలో తొలి పండగ అయిన తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని జమ్మికుంట పట్టణంలోని వెంకటాద్రి నగర్ లో గల వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం నుండి భక్తుల కోలాహలం తో సందడిగా మారింది. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏడు కొండల వెంకటేశ్వర స్వామికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించగా గతంలో ఎన్నడూ లేని విధంగా వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలను నిర్వహిం చారు. ఆలయానికి వచ్చే



భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా జమ్మికుంట పట్టణంలోని శివాలయం రామాల యం, హనుమాన్ దేవాలయాలు, అయ్యప్ప స్వామి దేవాలయం, పంచముఖ హనుమాన్ దేవాలయం ,బాల అభయాంజనేయ స్వామి దేవాలయం, కొత్తపల్లి హనుమాన్ దేవాలయం, అపర భద్రాద్రిగా



ప్రసిద్ధి చెందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించగా వందలాదిమంది భక్తులు పాల్గొని పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# నిర్మాణ పనులపై మేయర్ ఆకస్మిక తనిఖీ..

**గడువులోపు నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశం.**
**సమీకృత మార్కెట్లు, సమీకృత శిశు అభివృద్ధి భవనం, పార్కింగ్–వాణిజ్య సముదాయం పనులను పరిశీలించిన మేయర్ శ్రీనివాస్**

**కరీంనగర్, జులై25(నినాదం)** నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి నగరంలోని పలు నిర్మాణ పనులను ఆకస్మికంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ముందుగా పద్మనగర్ సమీకృత కూరగాయలు–మాంసాహార మార్కెట్‌ను సందర్శించిన మేయర్, ఇప్పటికే ప్రారంభమైన ఈ మార్కెట్‌లో పారిశుధ్యం, వినియోగదారుల సౌకర్యాలు, వ్యాపారుల అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కాశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని పరిశీలించి, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి 30 రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే కలెక్టర్ శిబిర



కార్యాలయం ఎదురుగా నిర్మిస్తున్న సమీకృత మార్కెట్‌ను మూడు నెలల్లో ప్రారంభానికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. తదుపరి నిర్మాణంలో ఉన్న సమీకృత శిశు అభివృద్ధి సేవల (ఐసీడీఎస్) భవనం, పార్కింగ్, వాణిజ్య సముదాయం పనులను పరిశీలించిన మేయర్, నిర్మాణ నాణ్యతతో పాటు విద్యుత్, తాగునీరు, మురుగునీటి పారుదల, పారిశుధ్యం, భద్రత, పార్కింగ్ వంటి మౌలిక సదుపాయాలు అత్యున్నత ప్రమాణాలతో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యాపారులకు మెరుగైన వసతులు, ప్రజలకు విశాలమైన పార్కింగ్, సులభ రాకపోకలకు అనువైన ఏర్పాట్లు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిని నిర్ణీత గడువులోపు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఆధునిక మార్కెట్లు, పార్కింగ్ సదుపాయాలు, వాణిజ్య సముదాయాలు నగరాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్‌రావు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల విజయానికి మద్దతుగా కాంగ్రెస్ క్యాండిల్ ర్యాలీ

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల పోరాటానికి నైతిక విజయం లభించిందని కాంగ్రెస్ నేతల వ్యాఖ్య**





**కరీంనగర్, జులై25(నినాదం):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో, విద్యార్థుల ఉద్యమానికి మద్దతుగా కరీంనగర్ నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాజీవ్ చౌక్ నుంచి కార్ఖానాగడ్డలోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అమరులైన విద్యార్థుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఈ సందర్భంగా నేతలు కోరారు. కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల ఉద్యమాల ఒత్తిడితో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గి విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం ప్రజాస్వామ్యానికి, విద్యార్థుల పోరాటాలకు నైతిక విజయమని అన్నారు. రాజీనామా ఆమోదం పొందే వరకు, అలాగే విద్యార్థుల పెండింగ్ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు ఈ శాంతి ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, సూడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉట్కూరు నరేందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు గడ్డం విలాస్‌రెడ్డి, మడుపు మోహన్, మల్లికార్జున రాజేందర్, కర్ర సత్యప్రసన్నరెడ్డి, కర్ర రాజశేఖర్, పర్వత మల్లేశం, కాంతాల జగన్‌రెడ్డి, నునావత్ భాస్కర్ నాయక్, అబ్దుల్ రెహమాన్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌లో

## ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం

**ఉత్తర తెలంగాణలో తొలి అత్యాధునిక వీర్య విశ్లేషణ పరికరం ప్రారంభం.**
**'హోప్' కార్యక్రమంతో ఉచిత సలహాలు, ప్రత్యేక రాయితీలు**




**కరీంనగర్, జులై25(నినాదం):** కరీంనగర్‌లోని రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌లో ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు రూ. 30 లక్షల విలువైన అత్యాధునిక వీర్య విశ్లేషణ పరికరాన్ని రెనే వైద్య సంస్థల అధినేత ప్రొఫెసర్ డా. బంగారి స్వామి ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇటువం టి పరికరాలు రెండే ఉండగా, ఉత్తర తెలంగాణలో తొలిసారిగా ఈ సౌకర్యం అందుబాటులోకి రావడం విశేషమని ఆయన తెలిపారు. వైద్యరంగంలోని నూతన సాంకేతికతను ప్రజలకు అందించడంలో తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుం దని పేర్కొన్నారు. సీనియర్ వంధ్యత్వ నిపుణురాలు డా. బంగారి రజనీ ప్రియ దర్శిని మాట్లాడుతూ, సంతానలేమితో బాధపడుతున్న దంపతులకు ప్రతి నెల మొదటి శుక్రవారం 'హోప్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఇందులో తొలి 30 మంది దంపతులకు ఉచితంగా వైద్య సలహాలు అందించి, వారు తెచ్చిన వైద్య నివేదికలను పరిశీలించి అన్ని సందేహా లకు సమాధానాలు ఇస్తామని చెప్పారు. ప్రతి దంపతికి సంతాన సాఫల్యం కల్పిం చడమే తమ బృందం లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే జూలై 31 వరకు సుమారు రూ. 5 వేల విలువైన త్రిమితీయ అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఏఎంహెచ్ పరీక్ష, వీర్య విశ్లేషణ పరీక్షలను ప్రత్యేక రాయితీతో కేవలం రూ. 1,500కే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దంపతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు డా. సుమ చంద్రిక, డా. భవ్య రెడ్డి, డా. రాజేందర్, డా. నిఖిల్ లక్ష్మణ్, డా. వినాయక్ గౌరిశెట్టి, డా. రవీంద్రాచారి, డా. రాజేంద్ర ప్రసాద్, డా. సుమ, డా. సాయిశ్రీ, డా. సంధ్య, నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ బాబు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, బయోమెడికల్ ఇంజనీర్ రతన్ కొదాటి, నాగుల ప్రఫుల్, పరిపాలనా సిబ్బంది స్నేహ బోయిని, రమ, నీరజతో పాటు ఆసుపత్రి సిబ్బంది, సుమారు 150 మంది రోగులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా కొనసాగుతున్న

## అల్ఫోర్స్ సీబీఎస్ఈ క్లస్టర్, ఖోఖో పోటీలు

**క్రీడలు విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందిస్తాయి..**
**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, జులై25 (నినాదం):** కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాలలో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్7 ఖోఖో పోటీలు రెండో రోజు ఉత్కంఠభరి తంగా కొనసాగాయి. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి వివిధ జట్లను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సూచిం చారు. క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించడమే కాకుండా ఏ పనినైనా ఆసక్తితో, ఆత్మవిశ్వాసంతో చేయడానికి దోహదపడతాయని అన్నారు. ప్రతి మ్యాచ్ ఉత్కంఠగా సాగుతుండగా, విద్యార్థులు అత్యుత్తమ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తు న్నారని ప్రశంసించారు. పోటీల్లో అండర్14, అండర్17, అండర్19 విభాగాల్లో పలు రాష్ట్రాల నుంచి పాల్గొన్న జట్లు విజేతలుగా నిలిచాయి. అండర్14 విభాగంలో శ్రీ ప్రకాష్ కాన్సెప్ట్ స్కూల్ (ఆంధ్రప్రదేశ్), విస్టా ఇంటర్నేషనల్ స్కూల్ (హైదరాబాద్), సాధు వాసవి ఇంటర్నేషనల్ స్కూల్, బీవీబీ పబ్లిక్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (నాచారం), శ్రీ విద్యానికేతన్ (మహబూబ్ నగర్), ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఏకశిల హైస్కూల్ (వర్ధన్నపేట) తదితర జట్లు విజయం సాధించాయి. అండర్17 విభాగంలో అక్షర వాగ్దేవి పాఠశాల, ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై పాఠశాల, కమల్‌రాణి పాఠశాల, బ్లూమింగ్ పాఠశాల, చిత్తూరి పాఠశాల, జీఎంఆర్ చిన్మయ పాఠశాల, పల్లవి పాఠశాల, విద్యాభారతి, శ్రీ ప్రకాష్, వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి, మాంటిసోరి ఎలైట్, శాంతినికేతన్, శ్రీరామ్ యూని స్కూల్, సంఘమిత్ర పాఠశాల తదితర జట్లు తమ తమ మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. అండర్19 విభాగంలో శ్రీ ప్రకాష్ విద్య, పల్లవి పాఠశాల, అక్షర పాఠశాల (నెల్లూరు), హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ జట్లు విజయాలు నమోదు చేశాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఖోఖో సంఘం రిఫరీల బోర్డు కన్వీనర్ వి. సూర్యప్రకాశ్, అంతర్జాతీయ రిఫరీ రవీందర్, ఖోఖో సంఘం ప్రతినిధులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జట్టు నిర్వాహకులు, శిక్షకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలి: బాసర జోన్ డీఐజీ భాస్కరన్

**జగిత్యాల ప్రతినిధి, జూలై 25 (నినాదం):** బాసర జోన్ డీఐజీ ఆర్. భాస్కరన్, శనివారం జగిత్యాల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం (డీపీఓ) తో పాటు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి జిల్లా పోలీసింగ్ వ్యవస్థ, శాంతిభద్రతల పరిస్థితులు, నేర నియంత్రణ చర్యలు, ప్రజా భద్రత, దర్యాప్తు ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లా పోలీస్ గెస్ట్ హౌస్ కి చేరుకున్న డీఐజీకి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన డీఐజీ జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ రికార్డులు, ఎఫ్ఐఆర్‌లు, కేసు డైరీలు, సీసీటీఎన్ఎస్ నమోదు, స్టేషన్ పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవల తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా నమోదు చేసి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్యాప్తు నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, శాస్త్రీయ ఆధారాలతో కేసులను విచారించి కోర్టుల్లో శిక్షల శాతం పెంచే విధంగా పనిచేయాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ నిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనం పాటించడం ద్వారా ప్రజల్లో పోలీసులపై మరింత విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భం గా పోలీస్ స్టేషన్ ఆవరణం లో మొక్కను నాట్టారు. అనంతరం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న డీఐజీ కార్యాలయ పరిసరాలను పరిశీలించి, అక్కడ పనిచేస్తున్న వివిధ విభాగాలను సందర్శించారు. ముఖ్యంగా స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (DCRB) కార్యాలయాలను పరిశీలించి నిర్వహిస్తున్న రికార్డులు, డిజి టల్ డేటా నిర్వహణ, సమాచార సేకరణ విధానం, సాంకేతిక వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ బ్రాంచ్ ద్వారా జిల్లాలో శాంతి భద్రతలకు సంబంధించిన సమాచార సేకరణ, ముందస్తు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాపించే అసత్య ప్రచారాలు, వదంతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వాటిపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఐటీ కోర్ విభాగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల ఛేదనలో సాధిస్తున్న



పురోగతిని తెలుసుకున్నారు. సీసీటీవీ విశ్లేషణ, డిజిటల్ ఆధారాల సేకరణ, డేటా అనా లిసిస్, సైబర్ నేరాల దర్యాప్తులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. డీసీఆర్‌బీ కార్యాలయంలో నేర గణాంకాలు, పెండింగ్ కేసులు, వారెంట్‌లు, నిందితుల వివరాలు, నేర విశ్లేషణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రతి రికార్డు నవీకరించబడేలా చర్యలు



తీసుకోవాలని, డేటా ఖచ్చి తత్వాన్ని కాపాడాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీ సు కార్యాలయం, జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల మెయింటెనెన్స్ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని డీఐజీ భాస్కరన్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందిం చారు. డీఐజీ వెంట ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్, అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపిఎస్ , సీఐలు, ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

# మోడల్ సోలార్ విలేజ్ పనుల్లో వేగం పెంచాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి ప్రతినిధి, జూలై 25(నినాదం): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపికైన కాటారం మోడల్ సోలార్ విలేజ్ పనుల్లో వేగం పెంచాలి అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపికైన కాటారం మండల కేంద్రంలో సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటుపై రెడ్ కో, విద్యుత్తు, పంచాయతి రాజ్ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. టిజిఎన్పిడిసిఎల్ పరిధిలోని క్లస్టర్-3 కింద కాటారం గ్రామంలో మొత్తం 700 గృహాలకు 1400 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి 2 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నామని, ఈ ప్రాజెక్టును కేంద్రీయ భండార్, హైదరాబాద్ సంస్థ 180 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. సాంకేతిక ప్రమాణాలు ప్రాజెక్టు నిబంధనలకు అనుగుణంగా మాడ్యూల్ వినియోగించాలని స్పష్టం చేశారు. ప్రతి మాడ్యూల్‌పై తయారీ వివరాలతో కూడిన ఆర్ ఎఫ్ ఐ డి (RFID) ట్యాగింగ్ తప్పనిసరి చేయాలని అన్నారు. గుడిసెలు మరియు ఎత్తైన నిర్మాణాలపై సోలార్ ప్లాంటు ఏర్పాటుకు అనుమతి లేదని తెలిపారు. ప్లాంట్ స్థాపన అనంతరం 5 సంవత్సరాల పాటు ఉచిత నిర్వహణ అందించాల్సి ఉందని, సమస్యలు తలెత్తితే 72 గంటల్లో పరిష్కరించాలని తెలిపారు. పనుల పురోగతి రెడ్ కో మరియు టిజిఎన్ పిడిసిఎల్ నివేదికల ప్రకారం కాటారంలో ఇప్పటివరకు 334 గృహాల సర్వే పూర్తి కాగా 110 ఇళ్ల రూఫ్‌టాప్స్ గుర్తించారని 99 గృహాలకు మెటీరియల్ ఏర్పాటు జరిగినట్లు తెలిపారు.

సౌర విద్యుత్ వినియోగం ద్వారా ఉచితంగా విద్యుత్ ఇవ్వడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ ప్రాజెక్టును విజయవంతం చేయాలని ఆయన సూచించారు. అనంతరం

పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో డబుల్ ఓటు లేకుండా ప్రతి ఓటరికి ఒక్కటే ఓటు ఉండేలా చేపట్టిన సర్ ప్రక్రియ నిర్వహణకు రాజకీయ పార్టీల సహకారం చాలా అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , రెడ్ కో డిఎం రాజేందర్, విద్యుత్ శాఖ ఎస్ ఈ రమేష్, డిపిఓ శ్రీలత, ఆర్డిఓ హరికృష్ణ, భూపాలపల్లి తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, ఎన్నికల విభాగం డిటి అబ్బాస్, నవీన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలు, కూరగాయల సాగు లాభదాయకం

## ఉద్యాన విస్తరణ అధికారి రంగు ముత్యంరాజు



కోదాడ,జూలై 25(నినాదం): రైతులు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు, కూరగాయల సాగుపై దృష్టి సారిస్తూ మల్చింగ్, బిందు సేద్యం, సేంద్రీయ సాగు, పందిరి సాగు వంటి ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన విస్తరణ అధికారి రంగు ముత్యంరాజు సూచించారు. శనివారం మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో సాగవుతున్న కూరగాయల తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పందిరి సాగు, మల్చింగ్, బిందు సేద్యం, నీటి కుంటలు, కూరగాయల నారు తదితర రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకొని ఉద్యాన పంటల సాగును విస్తరించాలని కోరారు.రైతులు ఆర్థికంగా లాభదాయకమైన వ్యవసాయం చేయాలంటే ఆరుతడి పంటలు, కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. నీటి వసతి ఉన్న రైతులు వరి పంటకే పరిమితం కాకుండా ఆయిల్‌పామ్ తోటలను కూడా సాగు చేయాలని, దీంతో సుమారు 30 సంవత్సరాల పాటు ప్రతి నెలా స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు గుడిమెట్ల శ్రీనివాసరావు, వెంకటరమణ, జిక్కుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలపై ఎంఈఓ జయరాములు ప్రత్యక్ష పరిశీలన



పెబ్బేరు జూలై 25 (నినాదం): పెబ్బేరు మండల పరిధిలోని చెంచువాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి ఎస్. జయరాములు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల అభ్యాస స్థాయి, ఉపాధ్యాయుల బోధనా విధానం, ఎఫ్‌ఎల్‌ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) పరీక్షల నిర్వహణ తదితర అంశాలను



క్షుణ్ణంగా పరిశీలించారు. ఉదయం ప్రార్థన సమయంలోనే పాఠశాలకు చేరుకున్న మండల విద్యాధికారి విద్యార్థుల హాజరు, ప్రార్థన కార్యక్రమం, విద్యార్థులు నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాలను పరిశీలించారు. అనంతరం ఎఫ్‌ఎల్‌ఎన్ పరీక్షల నిర్వహణ తీరును సమీక్షిస్తూ విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసే విధానం, ఉపాధ్యాయులు అనుసరిస్తున్న బోధనా పద్ధతులు, మూల్యాంకన ప్రక్రియపై ఆరా తీశారు. బోధనలో నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నాలుగో తరగతి విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యాలను స్వయంగా పరీక్షించిన ఆయన, చదవడం, రాయడం, అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అనంతరం ప్రీ–ప్రైమరీ తరగతులను సందర్శించి చిన్నారులకు అందిస్తున్న బోధన, అభ్యాస వాతావరణం, విద్యా కార్యకలాపాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును కూడా పరిశీలించిన మండల విద్యాధికారి, భోజన నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై ఆరా తీశారు. అలాగే ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, విద్యార్థుల హాజరు పట్టికలు, పాఠశాల పరిపాలనకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, క్రమశిక్షణ, పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన ఎంఈఓ ఎస్. జయరాములు, ప్రతి విద్యార్థి ప్రాథమిక చదవడం, రాయడం, గణిత నైపుణ్యాల్లో ప్రావీణ్యం సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు అంకితభావంతో పని చేయాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి. చిన్నరాములు, ఉపాధ్యాయులు స్వాతి, మాధురి, రాధా, ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణవేణి, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాదారుడిపై పీడీ యాక్ట్

## చెర్లపల్లి జైలుకు తరలింపు



సిద్దిపేట బ్యూరో, జూలై 25 (నినాదం): ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, నిల్వ ఉంచి, ఎక్కువ ధరలకు విక్రయిస్తున్న అక్రమ వ్యాపారి బచ్చు రత్నాకర్ (వయస్సు 46 సంవత్సరాలు) పై పీడీ యాక్ట్ నమోదు చేసి, శనివారం రోజు చేర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించినట్లు పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ పత్రికా ప్రకటనలో తెలిపారు. నిందితుడు గత కొంత కాలంగా ఎలాంటి చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా తెలంగాణ రాష్ట్ర పీడీఎస్ నియంత్రణ ఉత్తర్వులు 2016 అవసర వస్తువుల చట్టం 1955 (సెక్షన్ 7) నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడనీ, నిరుపేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని కార్డ్ హోల్డర్ల నుండి రేషన్ షాప్ డీలర్ల నుండి తక్కువ ధరలకు గుట్టుచప్పుడు కాకుండా కొనుగోలు చేస్తూ ఆ బియ్యాన్ని రాయిపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో వీరభద్ర రైస్ మిల్ లో అక్రమంగా నిల్వ ఉంచి, రీసైక్లింగ్ చేసి, ఎక్కువ లాభాల కోసం బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తూ సమాజానికి అవసరమైన నిత్యావసర వస్తువుల సరఫరాకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాడన్నారు.నిందితుడిపై గతంలో 2024లో రెండు(2) కేసులు 2026 సంవత్సరాల్లో ఇలాంటివే నాలుగు(4) అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయన్నారు. పదే పదే చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను నీరుగారుస్తున్నందున ఇతనిపై కఠిన చర్యలు తీసుకోవడం అనివార్యమైందన్నారు. నిందితుడి గత నేర చరిత్ర, లభించిన ఆధారాలను పరిశీలించిన అనంతరం, ప్రజారోగ్యం, పేదల నిత్యావసర వస్తువుల సరఫరా భద్రతను దృష్టిలో ఉంచుకుని అతనిపై సిపి నిందితుడిపై పీడీ యాక్ట్ ఉత్తర్వులను జారీ చేసినట్లు తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం బచ్చు రత్నాకర్‌ను అరెస్ట్ చేసి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని చెర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించడమైనదన్నారు.ప్రజా పంపిణీ వ్యవస్థకు నష్టం చేకూరుస్తూ, పేదల బియ్యాన్ని బ్లాక్ మార్కెట్లో తరలించే ఇలాంటి అక్రమ వ్యాపారులపై భవిష్యత్తులోనూ కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని సిపి హెచ్చరించారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, రుచికరమైన ఆహారం, క్రీడా సౌకర్యాలు కల్పించాలి

## జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి





యాదాద్రి భువనగిరి జూలై 25 నినాదం: బీబీనగర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ మరియు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలను శనివారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కళాశాల కిచెన్ లోని కూరగాయలు, సరుకులు, వంట సామాగ్రి, గదులను పరిశీలించారు. పరిశుభ్రత, శానిటేషన్ ప్రమాణాలు సక్రమంగా పాటిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నిల్వలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలెక్టర్ ఆత్మీయంగా మాట్లాడారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు క్రీడా పరికరాలు (స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్) అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన విద్యా పుస్తకాలు , శిక్షణ సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు విద్యలో ప్రతిభ కనబరచడంతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొని సమగ్ర వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, జిల్లా కి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ శ్యామ్ సుందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్లు తమ ఎస్ఐఆర్ ఫారంలు త్వరితగతిన సమర్పించాలి

## మహబూబాబాద్ తహసిల్దార్ కట్టంచంద్ర రాజేశ్వర్



డోర్నకల్ /మరిపెడ జులై 25(నినాదం): జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాలు ప్రకారం, శనివారం పట్టణంలోని కోర్టు సెంటర్లో డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్,సంస్కృతిక సారధి బృందం సభ్యులతో కలిసి తహసిల్దార్ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా నియమ, నిబంధనలు ప్రకారం పూర్తి చేయాలని,బూత్ స్థాయి అధికారులుకు తెలిపారు.. ఓటర్ల లు ఎస్ఐఆర్ ఫారమ్స్ పూర్తిచేసి త్వరితగతిన సమర్పించాలని మహబూబాబాద్ తహసిల్దార్ రాజేశ్వర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ,తెలంగాణ సంస్కృతిక సారధి చైర్పర్సన్ జి. వెన్నెల సూచనల ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఎస్ ఐ ఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని,తెలంగాణ సాంస్కృతిక సారధి భరత్ కుమార్,ఐలేష్, తెలిపారు. బృందంలోని సభ్యులు,బూత్ స్థాయి అధికారులు రేష్మ, సరిత, తదిరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

## ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

చింతపల్లి, జూలై 25 (నినాదం): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం చింతపల్లి మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్లు 10, 11, వింజమూరు గ్రామంలోని పోలింగ్ స్టేషన్లు 28, 29, 30, 31, మల్లారెడ్డిపల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్లు 44, 45, తీదేడు గ్రామంలోని పోలింగ్ స్టేషన్లు 54, 55లలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఆయన సమీక్షించారు. మల్లారెడ్డిపల్లి గ్రామంలో జరిగిన సమీక్ష సమావేశంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్యూమరేషన్ ఫారాలు (ఈఎఫ్‌లు) పంపిణీ, వాటి సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియపై సంబంధిత అధికారులతో చర్చించారు. అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, బీఎల్‌వోలు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి పల్లి గ్రామ సర్పంచ్ నల్ల సుమిత రఘుమారెడ్డి,తాసిల్దార్ పండాల విజయలక్ష్మి , మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్ల రఘుమా రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎరుకల వెంకటయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు హరిలాల్ నాయక్, మాజీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, అడ్వకేట్ కొర్ర రామ్ సింగ్ నాయక్, మాజీ జెడ్పిటిసి జె .నరసింహ యాదవ్, కాసారపు శ్రీనివాస్, ఆర్ఐ సునీత, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ గణేష్ పార్ బాయిల్డ్ మోడ్రన్ రైస్ మిల్లు వల్ల ప్రజలకు ఇబ్బందులు



హుజుర్నగర్,జూలై 25 (నినాదం): శ్రీ లక్ష్మీ గణేష్ రైస్ మిల్ వల్ల ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని హుజుర్నగర్ వాసులు రైస్ మిల్లు ముందర గౌరవ్ చేశారు. సూర్యపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలో మిర్యాలగూడ రోడ్డు నందు గల శ్రీలక్షి గణేష్ ఫార్ బాయిల్డ్ మోడ్రన్ రైసుమిల్లు నుండి విపరీతమైన బూడిద, పొట్టు కాలుష్యం వాదులుతున్నారు. యజమాన్యం నింబంధనలకు వ్యతిరేకంగా పొట్టు గది, సరైన బూడిద గది లేకుండా బహిరంగంగా వదులుతూ ప్రజల ఆరోగ్యలతో చెలగాటం తో ఆడుకుంటున్నారు. కనీస నింబందనలు కూడా పాటించకుండా కాలుష్యం వదలటం వలన పరిసరాల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హుజూర్ నగర్ మిర్యాలగూడ రాక పోకలు చేసే వివిధ వాహనదారులు, పాదచారులు కూడా కళ్ళల్లో బూడిద పడి ఇబ్బందులు పడుటమే కాకుండా అనేక సార్లు రోడ్డు ప్రమాదాలకు కూడ ఈ బూడిద పొట్టు కాలుష్యమే గత నెల రోజుల నుండి విచ్చల విడిగా బూడిదను బహిరంగంగా వాదులుతున్నారు. ఈ మిల్లుకు కనీసం ప్రహరీ గోడ కూడా లేదు గత 15 రోజుల క్రితం మిల్లును బూడిద బాధిత ప్రతాలను పురపాలక సంఘం కమీషనర్ సతీష్ కు ఫిర్యాదు ఇస్తే అట్టి ప్రదేశాన్ని సందర్శించి పలు సూచనలు కాలుష్య నివారణ చర్యలు తీసుకోవాలని హెచ్చరించటం జరిగింది అయినా మిల్లు యజమాని అట్టి సూచనలు ఏమాత్రం లెక్క చేయకుండా తన ఇష్టానుసారంగా మిల్లును నడుపుతూ కాలుష్యం వెదజల్లుతున్నాడు శనివారం పరిసరాల కాలనీ వాసులు మిల్లు జయమానిని నిలదీశారు. మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి నరసింహారావు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లి రవి వచ్చిన్ నింబందలకు విరుద్దంగా మిల్లు నడపటం సరైంది కాదని 15 రోజులలో అన్నీ నివారణ చర్యలు తీసుకోవాలని మిల్లు యజమాని చెప్పి కాలుష్య బాధితులను శాంతపరిచి అక్కడనుండి పంపించారు . కౌన్సిలర్ యడ్ల విజయ్,శ్రీమన్నారాయణ, నాగేశ్వర రావు ఆంజనేయులు లాలయ్య నరసింహ, శంకర్ రావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తి అరెస్టు



మిర్యాలగూడ జూలై 25(నినాదం): మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ లో మహిళ మెడలో బంగారు పుస్తెలతాడు ను లాక్కొని పోయిన వ్యక్తిని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకున్నట్లు నల్లగొండ అర్బనల్ డిఎస్పీ రమేష్ తెలిపారు. శనివారం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 12న మిర్యాలగూడ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఒక రిటైర్డ్ హెడ్మాస్టర్ ఇంటి ముందు నిందితుడు ముఖంపై ముసుగు కట్టుకొని ఒక అడ్రస్ కావాలని ఫోన్లో ఎవరితో మాట్లాడుతూ మహిళ మెడలో నుండి తొమ్మిది తులాల బంగారం బలవంతంగా లాక్కొని పారిపోయాడని తెలిపారు. అదే రోజు బాధితులుతులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఇట్టి కేసును నలగొండ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ, పర్యవేక్షణలో సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి సిసి టీవీ టీవీ ఆధారాలతో సాంకేతిక పరిజ్ఞానంతో చాకచక్యంగా ఆంధ్రప్రదేశ్ చెందినవాడిగా గుర్తించారు.శనివారం మధ్యాహ్నం మిర్యాలగూడలో మరో దొంగతనాన్ని పాల్పడుతుండగా నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు. అతని విచారించగా షేక్ నాగోల్ వెల్డింగ్ పని చేస్తు దాచేపల్లి మండలం పల్నాడు జిల్లాకు చెందిన వాడిగా తెలిపాడు.అతని నుండి బంగారు పూసలతాడు,పుస్తెలు, రెండు తులాల బంగారం, చైన్లు ఒక యాక్టివా బండి, మొబైల్ ఫోన్ని స్వాధీనం చేసుకున్నారు.ఇట్టి కేసును చేదించిన వన్ టౌన్ సిఐ నాగభూషణం,ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్,వెంకటేశ్వర్లు, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ లను అడిషనల్ ఎస్పీ అభినందించారు.

# ఫోక్సో కేసులో నిందితుడు అరెస్ట్ రిమాండ్

మహదేవపూర్ జులై25,(నినాదం): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన వేణు అనే వ్యక్తిని పోక్సో కేసులో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ కు తరలించినట్లు మహదేవపూర్ ఎస్ఐ సాంబమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం సూరారం గ్రామానికి చెందిన వేణు మైనర్ బాలికను తీసుకెళ్లిన ఘటనపై మొదట కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాగా, దర్యాప్తు లో భాగంగా ఆమె ఇచ్చిన స్టేట్మెంట్ , వాంగ్మూలం ఆధారంగా నిందితులపై ఫోక్సో చట్టం కింద అదనపు సెక్షన్లు నమోదు చేశామని వివరించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. మైనర్ బాలికలపై జరిగే నేరాల విషయంలో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# మన పంటలే మనకు ఆధారం

## పంట మార్పిడితోనే రైతులకు, సమాజానికి మేలు: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్







డోర్నకల్ /మరిపెడ జులై 25(నినాదం) శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామానికి చెందిన గిరిజన రైతు బాదావత్ వీరన్న–బుజ్జి దంపతుల పొలంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పెసర విత్తనాలు వేసి పంట మార్పిడి విధానాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగుకు అవసరమైన సలహాలు అందించాలని ఆదేశించారు.వాతావరణ మార్పులు, అకాల వర్షాలు మరియు 'సూపర్ ఎల్–నినో' వల్ల ఏర్పడే వర్షాభావ పరిస్థితులను తట్టుకోవడానికి రైతులందరూ పంట మార్పిడి పద్ధతులను పాటించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.కేవలం వరి, మొక్కజొన్నలకే పరిమితం కాకుండా పప్పు దినుసులు, నూనె గింజలు (కుసుమ/ ఆయిల్ పామ్, నువ్వులు), కూరగాయల సాగుపై దృష్టి సారించాలి.ప్రతి రైతు తమ భూమిని భాగాలుగా చేసి వివిధ రకాల ప్రత్యామ్నాయ పంటలు పండించాలన్నారు. జిల్లాలో నూతన ప్రాజెక్ట్ ద్వారా ప్రతి గ్రామంలో అన్ని రకాల పోషకాహార పంటలు పండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.వి బి –జి రామ్ జి (ఉపాధి హామీ) పథకంలోని యానిమల్ హెల్త్ క్లినిక్స్ సౌకర్యాన్ని ఉపయోగించి, కుక్కల మాదిరిగానే కోతులకు కూడా 'స్టెరిలైజేషన్' (స్టీరిలిజషన్ ) చేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని అన్నారు.అధిక యూరియా, పురుగుమందుల వాడకం వల్ల ఆహారంలో పోషకాలు తగ్గి పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోందని. రైతులు సామాజిక బాధ్యతతో ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ/ఆరోగ్యకరమైన పంటలను పండించాలి. తక్కువ రసాయనాలు వాడే రైతుల ఉత్పత్తులకు నగరాల్లో మంచి మార్కెటింగ్ కల్పిస్తామని అన్నారు.అవసరం లేని పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయడానికి వేల కోట్లు వెచ్చించే బదులు,ఆ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, మంచి పాఠశాలలు,కళాశాలలు నిర్మించుకోవచ్చని కలెక్టర్ అన్నారు. రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆలోచించి, ప్రభుత్వానికి సహకరిస్తూ లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కలెక్టర్ కోరారు. పంట మార్పిడి అవగాహన కార్యక్రమంలో భాగంగా భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి– భారతీయ ఉద్యాన పరిశోధన స్థానం, బెంగళూరు వారిచే రూపొందించబడిన నల్ల తామర పురుగులు తట్టుకునే అర్క తేజస్వి రకం విత్తనాలను రైతులకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ చేతి మీద పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. మధ్య తెలంగాణ మండలి జిల్లాలకు సంబంధించి మిరప సాగు గురించి పరిశోధనలు జరుపుతున్న ఉద్యాన పరిశోధన స్థానం, మల్యాల వారిచే ఈ రకాన్ని 2022 సంవత్సరం నుండి రైతుల క్షేత్రాలులో సాగు చేయించి ఎకరానికి 40 క్వింటాల్ వరకు మిరప దిగుబడి సాధించడం జరిగింది. 2026 సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 250 ఎకరాలలో ఈ రకం విత్తనాన్ని రైతులకు పంపిణీ చేయడం జరుగుతుంది. ఈ విత్తనాల పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో డా.ప్రశాంత్ ప్రధాన శాస్త్రవేత్త,హే ఆర్ ఎస్ మల్యాల వారు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి రెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న,మరిపెడ వ్యవసాయ సహాయ సంచాలకులు పి .మురళి, మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి,ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏ ప్రశాంత్ ,కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ దిలీప్,ఉద్యాన శాస్త్రవేత్త ఎల్ సుహాసిని,వ్యవసాయ అధికారులు వీరా సింగ్,శ్రీదేవి, వ్యవసాయ విస్తరణ అధికారులు,సర్పంచ్ లచ్చుపతి, మరిపెడ వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,మండల అభివృద్ధి అధికారి వేణుగోపాల్ రెడ్డి,తాసిల్దార్ కృష్ణవేణి,ఇరిగేషన్ అధికారులు,విద్యుత్ అధికారులు,ఉద్యాన అధికారులు శాంతిప్రియ,కాంగ్రెస్ నాయకులు రంగారెడ్డి నూకల, మండల అధ్యక్షులు రఘువీరారెడ్డి, మరిపెడ కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి,గ్రామ నాయకులు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు వెనక్కితీసుకోవాలి


**మంచిర్యాల, జులై 25 (నినాదం):** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బీ ఆర్ఎస్ మంచిర్యాల పట్టణ మాజీ అధ్యక్షుడు గాదె సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద ఉన్న డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంపీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ వ్యక్తిగత దూషణలు, హుందాతనాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న కేటీఆర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన నాయకులు రాజకీయ మర్యాదలను పాటించాలని సూచించారు. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని ప్రజలకు, బీఆర్ఎస్ శ్రేణులకు క్షమాపణ చెప్పాలని ఎంపీ వంశీకృష్ణను డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల సమస్యలను పక్కనబెట్టి రాజకీయ దూషణలకు పాల్పడటం ప్రజలు గమనిస్తున్నారని, అలాంటి రాజకీయాలకు తగిన గుణపాఠం చెబుతారని నాయకులు అన్నారు.



నిరసన సందర్భంగా కార్యకర్తలు కేటీఆర్‌కు మద్దతుగా, ఎంపీ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్ద కొంతసేపు ఆందోళన నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమం ప్రశాంతంగా ముగియగా, బీఆర్ఎస్ నాయకులు ఐక్యంగా పార్టీ నాయకత్వానికి అండగా నిలుస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల కార్పొరేషన్ పరిధికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

**రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**





**నిర్మల్ ప్రతినిధి, జూలై 25 (నినాదం):** జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, ఇతర అధికారులతో కలిసి అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులతో శనివారం సాయంత్రం జలసిరి కార్యక్రమం, విబిజి రామ్ జి పనులు, గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు జలసిరి కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట, కానీ నినాదంతో భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు ప్రారంభించామని అన్నారు. ప్రతి రైతు తమ పొలాలలో ఫామ్ పాండ్ నిర్మించుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాలన్నారు. రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. విబిజి రామ్ జి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులలో దేశంలోనే ముందువరుసలో ఉన్నామని అన్నారు. అర్హులైన ప్రతి పేద కూలీలందరికీ పని దినాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీసీ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఈఈ ఆర్డబ్ల్యుఎస్ సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్ర గ్రామం కోసం ప్రత్యేక చొరవ

**పారిశుద్ధ్య సిబ్బందికి రక్షణ సామగ్రి పంపిణీ**

**జూలపల్లి సర్పంచ్ పాటకుల అనుష**



**సుల్తానాబాద్, జులై 25 (నినాదం):** పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలోని జూలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి సర్పంచ్ పాతకుల అనూష, పాలకవర్గ సభ్యులు శనివారం పరిశుభ్రత సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని కొనియాడారు. వారి ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన పరిశుభ్రత సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



**నిర్మల్ ప్రతినిధి, జూలై 25 (నినాదం):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో, శనివారం కనకపుర్ చౌరస్తాలో నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాకాయలు పేల్చి, మిఠాయిలు పంచుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన నీట్ (చీజుజు) పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంపై బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం విద్యార్థుల పోరాటానికి, కాంగ్రెస్ పార్టీ చేసిన నిరంతర డిమాండ్‌కు లభించిన విజయమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, లక్ష్మణ్‌చాంద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేష్ రెడ్డి, మామడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాథోడ్ సంతోష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఎస్ ఫ్యాక్టరీలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**నిర్మల్ ప్రతినిధి, భైంసా : జులై 25 (నినాదం):** శనివారం భైంసా పట్టణంలోని ఎస్ఎస్ ఫ్యాక్టరీలో ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ-=ఖీ) చెక్కులను లబ్ధిదారులకు ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ అందజేశారు. ఈ సందర్భంగా బెల్తరోడ్ గ్రామానికి చెందిన జంగం రుక్మభాయ్, బోరెగాం గ్రామానికి చెందిన కాస్రెల్లి పోతన్నలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించి వారి కుటుంబాలకు అండగా నిలిచారు. ప్రజల సంక్షేమమే ఆయన లక్ష్యం అనే దృఢ సంకల్పంతో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

# ఎస్సీ వసతి గృహాల ఆకస్మిక తనిఖీ



**మంథని జూలై 25 (నినాదం) :** జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్ శనివారం మంథని పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహం, కాలేజీ బాయ్స్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలో ఉంటున్న విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం, తాగునీరు, పరిశుభ్రత, వసతి సౌకర్యాల గురించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, బిల్లులతో సహా పలు రికార్డులను పరిశీలించారు. వసతి గృహాల్లో ఎలాంటి లోపాలు లేకుండా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సకాలంలో అందించాలని వసతి గృహ సంక్షేమ అధికారులు తిరుపతి, రమేష్‌లకు తగు సూచనలు చేశారు. నాణ్యమైన ఆహారం, క్రమం తప్పకుండా మెనూ పాటించాలని, విద్యార్థుల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని ఆదేశించారు. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం రాకుండా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రవీందర్ సూచించారు.

# తుర్కపల్లిలో పోలీసుల ముమ్మర తనిఖీలు



**22 వాహనాలు సీజ్**

చెన్నూర్ జూలై, 25 (నినాదం) మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం తుర్కపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం చెన్నూర్ పట్టణ సీఐ బన్సీలాల్ ముమ్మర తనిఖీలు నిర్వహించారు. రామగుండం సీపీ, మంచిర్యాల డీసీపీ, జైపూర్ ఏసీపీల ఆదేశాల మేరకు ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చేపట్టారు. 22 వాహనాల సీజ్ పోలీసులు గ్రామంలోని ప్రతి ఇంటిని, వీధులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సోదాల్లో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 20 ద్విచక్ర వాహనాలను, రెండు ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. నేరాలపై అవగాహన ఈ సందర్భంగా చెన్నూర్ పట్టణ సీఐ బన్సీలాల్ గ్రామస్తులతో సమావేశమై పలు సామాజికాంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన గుడుంబా నిర్మూలన: గ్రామంలో గుడుంబాను పూర్తిగా అరికట్టడానికి ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి సహకరించలని కోరారు.

**ట్రాఫిక్ నిబంధనలు:**

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. మద్యం సేవించి వాహనాలు నడపరాదు. యువత జాగ్రత్త: మాదకద్రవ్యాలు, గంజాయికి బానిసై విలువైన జీవితాలను పాడుచేసుకోవద్దని తెలిపారు రాత్రి వేళల్లో గంజాయి, మద్యం తాగి తిరిగే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలి. సైబర్, మహిళల భద్రత: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐతోపాటు ఎస్సై శాంపటేల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

# శుద్ధి అబద్ధమే...!

**మినరల్ పేరుతో దోపిడి**

**పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు**

**నిబంధనలు పాటించని నిర్వాహకులు**

**పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం**





**మంచిర్యాల, జులై 25 (నినాదం):** ఒకప్పుడు దాహం తీర్చేది బావి నీరు... తర్వాత గ్రామీణ మంచినీటి పథకాలు... ఇప్పుడు మాత్రం ప్రతి ఇంటి గుమ్మం వద్దకు చేరుతున్న మినరల్ వాటర్ క్యాన్లు. స్వచ్ఛమైన నీరు అందిస్తామని నమ్మకం కల్పిస్తున్న ఈ వ్యాపారం వెనుక ప్రజల ఆరోగ్యంతో చెలగాటం జరుగుతోందనే ఆరోపణలు జిల్లాలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వ అనుమతులు, నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత నిబంధనలను పూర్తిగా విస్మరించి అనేక తాగునీటి ప్లాంట్లు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాగునీరు అనే ప్రాథమిక అవసరాన్నే కొందరు వ్యాపారంగా మార్చుకుని ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలు మినరల్ వాటర్ అని నమ్మి కొనుగోలు చేస్తున్న నీరు నిజంగా సురక్షితమా? శుద్ధి ప్రక్రియలు సక్రమంగా జరుగుతున్నాయా? క్యాన్లు పరిశుభ్రంగా ఉన్నాయా? నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారా? అనే ప్రశ్నలకు సమాధానాలు కనిపించడం లేదు. ప్రభుత్వ పర్యవేక్షణ బలహీనపడటంతో అక్రమ ప్లాంట్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అవసరాన్ని అవకాశంగా మార్చుకున్న వ్యాపారులు..**

జిల్లాలో వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, భూగర్భ జలాల కాలుష్యం, మంచినీటి కొరత కారణంగా ప్రజలు మినరల్ వాటర్‌పై ఆధారపడుతున్నారు. ఈ పరిస్థితిని కొందరు వ్యాపారులు అవకాశంగా మలుచుకుని అనుమతులు లేకుండానే చిన్నచిన్న ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. బోర్ల నుంచి నీటిని తోడి కనీస ప్రమాణాలు పాటించకుండా క్యాన్లలో నింపి ప్రజలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ప్లాంట్లలో నీటి శుద్ధి యంత్రాలు కూడా సరిగా పనిచేయడం లేదని, అయినా అదే నీటిని ప్యూర్ మినరల్ వాటర్ పేరుతో విక్రయిస్తున్నట్లు పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**పరిశుభ్రతే ప్రశ్నార్థకం..**

20 లీటర్ల క్యాన్లు ప్రతి వినియోగం తర్వాత శుభ్రపరచి శానిటైజ్ చేయాల్సి ఉన్నా, చాలా చోట్ల కేవలం నీటితో కడిగి మళ్లీ నింపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని క్యాన్లపై పచ్చిబూజ, దుమ్ము, మురికి పేరుకుపోయినా అవే వినియోగదారులకు చేరుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. పగుళ్లు వచ్చిన క్యాన్లు, మూతలు సరిగా సీల్ చేయని డబ్బాలు కూడా సరఫరా అవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. పెళ్లిళ్లు, శుభకార్యాలు, సమావేశాల సమయంలో డిమాండ్ పెరగడంతో ఈ అక్రమ వ్యాపారం మరింత జోరందుకుంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటం...**

కలుషిత నీటిని తాగడం వల్ల విరేచనాలు, టైఫాయిడ్, కలరా, జీర్ణాశయ వ్యాధులు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఇలాంటి నీటిని వినియోగిస్తే తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని చెబుతున్నారు. అయినప్పటికీ కొందరు వ్యాపారులు లాభాల కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**నిబంధనలు కాగితాలకే పరిమితం...**

మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహించాలంటే సంబంధిత శాఖల అనుమతులు, నీటి నాణ్యత పరీక్షలు, ప్రమాణాలకు అనుగుణమైన శుద్ధి యంత్రాలు, పరిశుభ్రమైన నిల్వ గదులు, క్రమం తప్పని తనిఖీలు తప్పనిసరి. అయితే జిల్లాలోని అనేక ప్లాంట్లలో ఇవేవీ పాటించడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో పరిమితికి మించి రసాయనాలను కలిపి నీటిని విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయినప్పటికీ సంబంధిత శాఖలు పెద్దగా స్పందించడం లేదని ప్రజలు అంటున్నారు.

**తనిఖీలు ఎక్కడ..?**

అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, జిల్లాలో అలాంటి చర్యలు అరుదుగానే కనిపిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అప్పుడప్పుడు మాత్రమే దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని విమర్శిస్తున్నారు. అక్రమ ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారి సంఖ్య పెరుగుతోందని చెబుతున్నారు.

**బోర్లు ఇష్టారాజ్యం.. భూగర్భ జలాలకు ముప్పు..**

అనుమతులు లేకుండా భారీ బోర్లు తవ్వి రోజుకు వేల లీటర్ల నీటిని తోడేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో భూగర్భ జలమట్టం తగ్గిపోతుండగా, సమీప ప్రాంతాల ప్రజలకు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. తాగునీటి వ్యాపారం పేరుతో ప్రకృతి వనరులను కూడా విచ్చలవిడిగా వినియోగిస్తున్నారని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు.

**వినియోగదారులు గుర్తుంచుకోవాల్సినవి...**

ఐఎస్ఐ లేదా సంబంధిత ప్రమాణాల గుర్తింపు ఉన్న నీటినే కొనుగోలు చేయాలి.

సీల్ దెబ్బతిన్న క్యాన్లను స్వీకరించకూడదు.

నీటి రుచి, రంగు, వాసనలో మార్పు కనిపిస్తే వెంటనే వినియోగం నిలిపివేయాలి.

పరిశుభ్రత లేని ప్లాంట్లపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.

ప్రతి క్యాన్‌పై తయారీ వివరాలు, సరఫరాదారు వివరాలు ఉన్నాయో లేదో పరిశీలించాలి.

జిల్లాలోని అన్ని వాటర్ ప్లాంట్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి.

అనుమతులు లేని ప్లాంట్లను వెంటనే మూసివేయడంతో పాటు

నాసిరకం నీటిని విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీపై అధికారులకు శిక్షణ



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 25 (నినాదం):** భారత జనగణన-2027లో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో గ్రామ, పట్టణ డైరెక్టరీల వివరాల సేకరణపై నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల నుంచి సేకరించే సమాచారాన్ని అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, డేటా సేకరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. 1951 జనగణన నుంచి జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ నిరంతరంగా ప్రచురితమవుతోందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల జనాభా, సామాజిక, ఆర్థిక, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించే ప్రామాణిక గ్రంథమని తెలిపారు. అభివృద్ధి ప్రణాళికలు, పరిపాలన, పరిశోధనలు, విధాన రూపకల్పనలో ఇది కీలకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. హ్యాండ్ బుక్‌లో పార్ట్-ఏలో గ్రామ, పట్టణ డైరెక్టరీలు, పార్ట్--బీలో ప్రాథమిక గణన సారాంశం పొందుపరుస్తారని వివరించారు. విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, రవాణా, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూమి వినియోగం, సాగునీరు, వ్యవసాయం, పరిశ్రమలు, హస్తకళలు, పట్టణ మౌలిక సదుపాయాలు, మురికివాడల వివరాలు తదితర సమాచారాన్ని మొబైల్ యాప్, వెబ్ పోర్టల్, అవసరమైతే భౌతిక షెడ్యూల్ ద్వారా సేకరిస్తామని తెలిపారు. ఛార్జ్ అధికారుల బాధ్యతలు, ఫీల్డ్ సిబ్బంది నియామకం, యూజర్ ఐడీల సృష్టి, ఫీల్డ్ వర్క్ పర్యవేక్షణ, డేటా ధృవీకరణ, గౌరవ వేతనాల పంపిణీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ, పట్టణ కోడ్ల నమోదులో ఖచ్చితత్వం పాటించాలని, సంబంధిత శాఖల రికార్డులకు అనుగుణంగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను గోప్యంగా ఉంచాలని, అధికారిక యాప్, పోర్టల్‌లను మాత్రమే వినియోగించాలని, అధికారిక సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి గురవయ్య, జిల్లా కో-ఆర్డినేటర్ కృష్ణయ్య, శిక్షకుడు అభిషేక్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గురుకులంలో డెటాల్ తాగిన ఇద్దరు విద్యార్థులు

**ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స... అసలేం జరిగింది**

**ఆసుపత్రి బెడ్ల మీద విద్యార్థులు..?**

**జూమ్ మీటింగ్ లో ఉపాధ్యాయులు**

**ప్రజాసంఘాల పరామర్శ**



**మంథని జూలై 25( నినాదం) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని గురుకుల పాఠశాల హాస్టల్ లో డెటాల్ తాగిన ఇద్దరు విద్యార్థులు శనివారం అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వివిధ ప్రజాసంఘాల నాయకులు ఆసుపత్రికి చేరుకొని విద్యార్థులను పరామర్శించారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నాయకులు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మంథని సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ లో ఏ కారణాల వల్ల విద్యార్థులు డెటాల్ తాగారో తెలియాల్సి ఉండగా విద్యార్థులు మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతు ఉండగా సంబంధిత హౌస్ మాస్టర్ హెల్త్ సూపర్వైజర్ యాజమాన్యం సంబంధిత హాస్టల్ ప్రిన్సిపాల్ ఇతర టీచర్లు ఉన్నత స్థాయి అధికారులతో జూమ్ మీటింగ్ లో ఉన్నామని చెప్పడం పట్ల ప్రజా సంఘాల నాయకులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేసారు. ఇటీవలే మంథని గురుకుల హాస్టల్ లో ఇద్దరు విద్యార్థులు డెటాల్ తాగగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. సంఘటన మరువక ముందే మళ్లీ ఇద్దరు విద్యార్థులు డెటాల్ తాగారు. ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయని ఇంకా ఇలాంటి ఘటనలే తిరిగి పునరావృతం కాకుండా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ గురుకులాల్లో విద్యార్థుల భద్రత, ఆహారం, వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మంథని లింగయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజకుమార్ పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న కూచాడి శ్రీహరి రావు



**నిర్మల్ ప్రతినిధి, జూలై 25 (నినాదం):** తొలి ఏకాదశి సందర్భంగా నిర్మల్ పట్టణంలోని దేవరకోట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన పవిత్ర పల్లకి సేవలో నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు , నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో 30 వార్డు కౌన్సిలర్ ఎస్పీ రాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ రికవరీ మేళా.. 117 ఫోన్లు అప్పగింత

**కొమురం భీం ఆసిఫాబాద్, జూలై 25(నినాదం) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన మొబైల్ రికవరీ మేళాలో రూ. 23.40 లక్షల విలువైన 117 మొబైల్ ఫోన్లను ఎస్పీ నితికా పంత్ బాధితులకు అందజేశారు. మొబైల్ ఫోన్లలో బ్యాంకు ఖాతాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారం భద్రంగా ఉండే నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. బలహీనమైన పాస్‌వర్డ్‌లను హ్యాక్ చేసి ఫోన్‌పే, గూగుల్ పే వంటి యాప్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేస్తున్నారని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సిఈఐఆర్ (జజు×=) పోర్టల్‌లో బ్లాక్ చేసి, సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసే వారు తప్పనిసరిగా విక్రేత నుంచి రసీదు తీసుకోవాలని, దొంగిలించిన ఫోన్లను తెలిసి కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# స్టిల్ లైఫ్ ఫోటోగ్రఫీ మాస్ట్రో
# మహేష్ విశ్వనాథ

## ఎన్నో వందల ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ అవార్డులు



**లక్షల్లో రివార్డులు... అయినా అవార్డుల కంటే అనుభవాలే గొప్పవని నమ్మే**
**స్టిల్ లైఫ్ ఫోటోగ్రఫీ మాస్ట్రో మహేష్ విశ్వనాథ**
**కెమెరా కళ్లతో ప్రపంచాన్ని చూసిన కళాకారుడు – మహేష్ విశ్వనాథ ప్రయాణం**
**సాఫ్ట్‌వేర్ నుంచి సెల్యులాయిడ్ కలల వరకు...**
**అభిరుచిని వృత్తిగా మార్చుకున్న అంతర్జాతీయ ఫోటోగ్రాఫర్**

**ఒక కెమెరా...**
**ఒక కల...**
**ఒక అంతర్జాతీయ ప్రయాణం...**
**అవార్డులకంటే అనుభవాలే గొప్పవి**
**మహేష్ విశ్వనాథతో బ్యూరో చీఫ్ ఇందిరా ప్రియదర్శిని ప్రత్యేక ఇంటర్వ్యూ**

**సాఫ్ట్‌వేర్ రంగంలో విదేశాల్లో స్థిరపడిన జీవితాన్ని వదిలి, తన అభిరుచినే వృత్తిగా మలుచుకుని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఫోటోగ్రాఫర్ మహేష్. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి మనవడైన ఆయన, స్టిల్ లైఫ్, ప్రెస్, బర్డ్, పోర్ట్రెయిట్, ఆర్కిటెక్చర్, స్ట్రీట్, ట్రావెల్ వంటి పలు ఫోటోగ్రఫీ విభాగాల్లో తనదైన ముద్ర వేశారు. ఆయన చిత్రాలు ప్రపంచంలోని 50కి పైగా దేశాల్లో ప్రదర్శించబడి, వందలాది అంతర్జాతీయ అవార్డులు, గౌరవాలు అందుకున్నాయి.**

ఫోటోగ్రాఫర్‌గా మాత్రమే కాకుండా రచయితగానూ ఆయన విశిష్ట గుర్తింపు పొందారు. ఫోటోగ్రఫీకి సంబంధించిన సాంకేతిక అంశాలు, కళాత్మక దృక్కోణం, ప్రాక్టికల్ అనుభవాలను సులభమైన భాషలో అందించే పలు పుస్తకాలను రచించారు. తెలుగు పాఠకులకు ఫోటోగ్రఫీని చేరువ చేయాలనే లక్ష్యంతో ఆయన రచనలు ఎంతోమందికి మార్గదర్శకంగా నిలిచాయి. ప్రారంభ స్థాయి నుంచి ప్రొఫెషనల్ స్థాయి వరకు ఫోటోగ్రఫీపై ఆసక్తి ఉన్నవారికి ఆయన పుస్తకాలు ఉపయోగకరమైన గ్రంథాలుగా గుర్తింపు పొందాయి.దేశ, విదేశాల్లో నిర్వహించిన ఫోటో ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, శిక్షణ కార్యక్రమాల ద్వారా వేలాది మంది యువ ఫోటోగ్రాఫర్లకు స్ఫూర్తినిస్తూ, ఫోటోగ్రఫీని కేవలం ఒక వృత్తిగా కాకుండా సృజనాత్మక జీవన విధానంగా పరిచయం చేస్తున్నారు. సాధన, స్పష్టమైన లక్ష్యం, సరైన దృక్కోణం ఉంటే ఏ సాధారణ కెమెరాతోనైనా అసాధారణ చిత్రాలు సృష్టించవచ్చనే సందేశాన్ని ఆయన నిరంతరం అందిస్తున్నారు..

**నినాదం : ముందుగా మీ గురించి చెప్పండి. మీ కుటుంబ నేపథ్యం, చదువు, ఫోటోగ్రఫీలోకి ఎలా వచ్చారు?**

మహేష్ విశ్వనాథ : కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు మా తాత గారు . నా చదువంతా విజయవాడలో జరిగింది. తర్వాత తనుకులో ఎం సి ఏ పూర్తి చేశాను. ఆ తర్వాత కెనడాలో మాస్టర్స్ చేసి అక్కడ కొంతకాలం ఉద్యోగం చేశాను. అనంతరం అమెరికాలోని శాన్ డియాగోలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ, వివిధ ప్రాంతాలు తిరిగే అవకాశం వచ్చింది.చిన్నప్పటి నుంచే ఫోటోగ్రఫీపై ఆసక్తి ఉండేది. అమెరికాలో నీకోన్ డి 5 కెమెరా కొనుగోలు చేసిన తర్వాత ఆ ఆసక్తి మరింత పెరిగింది. 'ఈ కెమెరా నీకు చాలా అడ్వాన్స్‌డ్' అని షాపులో చెప్పిన మాటే నాకు ఒక ఛాలెంజ్‌గా మారింది. అప్పటి నుంచి ఫోటోగ్రఫీని సీరియస్‌గా నేర్చుకోవడం ప్రారంభించాను.సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కంటే సృజనాత్మక రంగంలో ఉండాలనే కోరికతో భారత్‌కు వచ్చి ప్రెస్ ఫోటోగ్రఫీలో అడుగుపెట్టాను. తర్వాత స్టిల్ లైఫ్, పోర్ట్రెయిట్, వైల్డ్‌లైఫ్, బర్డ్, ఆర్కిటెక్చర్, ప్రెస్ ఫోటోగ్రఫీ ఇలా అనేక విభాగాల్లో శిక్షణ తీసుకుని నా నైపుణ్యాన్ని పెంచుకున్నాను. నేడు నా ఫొటోలు 50కి పైగా దేశాల్లో ప్రదర్శించబడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా వందలాది అంతర్జాతీయ అవార్డులు, అనేక ఫోటోగ్రఫీ గౌరవాలు అందుకోవడం నా ప్రయాణంలో అత్యంత సంతృప్తినిచ్చిన విషయం.



**నినాదం : ఒక ఫోటో వెయ్యి మాటలు చెబుతుందంటారు. మీ జీవితాన్ని ఒక్క ఫోటోతో చెప్పాలంటే అది ఎలా ఉంటుంది?**

మహేష్ విశ్వనాథ :
ఫోటోగ్రాఫర్‌గా నా జీవితాన్ని ఒక్క ఫోటోతో చెప్పాలంటే, నేను తీసిన ' రెడ్ ఆన్ వైట్ ' స్టిల్ లైఫ్ ఫోటోనే చెబుతాను. ఆ ఒక్క ఫోటోకే దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో 50కి పైగా అవార్డులు వచ్చాయి. ఫోటోగ్రఫీకి అత్యంత కఠినమైన వేదికలుగా భావించే విదేశీ సలోన్లలో కూడా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందుకోవడం నాకు ఎంతో గర్వకారణం.స్టిల్ లైఫ్ ఫోటోగ్రఫీలో స్పెయిన్ వంటి దేశాల ఫోటోగ్రాఫర్లు ప్రపంచస్థాయి మాస్టర్‌పీసెస్ సృష్టిస్తారు. అలాంటి వేదికల్లో నా ' రెడ్ ఆన్ వైట్ ' ఫోటో కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.అలాగే, కెనడాలోని టొరంటోలో 133 ఏళ్ల చరిత్ర కలిగిన అంతర్జాతీయ ఫోటోగ్రఫీ పోటీల్లో వరుసగా రెండేళ్లు స్టిల్ లైఫ్ విభాగంలో అవార్డు అందుకున్నాను. ఇప్పుడు మూడో ఏడాది కూడా గెలిచి హ్యాట్రిక్ సాధించాలన్నదే నా లక్ష్యం.

**నినాదం : మీరు తీసిన ఫోటోల్లో మీకు అత్యంత భావోద్వేగాన్ని కలిగించిన చిత్రం ఏది? దాని వెనుక ఏదైనా కథ ఉందా?**

మహేష్ విశ్వనాథ:
నా జీవితంలో అత్యంత భావోద్వేగాన్ని కలిగించిన ఫోటో చివరి నిజాం మీర్ బర్కత్ అలీ ఖాన్ ముఖర్రం జా అంత్యక్రియల సందర్భంగా తీసిన చిత్రం. నిజాం కుటుంబంతో ఉన్న అనుబంధం వల్ల ఆ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం నాకు లభించింది.చౌమహల్లా ప్యాలెస్ నుంచి మక్కా మసీదు వరకు సాగిన అంతిమయాత్రను ఒక ప్రత్యేక దృక్కోణంలో చిత్రీకరించాలనే ఉద్దేశంతో నేను మరో ఫోటోగ్రాఫర్‌తో కలిసి వేగంగా పరిగెత్తి ఒక భవనం టెర్రస్‌పైకి చేరుకుని పై నుంచి ఆ దృశ్యాన్ని బంధించాను. వేలాది మంది ప్రజల మధ్య సాగిన ఆ అంతిమయాత్రలో చరిత్ర, సంస్కృతి, భావోద్వేగం——అన్నీ ఒకే ఫ్రేమ్‌లో కనిపించాయి.తర్వాత ఆ ఫోటోను ప్రస్తుత నిజాం వారసుడు అజ్మత్ జా గారికి ఫలక్‌నుమా ప్యాలెస్‌లో చూపించాను. ఆయనకు ఆ చిత్రం ఎంతో నచ్చడం నాకు మరింత ఆనందాన్ని ఇచ్చింది. ఆ ఫోటో కేవలం ఒక చిత్రం కాదు... చరిత్రలో నిలిచిపోయిన ఒక క్షణాన్ని నా కెమెరాతో శాశ్వతంగా నిలిపిన జ్ఞాపకం.

**నినాదం : ఈ రోజుల్లో ఏ ఐ ఇమేజ్ జనరేషన్ వేగంగా పెరుగుతోంది. ఇలాంటి సమయంలో మానవ ఫోటోగ్రాఫర్ విలువ ఎలా మారుతుంది అని మీరు భావిస్తున్నారు?**

మహేష్ విశ్వనాథ : ఫోటోగ్రఫీ అంటే ఒక క్షణాన్ని, ఒక భావోద్వేగాన్ని, ఒక నిజాన్ని శాశ్వతంగా నిలిపేయడం. AI ఎంత అభివృద్ధి చెందినా, నిజ జీవితంలో కెమెరా బంధించే భావోద్వేగాన్ని, సహజ రంగులను, ఆ క్షణం వెనుక ఉన్న అనుభూతిని పూర్తిగా పునఃసృష్టించలేదు.ఏ ఐ ఒక సాధనం మాత్రమే, కానీ ఫోటోగ్రాఫర్‌కు ప్రత్యామ్నాయం కాదు. ఏ ఐ తో రూపొందించిన చిత్రాలకు కూడా అసలు ఆధారం నిజమైన ఫోటోలే. వార్తా ఫోటోగ్రఫీ, డాక్యుమెంటరీలు, చరిత్రను నమోదు చేసే చిత్రాల్లో మానవ ఫోటోగ్రాఫర్ పాత్ర ఎప్పటికీ తగ్గదు. సాంకేతికత మారొచ్చు, కానీ నిజాన్ని బంధించే కెమెరా విలువ మాత్రం ఎప్పటికీ అలాగే ఉంటుంది.

**నినాదం : సోషల్ మీడియాలో వైరల్ అయ్యే ఫోటోకి, చరిత్రలో నిలిచిపోయే ఫోటోకి మధ్య తేడా ఏమిటి?**

మహేష్ విశ్వనాథ :
వైరల్ కావడం, చరిత్రలో నిలిచిపోవడం రెండూ వేర్వేరు విషయాలు. సోషల్ మీడియాలో లక్షల మంది ఒక ఫోటోను చూడొచ్చు, కానీ అది చరిత్రలో నిలిచిపోతుందని చెప్పలేం. ఒక గొప్ప ఫోటోకు లైక్స్ కంటే బాధ్యత ఎక్కువ ముఖ్యం.ఈరోజు ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ కెమెరా ఉంది. అందువల్ల ఎన్నో అరుదైన క్షణాలు రికార్డ్ అవుతున్నాయి. కానీ ప్రతి ఫోటోను ప్రచురించే ముందు అది ఎవరికైనా నష్టం చేస్తుందా? వారి గోప్యతకు భంగం కలిగిస్తుందా? అనే ఆలోచన ఉండాలి.ఒక శిక్షణ పొందిన ఫోటోగ్రాఫర్ కేవలం ఫోటో తీయడమే కాదు, దాన్ని ప్రచురించాలా వద్దా అనే నైతిక బాధ్యతను కూడా గుర్తుంచుకుంటాడు. నా దృష్టిలో ఫోటోగ్రఫీలో లైక్స్ కంటే 'ఫిల్టర్' ముఖ్యం. ఎలాంటి ఫోటోను ప్రపంచానికి చూపించాలి, ఎలాంటి ఫోటోను చూపించకూడదు అనే వివేకమే ఒక నిజమైన ఫోటోగ్రాఫర్‌ను ప్రత్యేకంగా నిలబెడుతుంది.

**నినాదం : ఇప్పటివరకు మీరు తీసిన ఫోటోల్లో "ఈ క్షణం నన్ను ఎంచుకుంది" అనిపించిన ఫోటో ఏది?**

మహేష్ విశ్వనాథ:
ఒకసారి హైదరాబాద్ ఓల్డ్ సిటీలో ఉద్రిక్త పరిస్థితుల మధ్య రాపిడ్ యాక్షన్ ఫోర్స్ విధులు నిర్వహిస్తోంది. ఆ సమయంలో ఓ తండ్రి తన చిన్న కుమార్తెను బైక్ ట్యాంక్‌పై కూర్చోబెట్టి అక్కడికి వచ్చాడు. తండ్రి భయపడకుండా భద్రతా సిబ్బందితో మాట్లాడుతుంటే, ఆ చిన్నారి మాత్రం వారి చేతిలోని తుపాకీని భయంతో చూస్తోంది. ఆ కళ్లలో కనిపించిన అమాయకమైన భయం నా కెమెరాలో బంధించబడింది. ఆ ఫోటోలో నాకు కనిపించింది ఒక్క చిన్నారి భావోద్వేగమే. అలాంటి క్షణాలే ఫోటోగ్రాఫర్‌ను వెతుక్కుంటూ వస్తాయి.

**నినాదం : హెరిటేజ్ ఫోటోగ్రఫీని ఒక బాధ్యతగా భావిస్తారా?**

మహేష్ విశ్వనాథ:
ఖచ్చితంగా. హెరిటేజ్ ఫోటోగ్రఫీ అనేది కేవలం ఫోటోలు తీయడం కాదు, చరిత్రను భవిష్యత్ తరాలకు భద్రపరచడం. బ్రిటిష్ కాలంలో మన ఆలయాలు, కట్టడాలను ఫోటోలు తీసి నమోదు చేయకపోయి ఉంటే, వాటి అసలు రూపాన్ని మనం ఈరోజు చూసే అవకాశం ఉండేది కాదు. అందుకే



ఒక ఫోటో విలువ కాలంతో పాటు మరింత పెరుగుతుంది. రేపు ఆ కట్టడం లేకపోయినా, మనం తీసిన ఫోటో మాత్రం దానికి సాక్ష్యంగా నిలుస్తుంది.

**నినాదం : ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంతుంది . అందరూ ఫోటోగ్రాఫర్లమనే భావిస్తున్నారు దీనిపై మీరేమంటారు**

మహేష్ విశ్వనాథ: ప్రతి ఒక్కరి చేతిలో ఫోన్ ఉండొచ్చు, కానీ అందరూ గొప్ప ఫోటోగ్రాఫర్లు కాలేరు. ఫోటోగ్రఫీని నేర్చుకోవాలనే ఆసక్తి ఉండాలి. అవార్డు గెలిచిన చిత్రాలు ఎందుకు ప్రత్యేకమయ్యాయో తెలుసుకోవాలి. కేవలం పది నిమిషాలైనా, పావుగంటైనా ఫోటోగ్రఫీపై అవగాహన పెంచుకుంటే, ఏ ఫోన్‌తోనైనా అద్భుతమైన చిత్రాలు సృష్టించవచ్చు.

**నినాదం : ఫోటో కోసం మీరు చేసిన అత్యంత ప్రమాదకరమైన ప్రయత్నం ఏది?**

మహేష్ విశ్వనాథ: కరోనా తర్వాత ఊటీలోని అగస్త్య జలపాతం చాలా కాలం ప్రజలకు మూసివేశారు. ఆ దృశ్యాన్ని చిత్రీకరించాలనే పట్టుదలతో కష్టమైన మార్గంలో వెళ్లాను. బురద, పడిపోయిన విద్యుత్ తీగలు దాటుకుంటూ జలపాతం వద్దకు చేరుకున్నాను. అక్కడ జారి పడటంతో నా కెమెరా, లెన్స్ దెబ్బతిన్నాయి. కానీ మెమరీ కార్డులో ఆ ఫోటో సురక్షితంగా ఉంది. ఆ రోజు నాకు ఒక మంచి ఫోటో కోసం ఫోటోగ్రాఫర్ ఎంతటి త్యాగమైనా చేస్తాడనే విషయం మరోసారి అర్థమైంది.

**నినాదం : మీరు ఫోటోగ్రాఫర్‌గా ఉన్న మీరు రచయితగా మారడానికి కారణం ఏంటి? రచయితగా ఒక వ్యక్తిత్వం, ఫోటోగ్రాఫర్‌గా ఒక వ్యక్తిత్వం... ఈ రెండూ ఒకదానికొకటి ఎలా సహాయపడుతున్నాయి?**

మహేష్ విశ్వనాథ :
మొదట నేను ఫోటోగ్రాఫర్‌నే. నా ప్రయాణం ఫోటోగ్రఫీతోనే ప్రారంభమైంది. రచన అనేది నేను ప్లాన్ చేసి చేసే పని కాదు. ఎప్పుడైనా మనసులో చాలా బలమైన భావోద్వేగం కలిగినప్పుడు మాత్రమే కలం పట్టుకుంటాను. తీవ్రమైన బాధ, కోపం, అవమానం లేదా సమాజానికి చెప్పాలనిపించే ఒక ఆలోచన నాలో బలంగా ఉద్భవించినప్పుడు అది పదాల రూపంలో బయటకు వస్తుంది. అలాంటి సందర్భాల్లోనే నేను రాస్తాను.ఫోటోగ్రఫీ విషయానికి వస్తే, అది నాకు వృత్తి కంటే ఎక్కువగా ఒక మానసిక విశ్రాంతి. విదేశాల్లో ఉన్నప్పుడు ప్రతి ఆదివారం కెమెరా తీసుకుని నగర వీధుల్లో తిరుగుతూ కనిపించిన ప్రతి క్షణాన్ని బంధించేవాడిని. ఫోటోలు తీయడం నాకు ఒక థెరపీ లాంటిది. ఎంత ఒత్తిడి, బాధ లేదా డిప్రెషన్ ఉన్నా కెమెరా చేతిలోకి రాగానే మనసు తేలికపడుతుంది. అందుకే ఫోటోగ్రఫీని నేను ఒక ఔషధంలా భావిస్తాను.అదే విధంగా కవిత్వం కూడా నాకు భావోద్వేగాలను బయటపెట్టే మార్గం. మనసులోని ఆలోచనలను కాగితంపై రాసిన తర్వాత ఒక ప్రశాంతత, ఉపశమనం కలుగుతుంది.

**నినాదం : మీరు ఫోటో తీయడానికి ముందు కథను వెతుకుతారా? లేక కథే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తుందా?**

మహేష్ విశ్వనాథ :
ఒక స్ట్రీట్ ఫోటోగ్రాఫర్‌కు ముందు కావాల్సింది ఖరీదైన పరికరాలు కాదు, పదునైన పరిశీలన. సాధారణంగా కెమెరాతో వచ్చే కిట్ లెన్స్‌తోనే స్ట్రీట్ ఫోటోగ్రఫీ, పోర్ట్రెయిట్, ల్యాండ్‌స్కేప్ వంటి అనేక రకాల ఫోటోలు తీయవచ్చు. ప్రత్యేకమైన లెన్స్‌లు మ్యాక్రో, పక్షులు లేదా అడవి జంతువుల ఫోటోగ్రఫీకి మాత్రమే అవసరం.కానీ మంచి స్ట్రీట్ ఫోటోగ్రఫీకి అసలు అవసరమైంది లెన్స్ కాదు... మనసు సిద్ధంగా ఉండటం. రోడ్డుపై అడుగుపెట్టిన క్షణం నుంచి చుట్టూ జరిగే ప్రతి విషయాన్ని గమనించే అలవాటు ఉండాలి. భయపడకుండా, సరైన సమయంలో స్పందించే ధైర్యం ఉండాలి.స్ట్రీట్‌లో జరిగే సంఘటనలు ఒక్కసారి మాత్రమే జరుగుతాయి. ప్రమాదం, గొడవ లేదా ఏదైనా భావోద్వేగ క్షణం మళ్లీ పునరావృతం కాదు. అందుకే కెమెరా సెట్టింగ్స్‌ను ముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఐఎస్ఓను ఆటోలో, షట్టర్ స్పీడ్‌ను వేగంగా ఉంచితే ఆ క్షణాన్ని వెంటనే బంధించగలుగుతాం.మంచి ఫోటో అంటే కేవలం ఒక దృశ్యాన్ని రికార్డ్ చేయడం కాదు, ఒక కథను చెప్పడం. ఉదాహరణకు, "హెల్మెట్ ధరించండి" అనే బోర్డు ముందు నుంచి హెల్మెట్ లేకుండా వెళ్తున్న బైక్ రైడర్‌ను ఒకే ఫ్రేమ్‌లో బంధిస్తే, ఆ ఫోటో ఒక సామాజిక సందేశాన్ని చెబుతుంది.అలాంటి కథలను చెప్పాలంటే ముందుగానే ఊహించగలగాలి. కొన్ని సందర్భాల్లో ఒక దృశ్యాన్ని ముందుగా ఫ్రేమ్ చేసి, సరైన వ్యక్తి లేదా సరైన క్షణం అక్కడికి వచ్చే వరకు ఓపికగా ఎదురుచూడాలి. స్ట్రీట్ ఫోటోగ్రఫీలో విజయం అనేది ముందుచూపు, పరిశీలన, సమయస్ఫూర్తి అనే మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది.

**నినాదం : మీకు ఒకరోజు సమయం దొరికితే ప్రపంచంలో ఏ ప్రదేశానికైనా వెళ్లి ఒక ఫోటో తీయాలంటే ఎక్కడికి వెళ్తారు? ఏ ఫోటో తీస్తారు?**

మహేష్ విశ్వనాథ : నాకు అవకాశం వస్తే ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా అక్కడికి వెళ్లి యుద్ధాన్ని చిత్రీకరించాలనే కోరిక ఉంది. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉంది, సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ చేయడం సులభం. కానీ ప్రాణాలను పణంగా పెట్టి యుద్ధ వాస్తవాలను ప్రపంచానికి చూపించే ధైర్యం చాలా కొద్దిమందికే ఉంటుంది.నా ఫోటోగ్రఫీ ప్రత్యేకంగా నిలవాలంటే అలాంటి నిజమైన అనుభవాలను కెమెరాలో బంధించాలి అనుకుంటాను. యుద్ధంలో ఉండే భయం, బాధ, మానవీయ విషాదం, అక్కడి భావోద్వేగాలు——వాటిని ప్రత్యక్షంగా చూసి ప్రపంచానికి చూపించాలనేది నా లక్ష్యం. అక్కడ సౌకర్యాలు ఉండవు, ఫోన్ ఛార్జ్ చేసుకునే పరిస్థితి కూడా ఉండకపోవచ్చు. అయినా ఆ కఠిన పరిస్థితుల్లోనే నిజమైన ఫోటోగ్రఫీ ఉంటుంది. ఇండియా–పాకిస్తాన్, ఇండియా–చైనా లేదా ఉక్రెయిన్ వంటి యుద్ధ ప్రాంతాలకు వెళ్లి అక్కడి వాస్తవాలను చిత్రీకరించాలని ఎప్పటి నుంచో కోరుకుంటున్నాను.

**నినాదం : మీ ఫోటోగ్రఫీ కెరీర్‌లో ఎదురైన తిరస్కరణలు మీకు ఏం నేర్పాయి?**

మహేష్ విశ్వనాథ : నా కెరీర్ ప్రారంభంలో స్టిల్ లైఫ్ ఫోటోగ్రఫీ పోటీల్లో పాల్గొన్నప్పుడు నా ఫోటోలు "యాక్సెప్టెన్స్" కూడా పొందేవి కావు. అంటే ఆ పోటీలో పాల్గొనే అర్హత కూడా లేదని చెప్పినట్టే. కానీ నేను అక్కడే ఆగిపోలేదు.జీరో నుంచి మొదలుపెట్టి, ఒక రోజు నా ఫోటోకు తొలి "యాక్సెప్టెన్స్" వచ్చింది. అప్పట్లో అదే నాకు పెద్ద అవార్డు లాగా అనిపించింది. ఆ తర్వాత క్రమంగా అవార్డులు రావడం మొదలైంది. నేడు స్టిల్ లైఫ్ ఫోటోగ్రఫీ అంటే నా పేరు గుర్తుకు వచ్చే స్థాయికి రావడం వెనుక నిరంతర సాధన, అధ్యయనం, సీనియర్ల సలహాలు, పాత క్యాటలాగ్‌లు, గత పోటీల ఫలితాలను విశ్లేషించడం వంటి అంశాలే కారణం. తిరస్కరణలు నన్ను వెనక్కి నెట్టలేదు.. మరింత నేర్చుకునేలా, మెరుగుపడేలా చేశాయి.

**నినాదం : ఒక మంచి ఫోటోగ్రాఫర్ కావడానికి టెక్నికల్ నాలెడ్జ్ ముఖ్యమా? లేక జీవితాన్ని గమనించే అలవాటు ముఖ్యమా?**

మహేష్ విశ్వనాథ: మంచి ఫోటోగ్రాఫర్ కావాలంటే ముందుగా టెక్నికల్ నాలెడ్జ్ చాలా ముఖ్యం. మనం కారు నడపాలంటే క్లచ్ ఎక్కడుంది, బ్రేక్ ఎలా వేయాలి, గేర్ ఎలా మార్చాలి అనేవి తెలిసి ఉండాలి కదా. అలాగే కెమెరాలోని ప్రతి అంశం గురించి కూడా పూర్తిగా తెలుసుకోవాలి.నీ చేతిలో ఉన్న ఆయుధం గురించి తెలియకపోతే యుద్ధంలో దాన్ని ఎలా ఉపయోగిస్తావు? అలాగే కెమెరా గురించి తెలియకుండా మంచి ఫోటోలు తీయడం కష్టం.ముందుగా కెమెరాను తీసుకుని ప్రశాంతంగా కూర్చో. ఎవరి కోసం కాదు, ఏ ఉద్దేశంతో కాదు. కెమెరాలోని ప్రతి మెనూను చదువు. ప్రతి బటన్ నొక్కితే ఏమవుతుంది, ఏ ఫీచర్ ఎలా పనిచేస్తుంది, ఏ సెట్టింగ్‌ను ఎప్పుడు ఉపయోగించాలి——అన్నీ పూర్తిగా తెలుసుకో. నీ దగ్గరున్న కెమెరా ఏయే అవకాశాలు ఇస్తుందో అర్థం చేసుకోవాలి.ఇప్పుడు ₹35 వేల నుంచి ప్రారంభమై లక్షలు, ₹20 లక్షలు, ₹50 లక్షలు, కోటి రూపాయల విలువ చేసే కెమెరాలు కూడా ఉన్నాయి. కానీ కెమెరా ధర కాదు, దాన్ని ఉపయోగించే వ్యక్తి నైపుణ్యమే ముఖ్యం. ₹10 వేల కెమెరాతో తీసిన ఫోటో కూడా కోట్లాది మంది మెచ్చే స్థాయికి చేరుకోవచ్చు.అందుకే మొదట జీవితం గురించి కాదు, కెమెరా గురించి నేర్చుకో. నీ చేతిలో ఉన్న కెమెరాలోని ప్రతి ఆప్షన్ నీకు పూర్తిగా తెలిసి ఉండాలి. దాన్ని ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఉపయోగించాలో అర్థమైతేనే మంచి ఫలితాలు వస్తాయి.

**నినాదం : ఇప్పటివరకు మీరు ఎన్నో వందల అవార్డులు అందుకున్నారు. అయినప్పటికీ ఇంకా సాధించాలనే పెద్ద కల ఏదైనా ఉందా?**

మహేష్ విశ్వనాథ : అమెరికాలో జర్నలిజంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పులిట్జర్ అవార్డు (పులిటీజర్ ప్రైజ్ ) ఉంటుంది. సాధారణంగా అది వార్తాపత్రికల్లో పనిచేసే ఫోటో జర్నలిస్టులకు లభిస్తుంది. ఆ అవార్డును ఎప్పుడో ఒకరోజు నేను కూడా సాధించాలని కోరుకుంటున్నాను.మనిషికి ఎప్పుడూ ఒక కల ఉండాలి. అది నెరవేరొచ్చు, నెరవేరకపోవచ్చు. కానీ



ఆ కల కోసం ప్రయత్నించడం చాలా ముఖ్యం. అదే మనలో ముందుకు వెళ్లాలనే తపనను నిలబెడుతుంది.మన దగ్గర ఎంత ఉన్నా, ఇంకా సాధించాల్సింది ఉందనే భావన ఉండాలి. "ఇక నాకు అన్నీ వచ్చేశాయి" అనే ఆలోచన ఉండకూడదు. ఎప్పుడూ నేర్చుకోవాలనే దాహం ఉండాలి. అందుకే ఆ అవార్డు కోసం ప్రయత్నిస్తూనే ఉంటాను.దానికి చాలా అడ్డంకులు ఉన్నాయి. నిజానికి నేను ఫోటో జర్నలిస్ట్‌ను కూడా కాదు. అలాంటప్పుడు నాకు ఆ అవార్డు ఎలా వస్తుంది అని ఆలోచించి ఆగిపోవడం కాదు. దాని గురించి ఆలోచిస్తూ, దాని కోసం కృషి చేస్తూ ఉంటే ఒకరోజు అది సాధ్యమవుతుందని నమ్ముతున్నాను.

**నినాదం : ఫోటోగ్రాఫర్ కావాలనుకునే వారికి మీరు ఇవ్వాలనుకునే సందేశం ఏమిటి?**

మహేష్ విశ్వనాథ : మీ దగ్గర ఉన్న కెమెరా ఎంత ఖరీదైనదనేది కాదు, దాన్ని ఎంత బాగా ఉపయోగించగలరన్నదే ముఖ్యం. ఒకే కెమెరా, ఒకే లెన్స్‌తో అద్భుతమైన ఫోటోలు తీయగలిగే నైపుణ్యాన్ని ముందుగా పెంచుకోండి. ఆ తర్వాతే కొత్త పరికరాల గురించి ఆలోచించండి.ఫోటోగ్రఫీలో ఎన్నో విభాగాలు ఉన్నాయి. వాటిలో మీకు నిజంగా నచ్చిన రంగాన్ని ఎంచుకుని, అదే దిశగా నిరంతరం నేర్చుకుంటూ ముందుకు వెళ్లండి. పుస్తకాలు చదవండి, వీడియోలు చూడండి, అనుభవజ్ఞుల నుంచి నేర్చుకోండి.ఖరీదైన కెమెరా లేదా లెన్స్ లేకపోవడం విజయానికి అడ్డంకి కాదు. పట్టుదల, సాధన, స్పష్టమైన లక్ష్యం ఉంటే ఏ పరికరంతోనైనా మంచి ఫోటోలు తీయవచ్చు.గొప్ప ఫోటోగ్రఫీ అనేది కేవలం కెమెరా వల్ల కాదు. సరైన సమయం, సరైన క్షణం, సరైన దృక్కోణం, సరైన కెమెరా సెట్టింగ్స్——ఈ నాలుగు కలిసినప్పుడే ఒక ఫోటో కళాఖండంగా మారుతుంది.

**ఇంటర్వ్యూ**
**గుంపుల ఇందిరా ప్రియదర్శిని యాదవ్**
**బ్యూరో చీఫ్ నినాదం**



### మహేష్ – ర్యాపిడ్ ఫైర్

నినాదం : కెమెరానా, కలమా?
మహేష్ : కెమెరా.
నినాదం : రంగులు లేదా బ్లాక్ అండ్ వైట్?
మహేష్ : రంగులు.
నినాదం : ఉదయం సూర్యోదయం లేదా సాయంత్రం సూర్యాస్తమయం?
మహేష్ : సూర్యోదయం.
నినాదం : ప్లాన్డ్ షాట్ లేదా క్యాండిడ్ షాట్?
మహేష్ : క్యాండిడ్ షాట్.
నినాదం : మొబైల్ కెమెరా లేదా డీఎస్ఎల్ఆర్ ?
మహేష్ : డీఎస్ఎల్ఆర్.
నినాదం : ఒక ఫోటో లేదా వెయ్యి పదాలు?
మహేష్ : ఒక ఫోటో.
నినాదం : అవార్డు లేదా ప్రేక్షకుల ప్రశంస?
మహేష్ : అవార్డు.
నినాదం : ప్రయాణం లేదా గమ్యం?
మహేష్ : ప్రయాణం.

Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028
Published at 6-3-439, Kisannagar, Karimnagar-505001(TS) Editor: B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787